# త్రిశంకు వర్గం

రమణయ్య కళ్ళు మెరిశాయి. చెయ్యి చాపి 'ఎంత?' అని అడిగాడు.

కూరల బండివాడు చూపులు అటు తిప్పి మళ్ళీ రమణయ్య వంక అదొక రకంగా చూస్తూ "ఎనిమిది రూపాయలు" అని సమాధానం చెప్పాడు.

"అరె! చవకేనే" అనుకుని రమణయ్య రెండు నిమిషాల ముందే తోటకూర కాడలు కొన్నందుకు పశ్చాత్తాపపడ్డాడు.

వాడు రమణయ్య వాలకం చూసి ఏమి గ్రహించాడో ఏమో "అయ్యగారూ! పావు కిలో ఎనిమిది రూపాయలు. కిలో కాదు" అన్నాడు వెంటనే. సాగిన చెయ్యి ఆగిపోయింది.

"పావు కిలో ఎనిమిది రూపాయలా?" అన్నాడు ఆశ్చర్యంతో.

"అవును బాబూ."

రమణయ్య చివరిసారిగా అటు చూసి గ్రుక్కిళ్ళు మింగుతూ వెనుకంజ వేసి నడిచాడు. ఇక నడుస్తున్నంతసేపూ ఆకాకరకాయలే కళ్ళముందు కదిలాయి. ముదురాకుపచ్చ రంగులో నవనవలాడుతున్న ఆకాకరకాయలు!

"ఎన్నేళ్ళయింది రుచి చూసి ?" అనుకున్నాడు.

పాతిక ఏళ్ళక్రిందటి మాట. ఒకప్పుడు గుంటూరు వెళ్ళాడు తాను. ఒక స్నేహితుడి ఇంట్లో భోజనం. ఆనాడు ఆకాకరకాయ కూర వెర్రిగా తిన్నాడు మళ్ళీ అడిగి వడ్డించుకుని తిన్నాడు. అవతలి వాళ్ళేమైనా అనుకుంటారేమో అని కూడా ఆలోచించలేదు. ఇన్నేళ్ళుగా గుర్తున్నది ఆనాటి రుచి. మళ్ళీ ఎన్నడూ కుదరలేదు. ఇక్కడ అవి ఎప్పుడోగాని దొరకవు. ఇవాళ కనిపించాయి. అయితే, ధర సంగతి ఏమిటి ?

ఒకవేళ తెగించి ఒక పావు కిలో తీసుకు వెళ్ళినా సుఖం లేదు. ఎనిమిది రూపాయలకూ ఏ ఎనిమిది కాయలో వస్తాయి. అవి ఎవరి ముక్కులోకి ? పెళ్ళాం, ముసలి ప్రాణం అయితేనేమి తల్లి, చిరుద్యోగి పెద్ద కొడుకు, నిరుద్యోగి డిగ్రీ హోల్డర్ చిన్న కొడుకు, గుండెల మీది కుంపటి పెద్దమ్మాయి, చిచ్చరపిడుగు చిన్న మ్మాయి - ఇన్ని నోళ్ళకు పావు కిలో ఏ మూలకు ?

రమణయ్య నడుస్తూ నడుస్తూ "అబ్బ" అనుకున్నాడు. ఆగాడు.

చూస్తే కాలి చెప్పు అడుగున అరిగిపోయిన చోట నగరంలో రహదారి వైభవాన్ని చాటుతూ కింది నుంచి పదునైన ములుకు వంటి రాయి గుచ్చుకున్నది. "ఇప్పుడు కార్పొరేషన్ రోడ్ల స్థితిగతులను గురించి ఆలోచనలేల? ముందు చెప్పు సంగతి చూద్దాం" అనుకున్నాడు.

వంగి చెప్పు విడిచి చేతిలోకి తీసుకుని తిప్పి చూసి 'ఇహ లాభం లేదు. రేపు జీతం రాగానే ముందు వీటిని అవతల పారేసి కొత్తవి కొనాలి. కొని తీరాలి' అనుకున్నాడు. నలభై, యాభై రూపాయలు తగలేసి చెప్పులు కొన్నప్పటికీ అదేమి చిత్రమో, మూణ్ణెల్లు గడిస్తే గొప్ప.

మళ్ళీ చెప్పు కింద పడేసి కాలు దూర్చి నడవడం ప్రారంభించాడు. అయిదు లేక ఆరు నిమిషాలు. ఇదుగో బీసెంటు రోడ్డు....చీకటి పడింది కదా! అయినా, ఇక్కడ పట్టపగలులా వెలుతురు విరగబడిపోతున్నది. అటూ ఇటూ అద్భుతమైన షాపులు....అందాల షోకేసులు....లోపల కళ్ళు జిగేల్ మనిపించే లైట్లు.... రోడ్డు అంతా రద్దీగా ఉంటుంది. మనుషులు భుజాలు ఒరుసుకుంటూ నడవవలసిందే.

ఒక పెద్ద షాపు. లోపల అంతా వెలుతురు. చంద్రబింబం ఆ లోపలే ఉండి ఉజ్జ్వలంగా వెలుగుతున్నట్టు....అన్నీ అద్దాలే కావడం వల్ల వెలుతురు మరీ పగల బడి పోతున్నది. లోపల వరుసగా అసంఖ్యాకంగా రకరకాల టీవీ సెట్లు....

రమణయ్య తోటకూరకాడలు విరిచి, ముక్కలు చేసి పైకి ఏమాత్రం కన

బడకుండా జాగ్రత్తపడి సంచీలో సర్ది, అద్దాల తలుపులు తోసుకుని లోపల ప్రవే శించాడు.

కొందరు ఖరీదైన వ్యక్తులు - ఆడా మగా - కొన్ని టీవీల ముందు నిలబడి నాణ్యత పరిశీలిస్తున్నారు. బహుశా రోడ్డు కవతలి పక్కన ఉన్న ఫియట్లూ, మారుతీ కారులూ వీరివే అయి వుంటాయి.

రమణయ్య నేరుగా వెళ్ళి ఒక టీవీ సెట్ ముందు నిలబడ్డాడు. ఆన్ చేసే ఉండడం వల్ల బొమ్మ వస్తున్నది కానీ, శబ్దం లేదు. ఎత్తుగా రథం లాగుతున్నది. రంగుల్లో హిమాలయ ప్రాంతాల అందాలు వస్తున్నాయి. పచ్చ పచ్చని మైదానాలు, కన్నుల పండుగ చేసే లోయలు, రంగులు విరజిమ్మే ఆకాశం. అంతా అలా విగ్ర హంలా నిలబడి చూశాడు.

చాలా ఏళ్ళ కిందట టీవీ అనబడే అద్భుతం ఒకటి ఉందని విన్నాడు. కానీ, తన జీవితకాలంలోనే అది ఇలా ఇంత సమీపానికీ, అందుబాటులోకీ వస్తుందని అను కోలేదు.

అలా ముగ్ధుడై నిలబడిపోయిన రమణయ్యను మామూలుగానే రోజూ పలక రిస్తున్నట్టే షాపులో కుర్రవాడు - పాతిక ఏళ్ళవాడు - పలకరించాడు.

"ఏం సార్! నిన్న రాలేదే" అన్నాడతను.

రమణయ్య నసుగుతూ "నిన్న....అవును....రాలేదు. ఆఫీసులో పని తెమల లేదు. బాగా ఆలస్యమైపోయింది" అంటున్నాడు.

అతడు ఈ మాటల మీద అంత శ్రద్ధ చూపించకుండా ఎవరో కస్టమర్ పిలిస్తే కాబోలు అవతలికి వెళ్ళిపోయాడు.

ఆ ప్రోగ్రాం అయిపోయింది. వార్తలు మొదలైనాయి. బాగా కొట్టొచ్చినట్టు మేకప్ చేసుకున్న న్యూస్ రీడర్లు వార్తలు చదవడం ప్రారంభించారు.

రమణయ్య కదలికను గమనించి ఆ కుర్రవాడు "ఏం సార్! వెళ్ళిపోతు న్నారా?" అన్నాడు.

"ఆఁ. వెళ్ళాలి. అన్నట్టు నీ పేరేం చెప్పావు మొన్న?" అని తడబడు తుండగా -

"మోహన్ అండీ" అన్నాడతను.

"మీ కాలేజీలో ఇంటర్ చదివాను" అని గుర్తు చేశాడు.

"ఆఁ! గుర్తుంది....అన్నట్టు ఇది మంచి టీవీ అంటావా?"

"మంచి కాదండీ గొప్పటీవీ. టీవీ ప్రపంచంలో ఒక అద్భుతం. రోజూ కనీసం ఒక్కసారైనా వెళ్ళిపోతూ ఉంటుంది. మీరు మొదటినుంచీ దాని ముందే నిలబడుతున్నారు. చూశాన్నేను.... మిగిలినవాటి కంటే ఖరీదెక్కువే అయినా, మీరు అదే తీసుకోండి. ఒక జీవితకాలం పనిచేసే వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తగా మంచివే కొనాలి. డబ్బు గురించి ఆలోచించకూడదు." ఇలా సాగింది ఆ కుర్రవాడి ధోరణి.

'అవునవును. నువ్వు చెప్పేది నిజమే' అంటూ రమణయ్య ఇవతలికి వచ్చాడు. మళ్ళీ రోడ్డుమీద నడక సాగించాడు.

రోడ్డు మధ్యలో పార్కింగ్ స్థలం. వివిధ వాహనాలు.... లెక్కలేనన్ని.... నిలబడి ఉన్నాయి. పేవ్‌మెంట్లమీద కూడా ఎక్కడా అంగుళం ఖాళీ లేకుండా చేతి రుమాళ్ళ మొదలు జీన్స్, పంజాబీ డ్రెస్సుల వరకు, బ్లేడుల దగ్గర నుంచి ఫారిన్ సెంట్ల వరకు అన్ని వస్తువులూ అమ్ముతూ, అరుస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తూ ఎందరో హాకర్లు.... ఆ వెనుక అటూ ఇటూ కళ్ళు మిరుమిట్లు గొలిపే ఫ్యాన్సీ సామానులు, బట్టల దుకాణాలు.

అంతా కోలాహలంగా సంతలాగున్నది.

రమణయ్య కాలేజీ నుంచి ఇంటికి వెళ్ళేందుకు నిజానికి ఇటువైపు రానక్కర లేదు. కానీ అతడు తప్పని సరిగా ఇటే వస్తాడు. ఆ రోడ్డు మీద నడుస్తూ ఉంటే అతనికి చాలా హుషారుగా ఉంటుంది. రద్దీ ఎంతచిక్కగా ఉంటుందంటే, మనుష్యులు ఒకరి నొకరు తగలకుండా నడవడమే కష్టం కానీ, ఎవరూ ఏమీ అనుకోరు. ఎవరి పాటికి వారు ముందుకు దూసుకుపోతూ ఉంటారు. షాపింగ్ పేరుతో నోట్ల కట్టలు చేతి సంచుల్లో కుక్కుకుని, కార్లు రోడ్ మొదటనో, ఎక్కడో పార్కింగ్ ప్లేసులో నిలిపి ఉంచి ఆడా మగా అందరూ ఆ వీధిన పడతారు. అక్కడ దొరకని వస్తువు వుండదు. పైగా పండుగ దినాలు కావడంతో దుకాణాలన్నీ క్రిక్కిరిసి ఉండి, ఆ రోడ్ నిజంగానే రైలు వచ్చినవేళ ప్లాట్‌ఫారంలా వుంటుంది.

రమణయ్యకు మళ్ళీ ఆకాకరకాయలు గుర్తుకొచ్చాయి. తాను అంతకు ముందే తోటకూరకాడలు కొన్నాడు, చవక కదా అని. అవి అయితే పప్పులోకి పుష్కలంగా ఆకూ వస్తుంది, ఇంటిల్లిపాదికి కూర కూడా సమకూరుతుంది. పైగా చవకకూడాను.

ఆ రోడ్డు అంత రంగ రంగ వైభవంగా ఉన్నదా, ఇక అవతలి, ఇవతలి రోడ్ల సంగతి చెప్పనే అక్కర్లేదు. అటు అన్నీ సినిమా హాళ్ళు. మొత్తం ఏదో

ఎనిమిదో కూడబల్కున్నట్టు ఒకచోట వున్నాయి. కొన్ని అయితే సినిమా హాళ్లు ప్లస్ కాంప్లెక్స్‌లు. వీటితో ఆ రోడ్లన్నీ ఎల్లప్పుడూ జనారణ్యాలలాగా ఉంటాయి.

కనీసం వారానికి రెండు మూడు కొత్త సినిమాలయినా విడుదల అవుతుంటాయి. సినిమా విడుదల అయిన రోజున ఆ రోడ్లలో బీభత్సం వర్ణించడం అసాధ్యం. ఆ బ్యానర్లేమిటి, ఆ తోరణాలేమిటి, ఆ కరపత్రాలు, పోస్టర్లేమిటి - అంతా గొప్ప అలజడి. అక్కడ రోజంతాచేరి కుర్రమూకలు సృష్టించే ధ్వని కాలుష్యం చుట్టుపక్కల మామూలు మనుషులకు కలవరం, దడ పుట్టిస్తాయి.

రమణయ్య నడుస్తున్నవాడల్లా ఆగి జేబు తడుముకుని వీధి మూల చేయిచాపి నిలబడి వున్న మనిషి చేతిలో పది పైసల నాణెం పడేశాడు.

ఇక ఆ రోడ్డు తిరిగితే కొంతమేర చీకటి.... ఆ తర్వాత వంతెన.... అది దాటి కట్ట దిగి రెండు ఫర్లాంగులు నడిస్తే యిల్లు. వీధి మొదట్లో పెద్ద ఆవరణలో ఒక యిల్లు.... ముందు వెనకల పెద్ద ఖాళీస్థలం. ఆ యిల్లు ఒక రిక్షాల ఓనర్‌ది. అతనికి సాతిక ముప్పై రిక్షాలున్నాయి. వెనుక గేదెల పాక .... అందులో పది పది హేను మేలిజాతి గేదెలు.... అతడు అప్పులిచ్చి వడ్డీలు గుంజుతూ పెరిగిపోయాడు.

వీధిచివర మళ్ళీ ఒక పెద్ద ఆవరణ....మధ్యలో రమ్య హర్మ్యం.... ఆ ఇంటి ఆసామీ మహా సంపన్నుడు. తండ్రి ఇచ్చి పోయింది తక్కువే అయినా, తన ప్రతిభతో కోట్లు గడించి రాజకీయాలలో దూకబోతున్నాడు.

ఈ మధ్యలో అటూ యిటూ అన్నీ మామూళ్ళ ఇళ్ళు. ఎక్కువ భాగం పెంకుటిళ్ళు.... పాత కాలపు కట్టడాలు. కొన్ని మాత్రం చిన్నసైజు గట్టి ఇళ్ళు.

రమణయ్య నదిని గుర్తు చేసుకున్నాడు. తమ వీధి చివరకు వెళ్ళి కట్ట దిగితే నది.

వేసవి అయితే ప్రోషితభర్తృకలాగా కృశించిపోతుంది. అప్పుడంతా ఇసుక మేటలు. మధ్యలో అక్కడక్కడ కొంచెం నీరు.

వేసవి గడిచిపోగానే నాలుగు మబ్బులు గుమికూడి గర్జించి చినికితే చాలు, ఎక్కడో పశ్చిమాన కురిసిన వానలకు పొంగి పరవళ్ళు తొక్కి వరదలై పారి భయంకరంగా ప్రవహిస్తూ వచ్చి పడుతుంది.

ఆ రోజుల్లో రాత్రంతా యింట్లో పడుకుని ఆ హోరు వినవచ్చు కూడా. ఒకప్పుడిదంతా లంక భూమి. తన తండ్రి బాగా బతికిన రోజుల్లో చాలా ధైర్యం చేసి ఈ ఇల్లు కట్టాడు. అప్పటికి అంటే తన చిన్నతనంలో అక్కడ యిళ్ళు చాలా తక్కువ. ప్రతి సంవత్సరమూ వచ్చి పడే వరదలకు భయపడి ఇక్కడ యిళ్ళు కిట్టే ధైర్యం చేసేవారు కాదు. ఆ తర్వాత ఒక ఎత్తయిన కట్ట ఏర్పడింది. తర్వాత అదే స్థలం ఒక పేటగా పెరిగి, నేల రేటు విపరీతంగా పెరిగిపోయింది. తన తండ్రి

ఆనాడు చూపిన తెగువ వల్ల తమకు పాతదయినా, పెంకుల కొంప అయినా తలదా చుకోడానికి గూడు మిగిలింది. లేకపోతే తాను ఈనాటి ఆర్థిక పరిస్థితులకు సకుటుం బంగా మహా హీనస్థితిని అనుభవించవలసి వచ్చేది.

వీధి చివరి వరకు నడిచి కుడివైపుకు తిరిగితే ఇల్లు. ఇక్కడ లైట్లు మందంగా వెలుగుతున్నాయి. ముందు కాసిని చిన్న చిన్న దుకాణాలు.... ఒక కూరగాయల దుకాణం.... ఒక చిన్న కట్టెల అడితి....

వీధి మలుపులో లైటుక్రింద నిలబడి ఉన్న ఆకారం రమణయ్యను చూసి కదిలింది.

రమణయ్య పరకాయించి చూసి "శివుడే" అనుకున్నాడు.

"వీడిక్కడ ఈ సమయంలో వీధిలో ఎందుకున్నాడు?" అని కూడా అను కున్నాడు.

"బహుశా ఇవ్వాళ వెళ్ళిన ఇంటర్వ్యూ గురించి చెప్పడానికేమో" అని అను కున్నాడు.

చెప్పేందుకేముంటుంది? ఇప్పటికి ఏ పదో, పదిహేను ఇంటర్వ్యూలకో వెళ్ళాడు. ఫలితం పూజ్యం. పాపం వీడిప్పటి కుర్రావాళ్ళ వంటివాడు కాదు. కష్ట సుఖాలు తెలిసినవాడు. బుద్ధిగానే చదువుకున్నాడు. మంచి మార్కులతో మంచి డిగ్రీయే సంపాదించుకున్నాడు. కానీ, ఏమీ లాభం లేకుండా ఉంది. తాను అప్పుడ ప్పుడు వాణ్ణి ఊరడించి ధైర్యం చెప్పవలసి వస్తున్నది. "ఫరవాలేదు. అధైర్య పడకు. వచ్చేనాటికి ఉద్యోగం అదే కాళ్ళ దగ్గరికి వస్తుంది" అని చె తూ ఉంటాడు.

శివుడు "నాన్నా!" అంటూ ఎదురువచ్చాడు.

"ఏమిటేమిటి?" అన్నాడు రమణయ్య ఆదుర్దాగా.

"కొంచెం ఆగండి. మీతో మాట్లాడాలి" అన్నాడు శివుడు మెల్లిగా.

"ఏమిటేమిటి?" అన్నాడు మళ్ళీ రమణయ్య మరింత ఆదుర్దాగా.

ఎవరో అటు నడుస్తూ వెళ్ళారు. ఆ వెంటనే మరొక యువతి తల వంచు కుని నడుచుకుంటూ వెళ్ళింది.

శివుడు గొంతు సర్దుకుని చాలా నెమ్మదిగా తండ్రికి బాగా సమీపంలోకి వచ్చి గుసగుసలాడాడు.

రమణయ్యకు మతిపోయినంత పని అయింది.

గొంతులో ఏదో అడ్డం పడిన వాడిలాగా "నిజమా?"అని గొణిగాడు.

"నాకు కృష్ణమీనన్ చెప్పాడు. నిజమే అయి వుండాలి. అతను పనిగట్టుకుని అబద్ధం చెబుతాడా?" అన్నాడు శివుడు.

'రా, పోదాం' అన్నాడు రమణయ్య.

తండ్రీకొడుకు లిద్దరూ ఇంటికి వెళ్ళారు. గేటు తీసుకుని లోపలికి వస్తున్న తండ్రిని చూసి పంచలో చదువుకుంటున్న లీల - పూర్తి పేరు ప్రసన్నలీల - లేచి "అమ్మా! నాన్నగారొచ్చారే!" అంటూ లోపలికి వెళ్ళింది.

పంచలో నలభై కాండిల్స్ బల్బు వెలుగుతున్నది.

కుడివైపు చిన్న గది. అది రమణయ్య మాతృశ్రీ వైదేహమ్మగారిది.... అందులోకి అవసరముంటే తప్ప ఎవరూ వెళ్ళరు. అందులో ఆమె నులకమంచం, దాని మీద మెత్తని బొంత, పక్కన స్టూలు ఉంటాయి. ఒక అలమారు ఉందిగాని, అందులో ఒక కృష్ణుడి బొమ్మ తప్ప ఏమీ ఉండదు. మంచం కింద గోడవారగా ఒక పాత ట్రంకుపెట్టె.... మాంధాతల కాలం నాటిది.... ఉంటుంది. దానికొక తాళం. ముసలమ్మ మెంగుని ఎల్లప్పుడూ చప్పుడు చేస్తూ నాలుగైదు తాళంచెవులున్న గుత్తి ఉంటుంది. ఆ ట్రంకుపెట్టె తాళంచెవి తప్ప మిగిలినవన్నీ పనికిరానివే.

రమణయ్య సంచి కూతురికి అందించి, ఎన్నడూ లేనిది ఆకస్మాత్తుగా తల్లి గదిలోకి వెళ్ళాడు. ముసలామె కింద కూర్చుని, తల మంచం పట్టెకు ఆనించి, తావళం తిప్పుతూ ఏదో గొణుగుతున్నది. కళ్ళకు పాతకాలపు జోడున్నది. బాగా నెరిసిన ముగ్గుబుట్టలాటి తల. కొద్దిగా మాసిన పంచె.

ఉన్నట్టుండి లోపలికి వచ్చిన కొడుకు వంక చిత్రంగానూ, ఆశ్చర్యంగానూ చూసిందామె. ఆ తర్వాత నవ్వింది. నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలు పడ్డాయి. రమణయ్య తల్లికి దగ్గరలో నేల మీద కూలబడ్డాడు.

ఏం మాట్లాడాలో తెలియనివాడిలా కొన్ని క్షణాలు మౌనంగా కూర్చుండిపోయాడు.

ఆ తర్వాత తల్లి చేతిని అతి ప్రేమగా పట్టుకున్నాడు.

"ఎట్లా ఉంది ఒంట్లో?" అని అనవసరమైన ప్రశ్న వేశాడు.

"నాకేం? సుబ్బరంగా ఉన్నాను" అన్నదామె కొడుకు చేతిని అప్యాయంగా పట్టుకుని.

"అదే...." అని గొణిగాడు రమణయ్య.

"నీకు ఒంట్లో నలతగా ఉందని మాణిక్యం చెబితేనూ...."

"నలత లేదు పాడు లేదు" అన్నదామె కొడుకు వంక ప్రేమగా చూస్తూ.

ఆ తర్వాత ఉన్నట్టుండి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"నాకింకేం కావాలి నాయనా? పంచానపడి తీసుకుని తీసుకుని, అందర్నీ బాధ పెట్టి సేవలు చేయించుకుని, మరొకరి ఉసురు పోసుకోకుండా ఇలా పోతే అంతే చాలు" అన్నది.

రమణయ్య కళ్ళు చెమ్మగిల్లాయి. లేచాడు.

"ఫలహారం అయిందా?"

"ఆఁ. పరాయి అమ్మ కన్నబిడ్డ అయినా, కన్నా కూతురికన్నా ఎక్కువగా చూసుకుంటుంది మీ ఆవిడ. చీకటి పడగానే 'అత్తయ్యా! ఫలహారం' అని తయారు" అంటూ నవ్వింది.

రమణయ్య లేచి పంచలోకి వచ్చాడు.

"అబ్బే.... నిజం అయి ఉండదు" అనుకున్నాడు. మనసు కుదుటబడినట్టని పించింది.

'కృష్ణమీనన్ ఎవరినో చూసి పొరపాటుపడి ఉంటాడు' అని కూడా అను కున్నాడు.

శివుణ్ణి ముందుగదిలోకి పిలిచి, 'కృష్ణమీనన్ అంటే మా కాలేజీ లెక్చరరు మాధవమీనన్‌గారి అబ్బాయే కదూ?' అని వాకబు చేశాడు.

శివుడు "అవున"ని తల ఊపాడు.

రమణయ్య నెమ్మదిగా 'ఇది నమ్మశక్యంగా లేదు. వాడు పొరబడి ఉంటాడు. నువ్వు మాత్రం ఈ సంగతి ఎక్కడా చెప్పకు. పరువు తక్కువ' అన్నాడు.

శివుడు మరేదో మాట్లాడబోతూ ఉంటే "ఇక ఆ విషయం ఎత్తకు. మరిచిపో" అని మెల్లిగా కసిరాడు.

లీల తండ్రి తెచ్చిన సంచి తీసి చూసి, "అమ్మా! మళ్ళీ తోటకూరకాడ లొచ్చాయే" అంటున్నది పెద్దగా.

మాణిక్యాంబ కొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చి నవ్వుతూనే

"అబ్బబ్బ! ఈ తోటకూరకాడలతో చచ్చిపోతున్నాం" అన్నది.

"ఏం? వాటికేం?" అని రెట్టించాడు రమణయ్య.

"దానికి ఎంత చాకిరీ! గంటన్నర పని" అన్నది గుమ్మం అవతల నిలబడి పెద్దమ్మాయి ఈశ్వరి.

"అయితే మాత్రం? అదెంత మంచిది! ఆకేమో అంతా ఐరన్.... కాడలు మహా రుచే కాక బలం కూడా" అన్నాడు శివుడు.

"ఆఁ. అవునవును" అంటూ మాణిక్యాంబ నవ్వింది.

"తండ్రీకొడుకులిద్దరూ సరిగ్గా సరిపోయారు."

"పోనీ పొద్దునే లేచి దాని పీచు తీయడం, కూర తరగడం వగైరా పని చేసి పెట్టరాదుట్రా అన్నయ్యా" అన్నది లీల ఎగతాళిగా.

* * *

రాత్రి బాగా పొద్దు పోయాక, రమణయ్య తన మంచం పక్కన బల్ల మీద మంచినీళ్ళ చెంబు, గ్లాసు ఉంచుతున్న భార్యను నెమ్మదిగా పిలిచాడు.

మాణిక్యాంబ "ఏమిటి?" అంటూ దగ్గరగా వచ్చింది.

"కూర్చో" అన్నాడు రమణయ్య.

ఆమె మంచం పట్టె మీద కూర్చుని "ఏమిట"న్నట్టుచూసింది.

"అమ్మ ఎక్కడికన్నా వెళుతున్నదా? ఇంట్లోనే ఉంటున్నదా?"

ఆ ప్రశ్న విని మాణిక్యాంబ నవ్వింది.

"పొద్దస్తమానం అలా గదిలో ఊరికే ఒంటరిగా ఎలా కూర్చుంటుంది చెప్పండి. ఇంట్లో ఎవరూ మాట్లాడరాయె. నాకేమో పనితో సరిపోతుండె. అప్పుడప్పుడు అవతలి వీధిలో స్నేహితురాళ్ళను పరామర్శించి రావడానికి వెళుతూనే ఉంటుంది. వెళ్ళేటప్పుడు నాకు చెప్పే వెళుతుంది. అక్కడక్కడాకాలక్షేపం చేసి నెమ్మదిగా తిరిగి వస్తూ ఉంటుంది. అయినా, తిరిగే కాలు నిలుస్తుందా? ఓపిక ఉంది. వెళ్ళి రానివ్వండి. మనకేం నష్టం? ఇల్లు కదలవద్దని ఆంక్షలు పెడితే రచ్చ చెయ్యదూ?"

ఇలా సాగింది ధోరణి.

రమణయ్య వింటూ ఉండిపోయాడు.

మాణిక్యాంబ లేచి ఆవులించి చిటికె వేసి "పెద్దవాడు డ్యూటీ నుంచి రాగానే అన్నం పెట్టమని ఈశ్వరికి చెప్పాను. నిద్రొస్తున్నది. మళ్ళీ చీకటితోటే లేవాలి. నీళ్ళు పట్టాలి. పంపుపోతే రోజంతా నీళ్ళు లేక తిప్పలుపడాలి. ఈ పెద్దవాడి డ్యూటీ లేమిటోగాని రోజూ పొద్దుపోయాకగాని రావడం లేదు" అంటూ పెళ్ళి లైటు ఆర్పి అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

రమణయ్య కళ్ళు మూసుకుని నిద్ర పోయేందుకు ప్రయత్నించాడు. కిటికీ అవతలి ప్రహరీ పక్కగా మందార చెట్టు గుబురుగా పెరిగి ఉంది. చేరెడేసి పూలు పూచింది.

రమణయ్య కళ్ళ ముందు అక్కడెక్కడో అడుక్కునే మనిషి - ఆడో మగో తాను గమనించలేదు.... మనసంతా ఏదో అలజడి.

కాస్సేపు కళ్ళు మూసుకున్నాడు.

తర్వాత ఎప్పుడో అర్ధరాత్రి వేళకు రైల్వే లోకో షెడ్ ఉద్యోగి, పెద్దవాడు, పావని డ్యూటీ నుంచి రావడం, పెద్దమ్మాయి లేవడం, వాళ్ళు నెమ్మదిగా మాట్లాడుకోవడం, మధ్య మధ్య నవ్వులు.... అన్నీ వినిపించాయి.

ఆ తర్వాత కాస్సేపటికి అంతా నిశ్శబ్దం. అందరూ పడుకున్నట్టున్నారు. రమణయ్య అసంకల్పితంగా లేచాడు.

నెమ్మదిగా పంచలోకి వచ్చి ఆ చిన్న గది తలుపు తీశాడు. ముసలామె గాఢనిద్రలో ఉంది. లైటు వేసినా కదలలేదు.

రమణయ్య తల్లి ముఖంలోకి కొన్ని క్షణాలు తదేకంగా చూశాడు. ఆ తర్వాత లైటు ఆర్పి ఇవతలికి వచ్చి పడుకున్నాడు.

"అబ్బే! అంతా అబద్ధం. కృష్ణమీనన్ ఎవరినో చూసి పొరపాటుపడి ఊరికే వాగి ఉంటాడు. అంతే" అనుకున్నాడు. ప్రశాంతంగా పడుకున్నాడు.

* * *

ఉదయం....

తెలతెలవారుతున్నది.

సూర్యుని ప్రథమ కిరణాలు ఇంకా భూమికి చేరలేదు. పక్షులు ప్రహరీ గోడ మీద, మందార చెట్టులోను చేరి రొద చేస్తున్నాయి. పక్క ఇంటి ఆవరణలోని పెద్ద పున్నాగ చెట్టు మీద పక్షులు గూళ్ళను, పిల్లలను వదలి ఆహారాన్వేషణలో బయలు దేరే హడావిడిలో ఉన్నాయి.

రమణయ్య దంతధావనం ముగించి, కాఫీకోసం ఎదురుచూస్తూ పంచలో నిల బడి ఉన్నాడు.

ఈమధ్య పాలు ఆలస్యంగా వస్తున్నాయి. "పాల పాక్యెట్ కోసం వెళ్ళిన శివుడింకా రాలేదు కాబోలు" అనుకున్నాడు.

ఎదురుగా డాబా ఇంటి కుడిభాగంలో అద్దెకుంటున్న కృపాకరరావు కూడా పంచలోకి వచ్చాడు. రమణయ్యను చూసి పలకరింపుగా నవ్వాడు.

రమణయ్య కూడా నవ్వుతోనే జవాబిచ్చాడు.

కృపాకరరావు వికసించిన ముఖంతో "రాత్రి వార్తలు విన్నారా?" అని అడి గాడు.

"లేదే.... ఏమిటి విశేషం?" అని అడిగాడు రమణయ్య.

"విశేషమే.... మళ్ళీ డి. ఎ పెంచారు. పదకొండు శాతం"

రమణయ్య "అలాగా" అని ఊరుకున్నాడు.

కృపాకరరావు మళ్ళీ "మీ గవర్నమెంట్ కాలేజీకి ముందుగా వస్తుంది. మా ప్రయివేట్ కాలేజీలకు మరో నాలుగు రోజులు ఆలస్యం, అంతేగా" అన్నాడు.

రమణయ్య "అంతే....అంతే" అన్నాడు.

లోలోపల "నాయనా!" మీదే అదృష్టం. లెక్చరర్లు కదా? బేసిక్ ఎక్కువ. ఒక్కోసారి డి. ఎ నాలుగేసి వందలు పెరుగుతుంది. మాదేముంది? గుమాస్తాగాళ్ళం. మాకు పెరిగేది మాత్రం ఎంత?" అనుకున్నాడు.

తనపని అంతవరకే అన్నట్టు కృపాకరరావు లోపలికి వెళ్ళిపోయాడు.

"నాన్నా! కాఫీ!" అంటూ పిలిచింది ఈశ్వరి.

రమణయ్య లోపలికి వెళ్ళి కాఫీ గ్లాసుతో ఇవతలికి వచ్చి కుర్చీలో కూర్చు న్నాడు.

మళ్ళీ రాత్రి ఉదంతం గుర్తు వచ్చింది.

కొంచెం ఆందోళన చెందినా, అంతలోనే "అప్పే! అది నిజం అయి వుండదు" అనుకుని కుదుటపడ్డాడు.

ఎదురుగా మందార చెట్టుకు అరచేతి వెడల్పున పూలు పూసి ఉన్నాయి. నది మీద నుంచి వచ్చే వాయు తరంగాలకు తలలూపుతున్నాయి. గోడవారగా మెట్ట తామరలు కొన్ని ఎర్రటి పూలతో కళకళలాడుతున్నాయి. ఎక్కడిదో రంగు రంగుల పిట్ట ఒకటి వచ్చి గోడమీద తిష్టవేసి కూర్చుని కూస్తున్నది.

ఎదురుగా ఆకాశం ఎర్రబడుతున్నది. ఎవరో అదృశ్య హస్తాలతో ధవళ వస్త్రం మీద రంగులు కుమ్మరించినట్టు.... ఆ దిశ అంతా మనోహరంగా ఉంది. కాస్సేపటికి ఈ వర్ణసమూహం అంతా మాయమయిపోతుంది. కేవలం తెల్లరంగు మాత్రం మిగులుతుంది.

లోపల ఎవరి పనిలో వారున్నారు. శివుడు అవతలి పంచలో కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు. బహుశా మళ్ళీ ఏదో పోటీ పరీక్షకు తయారవుతు న్నాడేమో!

ఈశ్వరి వంట గదిలో తల్లికి పనిలో సాయం చేస్తున్నది.

లీల అన్న పక్కనే కూర్చుని పెద్ద కామర్సు పుస్తకంలో "సమన్య"లతో కుస్తీ పడుతున్నది.

పెద్దబ్బాయి రాత్రి పొద్దుపోయి డ్యూటీ నుంచి వచ్చాడు కదా, ఇంకా నిద్ర లేవలేదు.

రమణయ్య లేచాడు. హాలు దాటి ముందు గది గుమ్మంలో నిలబడ్డాడు. ముసలామె చిరుగుల చాపమీద కూర్చుని భజగోవింద శ్లోకాలు కాబోలు చదువుతు న్నది. రమణయ్యను ఆమె చూడనేలేదు.

తొమ్మిది గంటల వేళ స్నానాదులు ముగించి తయారై వచ్చి "ఇంకా వంట కాలేదా?" అని అడిగాడు.

మాణిక్యాంబ పొగలో ఉక్కిరి బిక్కిరి అవుతూ కొంచెం విసుగుతోనే, "అయిపోవచ్చింది. ఇదుగో, అయిదు నిమిషాలు. అయినా గ్యాస్‌పొయ్యి తీసుకుందా మండీ అంటే వినరాయే. ఈ కట్టెలు, బొగ్గులకు వందలు వందలు ధారపోస్తున్నాం. గ్యాస్ ఉంటే పని తొందరగా తెములుతుంది. ఆదా కూడా" అన్నది.

"బుక్ చేశాం కదా? కనుక్కుంటాను ఎప్పుడొస్తుందో. సులువుగా దొరికే రోజుల్లో గ్యాస్ పొయ్యి మడికి పనికిరాదని భీష్మించుకు కూర్చుంటివి. ఇప్పుడు అది దొరక్కపోయె...."

ఈశ్వరి వచ్చి పీటవాల్చి విస్తరి వేసింది.

"కానియ్, కానియ్. చాలా దూరం నడవాలి. తినగానే నడిస్తే ఆయాసం" అంటూ కూర్చున్నాడు రమణయ్య.

"పెందలాడే వంట అయ్యేది. తమరేమో ఇంట్లో అందరూ మహజరు పెట్టి ప్రాధేయపడ్డట్టుగా తోటకూరకాడలు తెచ్చి పడేస్తుంటిరి. ఆ ఒక్కదానికే ఇంత చాకిరీ"

ఆమె సణుగుతూనే వడ్డించింది.

వేళ్ళ చివరలు కాలుతున్నా లెక్క చేయక ఆదరాబాదరాగా నాలుగు మెతుకులు తిని, ముందుగదిలోకి వచ్చాడు రమణయ్య.

పావని ముఖం కడుక్కొనివచ్చి, "అమ్మా కాఫీ" అన్నాడు. ఈశ్వరి కాఫీ తెచ్చి అన్నగారికి అందించింది.

పావని చెల్లెలి వంక ఆప్యాయంగా చూస్తూ "థాంక్స్ చెల్లమ్మా" అన్నాడు.

ఈశ్వరి నవ్వి లోపలికి వెళ్ళింది.

రమణయ్య కాలేజీకి వెళ్ళేందుకు తయారవుతున్నాడు. పావని చెల్లెలి వంక చూస్తూ కాఫీ చప్పరించడం మొదలుపెట్టాడు. ఈశ్వరికి పందొమ్మిది వెళ్ళి ఇరవై వచ్చాయి. కాదేమో! ఇరవై వెళ్ళి ఇరవై ఒకటో ఏడు నడుస్తున్నదేమో! ఇప్పటికి పెళ్ళి చూపుల తతంగం చాలా సార్లు జరిగింది. ఏదీ, ఏ సంబంధమూ ఖాయం కాలేదు. వచ్చిన వారందరూ ఏకగ్రీవంగా "చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అని అమ్మాయి అందాన్ని మెచ్చుకున్నవారే కానీ, తాము ఇవ్వజూపిన కట్నం నచ్చిన వారొక్కరూ లేరు. బి.ఏ - ఇంగ్లీషు చదివి, మంచి మార్కులతో పాసై ఇలా మిగిలిపోయింది.

"పోనీ ఎక్కడన్నా ఏదైనా చిన్న ఉద్యోగం చేయిద్దామా?" అనే ఆలోచన వచ్చింది కానీ, ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి?

ఏ దుకాణంలోనైనా ఏదో జీతానికి సేల్స్ గరల్‌గా చేరవచ్చు. కానీ, తానే అడ్డుపడ్డాడు. తాను చూస్తున్నాడు కదా, చాలా గౌరవనీయ కుటుంబాలకు చెందిన ఆడపిల్లలు, మంచి వయసులో ఉన్నవారు, పెళ్ళిళ్ళు కాక ఏవేవో దుకాణాలలో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఘోరమైన చాకిరీ చేస్తున్నారు. ఇంటినుంచి ఉదయం ఎనిమిది గంటలకే చేతిలో టిఫిన్ డాక్సులతో బయలుదేరి వెళ్ళి, దుకాణా

లలో రాత్రి తొమ్మిది, పది గంటల వరకూ నిలువు కాళ్ళమీద చేస్తున్న చాకిరీ చూస్తుంటే, వారికి లభించే కొద్దిపాటి జీతపురాళ్ళు తలుచుకుంటే పావనికి బాధ కలుగుతుంది. అందువల్ల తన చెల్లెలు అలాటి చాకిరీ చేయడానికి తన కంఠంలో ప్రాణముండగా ఒప్పుకోనని అల్లరి చేశాడు. చిన్నవాడు శివుడొక్కడు తప్ప ఈశ్వరి సంకల్పాన్ని సమర్థించిన వారులేరు. దాంతో ఈశ్వరి యింటిపట్టునే ఉండిపోయింది. తమ్ముడిచేత మంచి మంచి ఇంగ్లీషు పుస్తకాలు తెప్పించుకుని చదువుతూ కాలక్షేపం చేస్తున్నది. ఇంటిపనిలో తల్లికి చేదోడుగానూ ఉంటున్నది.

పావని కాఫీ తాగడం ముగించి పేపరు ముందువేసుకుని కూర్చున్నాడు. మాణిక్యాంబ తీరుబడిగా వచ్చి కూర్చుని పెద్దకొడుకుతో మాటలు మొదలుపెట్టింది.

"నువ్వయినా కనుక్కోరా, ఆ గ్యాస్ సంగతి ఏమయిందో. ఆయనకెక్కడ తీరుబడి ఉంటుంది చెప్పు? కాలేజీ నుంచి బయటపడేసరికి షాపులు మూసేస్తారాయె" అంటున్నది.

రమణయ్య తన మామూలు చేతిసంచి అందుకుని మడత పెట్టుకుని వీధిలోకి వచ్చి, నడిచి కట్టఎక్కి వంతెన దాటి మెయిన్ రోడ్ మీదికి వచ్చాడు.

నగరం రొద, జనఘోష అప్పుడే మొదలయింది. బస్సులు, లారీలు వేగంగా దూసుకుపోతున్నాయి. వాటి మధ్య ద్విచక్ర వాహనాలు సరేసరి.... వేగంగా అమిత వేగంగా వెళ్ళిపోతున్నాయి.

రమణయ్య చేతిలో నిరంతరం ఆ సంచి వుంటుంది. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు పనిమాళా దోవమార్చి కొత్త వంతెనవేపు తిరుగుతాడు.

అక్కడ చుట్టుపక్కల పల్లెటూళ్ళ నుంచి కూరలు తెచ్చి అమ్మేవారు పేవ్మెంట్ల మీద తిష్టవేసి అరుస్తూ వుంటారు. రకరకాల ఆకుకూరలు, దుంప కూరలు చౌకగా వుంటాయి. మిగిలిన అన్ని రకాల కూరలు కూడా మార్కెట్‌లో కంటే, ఇళ్ళ ముందుకు వచ్చేవాటి కంటే చౌక. అందువల్ల రమణయ్య తప్పనిసరిగా అటు వెళ్ళి కావలసినవి బేరమాడి మరీ కొనుక్కుని, మోసుకుంటూ అంతదూరమూ నడిచి వస్తాడు.

"ఆ సంచి మార్చు నాన్నా! మరో సంచి లేనట్టు ఆ పాత జనపనార సంచి చంకన బెట్టుకుని పోతావేం" అని లీల గోల చేస్తుంది అప్పుడప్పుడు.

రమణయ్య నవ్వుతాడు.

"నాకేమీ నామోషీ లేదులే తల్లీ. ఏమిటో ఈ సంచి అలవాటైపోయింది" అంటాడు.

సాయంకాలం ఆఫీసు నుంచి బయటపడేసరికి ఆరు దాటుతుంది. నిజానికి ఐదు కొట్టగానే సీటు ఖాళీ చేసి డెస్కు మూసేసి బీరువా తాళం వేసి బయట పడ వచ్చు.

కానీ, అలా ఎన్నడూ వీలుపడదు. ఎవరో ఒకరు - తమ కాలేజీవారు సరే సరి, ఇతర కాలేజీలవారు కూడా ఏవేవో జీవోల కోసం, వివరాల కోసం వచ్చి కూర్చుంటారు. వారికి నవ్వుతూనే ఓపికగా అడిగిన సాయం చేయాలి. విసుక్కో కూడదు.

ఇన్నేళ్ళ సర్వీసులో రమణయ్య ఆ మంచి పేరు కాపాడుకున్నాడు. పైసా అదనపు సంపాదన లేకపోయినా, ఆ తృప్తి మిగిలింది. రెండు, మూడు జిల్లాలలో ఏ కాలేజీలో, ఎవరికి ఏ సమస్య లేక అనుమానం వచ్చినా "రమణయ్య దగ్గరికి పోతే సరి" అని చెప్పుకుంటారు.

తన తోటివారు ఎలాటివారు? వారికి ఏ సీటు అయినా లెక్కలేదు సంపా దించ గలరు.

మళ్ళీ బీసెంటు రోడ్డు

షాపులు తెరిచారు.

వాటిలో పట్టపగలే లైట్లు ఉజ్జ్వలంగా వెలుగుతున్నాయి. అదుగో టీవీ షాపు....రమణయ్య పేవ్‌మెంట్ మీద ఆగాడు.

లోపల మోహన్ పెద్ద బ్రష్ చేత్తో పట్టుకుని టీవీలను వరసగా తుడుచు కుంటూ పోతున్న వాడల్లా రమణయ్యను చూడనే చూశాడు. చూసి నవ్వాడు.

"రండి సార్. లోపలికి రండి. మాసేఠ్‌గారు ఇంకా రాలేదు లెండి" అన్నాడు.

రమణయ్య నవ్వుతూనే "ఇప్పుడు కాదు. ఆఫీసుకు టైమయిపోయింది. జీతాల బిల్లుల పని మస్తుగా ఉంటుందివ్వాళ" అన్నాడు పెద్దగా.

ఆ తర్వాత నడక సాగించాడు.

ఇంకా చాలా దూరం నడవాలి.

బస్సెక్కి పోదామా అంటే ఈ సమయంలో బస్సెక్కడం అంటే ఎవరెస్టు శిఖరం అధిరోహించడమన్న మాట. అంత రద్దీ.

ఇక మరీ తొందరగా ఉన్ననాడయినా రిక్షా ఎక్కుదామంటే అయిదు రూపా యలు మామూలు రేటు. మిడిమేలపు రిక్షావాడయితే ఇంకా పైమాటే. పైగా తిరుగు బేరం ఉండదంటాడు. "అబ్బో, అయిదు రూపాయలా" అన్నామంటే వాడికి లోకు వయిపోతాం. ఎగతాళిగా మాట్లాడుతూ వెంట బడతాడు. "పోనీ, ఎంతిస్తారు

చెప్పండి?'' అని మొదలుపెడతాడు. "వొద్దులే'' అంటే, "మరి....ఎందుకడిగావు?'' అని ఏకవచన ప్రయోగం ప్రారంభిస్తాడు. "పోనీ, పది పైసలిస్తావా'' అని ఎగతాళి కూడా చేస్తాడు. కాబట్టి రిక్షా ప్రమేయమే లేదు.

రమణయ్య నడకలో వేగం హెచ్చించాడు. ఎంత త్వరగా నడిచినా కాలేజీకి చేరేసరికి పావుగంట ఆలస్యం కానే అయింది. అప్పటికే ప్రిన్సిపాల్ రెండుసార్లు పిలిచాడట.

విద్యార్థులెవరూ కాలేజీలోకి రాలేదు. గుంపులు గుంపులుగా బయటే నిలబడి ఉన్నారు. వచ్చేవారెవరైనా ఉంటే వారిని ఆపేవారు ఆపుతున్నారు. మొత్తం గుంపుగాచేరి ఆ తర్వాత కాస్సేపు ఏదో నినాదాలుచేసి విద్యార్థులందరూ ఎటువారటు వెళ్ళిపోయారు.

ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళి "పిలిచారట'' అన్నాడు రమణయ్య వినయంగా.

"ఒక్కసారి కాదు, రెండుసార్లు పిలిపించాను. సీటులో లేరన్నారు. ఇంకా రాలేదన్నారు. ఈ కాయితాలేవో చూడండి. నా కేమీ అంతు పట్టడం లేదు. తల నొప్పిగా కూడా ఉంది.'

తనకన్నా పదిహేనేళ్ళు చిన్నవాడు అలా అంటున్నా రమణయ్య నొచ్చు కోలేదు. ప్రిన్సిపాల్ అన్న తర్వాత వంద తలనొప్పులుంటాయి.

పైగా విద్యార్థుల అలజడి.... క్లాసులన్నవి నామమాత్రంగానైనా జరగక పోవడం.... లెక్చరర్లలో ముఠాలు....ఇదంతా ఆలోచిస్తే రమణయ్యకు "పాపం ప్రిన్సిపాల్'' అనిపిస్తుంది.

జాలి కలుగుతుంది. అందుకనే ఆయన తనను అప్పుడప్పుడు ఏమైనా అన్న ప్పటికీ పట్టించుకోడు. చిరునవ్వు నవ్వి 'అలాగే సర్, అంతా నేను చూసుకుంటాను. మీరు నిశ్చింతంగా ఉండండి' అంటాడు

అప్పుడు ప్రిన్సిపాల్ ముఖం వికసిస్తుంది.

రమణయ్య ఆఫీసులో తన సీటులోకి వచ్చి కూర్చున్నాడు. పైపంచెతో ముఖం తుడుచుకున్నాడు.

ప్యూన్‌ను పిలిచి 'ఫ్యాన్ ఇంతకంటే తిరగదా గాలిబూ?' అన్నాడు.

గాలిబు నవ్వుతూ "అదంతేనండి'' అన్నాడు.

రమణయ్య గుర్తు చేసుకుని 'గాలిబూ, వెళ్ళి మాధవ మీనన్‌గారు ఉన్నా రేమో చూడు' అన్నాడు.

గాలిబు వెళ్ళగానే మళ్ళీ మనసంతా అదొక రకంగా తయారైంది. మనసులో ఏవేవో దృశ్యాలు.

సినిమాహాలు బయట పొడవాటి క్యూలు ....ఆవరణలోనూ జనం.... క్యూల పక్కన చెయ్యి చాపి నిలబడి ఉన్న....

తర్వాత ఆలోచించలేకపోయాడు. నుదురు చేత్తో రుద్దుకున్నాడు. ఫ్యాను ఇంకా వేగంగా.... మరింత వేగంగా.... తిరిగితే బాగుండుననిపించింది. 'అంతకన్నా తిరగదని' గాలిబు చెప్పనే చెప్పాడు. అయినా, లేచి రెగ్యులేటర్‌ను ఇష్టం వచ్చినట్టు తిప్పాడు. ఏం చేసినా వేగం పెరగలేదు. విసుగు పుట్టి మళ్ళీ సీటులోకి వచ్చి కూర్చున్నాడు.

ఎదుటి సీటులోని వెంకటరత్నం ఇవాళ సీటులో మచ్చుకు కూడా కనబడడు. ప్రతి నెలా మొదటి వారం అంతా అతడంతే. తొమ్మిదింటికి ముందే వచ్చి సంతకం పెట్టి గాయబ్ అయిపోతాడు. ఎక్కడుంటాడో ఎవరికీ అంతుబట్టదు. మళ్ళీ సాయంకాలం అయిదు గంటల వేళకు నవ్వుతూ తయారవుతాడు. దీనికి కారణం ఉంది. అతనికీ, ఒక కాబూలీవాడికీ నిరంతర బాంధవ్యం. అతనికి రమణయ్యతో పాటే సమానంగా జీతం వస్తుంది. కానీ, ఎప్పుడూ ఆర్థిక ఒత్తిడులలో ఉంటాడు. అప్పులు చేస్తాడు. నెలకు నూటికి పది రూపాయల వడ్డీ. వడ్డీ మాత్రం నెల నెలా కట్టి తీరాలి. సంవత్సరాల తరబడి అసలుమాత్రం తీరదు. ఎప్పుడైనా ఏవో బకాయిల వంటివి వచ్చి అసలు తీర్చినా, మళ్ళీ అంతలోనే పరిస్థితి మామూలు. ఆ కాబూలీవాడు కచ్చితంగా సమయానికి వచ్చి గొంతు మీదనే కూర్చుంటాడు. అవతలి మనిషి ఎక్కడ ఉన్నాడు, చుట్టుపక్కల ఎవరెవరున్నారు, అతని స్థాయి ఏమిటి అన్న ఆలోచనే ఉండదు. పెద్ద గొంతుకతో అసహ్యంగా మాట్లాడుతాడు. వడ్డీ రాల్చుకుని కానీ వెళ్ళడు.

వెంకటరత్నం కూడా తక్కువవాడేమీ కాదు. ఋణదాత వచ్చేనాడు ముందే పసిగట్టి వాడికి చిక్కడు. అయిపు లేకుండా పోతాడు. ఇంట్లోనూ, ఆఫీసులోనూ కూడా దొరకడు.

గాలిబు వచ్చాడు.

'లాబ్‌లో ఉన్నారయ్యా!' అని చెప్పాడు.

'తీరిగ్గా ఉన్నారా?'

'తీరిగ్గా ఉన్నార'ని సాగదీశాడు గాలిబు.

రమణయ్య డ్రాయరు తాళం వేసి లేచాడు.

నెమ్మదిగా వరండాలోకి నడిచాడు.

మాధవ మీనన్ మరో ఇద్దరు, ముగ్గురు లెక్చరర్లతో తీరుబడిగానే కూర్చుని మాట్లాడుతున్నాడు.

ఎప్పుడో అరవై దశకంలో ఇక్కడికి వచ్చి ఉద్యోగంలో చేరాడు. ఇక్కడికి వచ్చాకనే పెళ్ళి చేసుకున్నాడు. భార్యకు కూడా ఏదో బ్యాంకులో ఉద్యోగం.

ఇద్దరు కొడుకులు.... పెద్దవాడు రాయవేలూరులో డాక్టరు.... రెండోవాడు కృష్ణ మీనన్, శివుడితో పాటు డిగ్రీ పూర్తి చేసుకుని పైచదువులకు వెళ్ళేందుకు తయారవుతున్నాడు.

మాధవ మీనన్ రమణయ్యను చూసి పులకరింపుగా నవ్వాడు.

'మీ కోసమే. తీరికగా ఉన్నారో లేరో చూసి రమ్మని గాలిబ్‌ను పంపించాను' అంటున్నాడు రమణయ్య.

'చెప్పాడు. మాకు తీరిక గాక పనేముంది.? స్టూడెంట్సంతా వెళ్ళిపోయారుగా'

రమణయ్య ఆయన పక్కకు వెళ్ళి నిలబడి నెమ్మదిగా -

'మీ అబ్బాయి.... అదే కృష్ణ మీనన్, మావాడూ మంచి ఫ్రెండ్స్'అన్నాడు.

మాధవ మీనన్ నవ్వాడు.

'అవునవును. ఇద్దరూ కలిసి వెధవ సినిమాలు చూస్తుంటారు' అన్నాడు నవ్వుతూనే.

'కలిసి చక్కగా చదువుకుంటూ ఉంటారు కూడా' అన్నాడు రమణయ్య.

'నిజమే....నిజమే....'

'ఒక్కసారి మీ వాడితో మాట్లాడాలి.'

మాధవ మీనన్ కొంచెం ఆశ్చర్యపోయి, 'మా వాడితో మాట్లాడాలా? ఏమటబ్బా' అని మళ్ళీ అంతలోనే నవ్వుతూ—

'మా వాడికి ఎక్కడైనా పిల్లను చూడండి రమణయ్యగారూ! మంచి ఇంటి తెలుగు పిల్లను చేసుకుందామని ఉంది అన్నాడు. ఒక్క క్షణం ఆగి 'ఫోను చేస్తాను రమ్మని....ఇంట్లోనే ఉంటాడిప్పుడు....' అంటూలేచాడు.

రమణయ్య ఇవతలికి వచ్చాడు.

సీటులోకి వచ్చి కూర్చుని పనిలో మునిగిపోయాడు.

ఎవరెవరో వస్తున్నారు.....పనులు చూసుకుని పోతున్నారు.

క్లాసులు, విద్యార్థులు, పాఠాల హడావిడి ఏమీ లేకపోయినా ఆఫీసు మాత్రం మామూలుగా రద్దీగా ఉంది.

పన్నెండు గంటల వేళ.

కిటికీ దగ్గర కృష్ణ మీనన్ ముఖం కనిపించింది.

'నాన్నగారు ఫోన్ చేసి రమ్మన్నారు. వొచ్చాను' అన్నాడతను.

రమణయ్య 'వొస్తున్నా....' అంటూ లేచి ఇవతలికి వచ్చి కృష్ణ మీనన్‌ను ఇవతలికివైపు వరండాలోకి తీసుకువచ్చాడు.

ఒక్క క్షణం ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు.

తర్వాత నెమ్మదిగా 'మావాడికి ఏదో చెప్పావుట....అదే మా అమ్మగారిని గురించి....నిజమేనా?' అని అడిగాడు ఆందోళన ధ్వనించే స్వరంతో.

కృష్ణ మీనన్ ఇరుకునపడ్డ వాడిలా తల వంచుకుని నిలబడ్డాడు.

'చెప్పు బాబూ! నీ నోటి వెంట నిజం తెలుసుకుందామని నా ప్రయత్నం. అసలు మా అమ్మగారిని నువ్వు ఎరుగుదువా?'

'అయ్యో! ఎరక్కపోవటం ఏమిటండీ? మీ ఇంటికి చాలాసార్లు వచ్చాను. శివుడు నాయినమ్మగారిని పరిచయం చేశాడు కూడా. నేనామెతో చాలాసార్లు మాట్లాడాను కూడా....'

'మరి....?'

'మీరేమీ అనుకోవద్దు. నేను చూసింది మనసులో దాచుకోలేక చెప్పాను. అదీ ఒక్కసారి కాదు. ఇది మూడోసారి, లీలామహల్ సినిమాకు వెళ్ళి నెల రోజుల కిందట చూశాను. ఆమె నన్ను చూసింది. కానీ, గుర్తుపట్టలేదు. నేనూ ఊరుకున్నాను. అప్పుడు బాధపడ్డాను. మొన్న రాజ్ థియేటర్లో మలయాళం సినిమా వస్తే వెళ్ళాను. అప్పుడు మళ్ళీ చూశాను. అప్పుడూ ఆమె నన్ను గుర్తు పట్టలేదనుకోండి....'

రమణయ్య బాధపడుతూ నుదురు రుద్దుకున్నాడు.

తల పంకించాడు. 'సరే' అన్నాడు.

కృష్ణ మీనన్ 'సారీ సార్....మీకు బాధ కలిగించాను' అన్నాడు నెమ్మదిగా.

'లేదు....లేదు....నువ్వు చెప్పడం చాలా మంచిదయింది. లేకపోతే ఎంత అప్రతిష్ఠ? ఇకనుంచి జాగర్త పడమని ఇంట్లో హెచ్చరిస్తాను.'

కృష్ణ మీనన్ నెమ్మదిగా నడిచి వెళ్ళిపోయాడు.

రమణయ్య గట్టిగా ఊపిరి పీల్చుకుని కొన్ని క్షణాలపాటు అలాగే నిలబడి ఆ తర్వాత సీటులోకి వెళ్ళి కూలబడ్డాడు.

నిజానికి ఇప్పటికైనా ఈ విషయం ఇతని వంటి మర్యాద తెలిసిన కుర్రవాడి కళ్ళబడడం....అతడు దాచకుండా చెప్పడమూ మంచిదే అయింది.

'ఇంకెవరికైనా తెలిస్తే ఎంత అసహ్యంగా ఉండేది' అనుకున్నాడు.

సాయంకాలం మళ్ళీ మామూలు నడక....

ఈ వీధిలో రాస్సేపటి కిందట ఏదో ఊరేగింపు వెళ్ళినట్టుంది. లేక శవం వెళ్ళిందో!. అంతటా పూలరేకులు....

పశ్చిమాకాశంలో సూర్యబింబం రక్తవర్ణం చిలికిస్తూ అస్తమిస్తున్నది.

రమణయ్య ఆ పెద్ద టీవీ షాపు ముందు ఆగాడు.

మోహన్ లోపలి నుంచే అతన్ని చూసి నవ్వుతూ చేయి ఊపి 'రమ్మ'ని సైగ చేశాడు.

రమణయ్య అనవసరంగా సందేహిస్తూ నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. మోహన్ రమణయ్యను ఆ టీవీ సెట్ ముందు కూర్చోబెట్టి స్విచ్ నొక్కాడు. కళ్ళ ముందు రంగుల ప్రపంచం....అదేదో వ్యవసాయదారుల కార్యక్రమమే.... అయితే నేమి.... రకరకాల చెట్లు, అందాల పుష్పవనాలు, తోటలు కన్నుల పండుగ చేస్తు న్నాయి. చెట్లు అంట్లు కట్టడం, మేలిమి రకాల వంగడాలు ఉత్పత్తి చేయడం ఆ కార్యక్రమం.

తర్వాత కాస్సేపు అరుదైన రంగు రంగుల పుష్పాలు .... తర్వాత దేశ భక్తి గేయం.... ఆ గేయం వినిపిస్తున్నంతసేపూ ఆసేతు హిమాచలం ఉన్న అందాల దృశ్యాలు .... కొండలు .... జలపాతాలు .... ఎడారులు (అవీ అందం గానే ఉన్నాయి) కట్టడాలు .... దేవాలయాలు .... మహానదులు .... అంతా రంగు లలో అఖిల భారతాన్ని సందర్శించినట్లయింది. ఆ తర్వాత వెకిలి హాస్యంతో ఏదో నాటిక మొదలయింది.

అప్పుడు లేచాడు రమణయ్య.

ఇంటికి చేరి పంచలో నుంచే అరుస్తూ రమణయ్య కూరల సంచి చిన్నమ్మా యికి అందించి తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆమె లోపల లేదు.

"అమ్మడూ! నాయనమ్మ ఎక్కడికి వెళ్ళిందే?" అని అరిచాడు లీలనుద్దేశించి.

"వెనుక పంచలో కూర్చుని ఉంది నాన్నా" అని సమాధానం వచ్చింది.

రమణయ్య కుదుటపడి కుర్చీలో కూర్చున్నాడు.

"అమ్మా! ఇవాళ దొండకాయలే" అంటున్నది లీల తల్లితో.

"ఈ దొండకాయలొకటి మన ప్రాణానికి .... బుద్ధి నాశనీ అంటారు. రెండు రోజులకొకసారి ఇవీ తప్పవు కదా" అంటున్నది మాణిక్యాంబ.

"మరేం చెయ్యంటావు? పూటకో కూర పుట్టుకు రావటంలేదు. ఉన్నవేవో తేగలం. లేనివెక్కడి నుంచి వొస్తాయి?" అంటూ దుస్తులు మార్చుకున్నాడు.

అప్పటికి వెనుక పంచలో ముసలమ్మతో అంతవరకు కబుర్లాడుతున్న సౌభా గ్యమ్మ "ఇంట్లో బోలెడు పని మిగిలిపోయింది. వెళ్ళొస్తానమ్మా" అంటూ హడావి డిగా వెళ్ళిపోయింది.

ముసలమ్మ ఇవతలికి వచ్చింది.

రమణయ్య "అమ్మా!" అంటూ ఆమె వెనుకనే గదిలోకి వెళ్ళాడు. తల్లి పక్కనే మంచం మీద కూర్చుని పెద్దగా కూతుర్ని ఉద్దేశించి—

"లీలా! కాఫీ తెచ్చి ఇవ్వు" అన్నాడు.

ముసలామె కొడుకు వంక చిత్రంగానూ ప్రేమగానూ చూస్తున్నది.

రమణయ్య లీల తెచ్చిన కాఫీ తాగుతూ మొదలుపెట్టాడు. "అమ్మా! పెద్ద దానివైనావు. ఇక అటూ ఇటూ ఎక్కడికీ తిరగవద్దు. వీధిలోకి అసలు వెళ్ళవద్దు. వీధులెట్లా ఉన్నాయి? ఊరెట్లా ఉంది? ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. మాబోటి వాళ్ళకే భయంగా ఉంటున్నది. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని తిరుగుతూ వుంటాము. లారీలు, బస్సులు, స్కూటర్లు - ఆ రొదతో రోడ్లు ఎట్లా ఉన్నాయి! ఎప్పుడూ ఏదో ఒకచోట ప్రమాదం .... బయటికి వెళ్ళినవాడు ప్రాణాలతో ఇంటికి తిరిగొస్తాడని నమ్మకం లేదు. అన్ని వేళలూ మనవి కావు కదా!"

ముసలమ్మ విచిత్రంగా చూసింది—

"నేనెక్కడికి వెళ్తానురా? మహా అయితే అవతలి వీధిలో సౌభాగ్యమ్మగారి ఇంటికి వెళ్తాను. నా కేమన్నా స్నేహితులా? బంధువులా? ఎవరున్నారు గనక?" అన్నది గొణుగుతున్నట్టు

"అదే నేనూ చెప్పేది. ఇకమీద ఎక్కడికీ వెళ్ళకు" అంటూ రమణయ్య లేచి ఇవతలికి వచ్చాడు

తర్వాత భార్య దగ్గరికి వెళ్ళి కొంచెం కఠిన స్వరంతోనే "ఆమెనెక్కడికీ వెళ్ళనీకుకు" అని హెచ్చరించాడు.

మాణిక్యాంబ మాత్రమే కాక ఈశ్వరి, లీల ఇద్దరూ కూడా తండ్రి ధోరణికి కొంచెం ఆశ్చర్య పోయారు. కళ్ళతోనే ప్రశ్నించుకున్నారు. "ఏమో" అని జవాబులూ చెప్పుకున్నారు.

"ఇవాళ ఏమిటే నాన్న అలా మాట్లాడుతున్నాడు?" అన్నది ఈశ్వరి లీలతో. లీల రహస్యం చెబుతున్నట్టు "ఏమో! నాకూ పూర్తిగా తెలియదు. కానీ, చిన్నన్నయ్య ఏదో చెప్పాడు నాన్నకు .... నిన్న అనుకుంటాను .... అప్పటి నుంచి చిర్రు బుర్రు లాడుతున్నాడు" అన్నది.

రమణయ్య స్నానం ముగించి, పంచలో కూర్చుని కొన్నిక్షణాలపాటు కళ్ళు మూసుకున్నాడు. అంతలో నిన్నటి నుంచి మనసును కలవర పరుస్తున్న దృశ్యం....

రైలుస్టేషను....సినిమా హాళ్ళు.... బస్టాండులలో పొడవాటి క్యూలు .... ఆ పక్కన చేయిజాపి ఏదో నములుతూ అడుక్కుంటున్న ఆకారం .... కొన్ని

మాటలు.... ఒకప్పుడు .... "మా మనవడికి అన్నప్రాసన .... లేనివాళ్ళం.... తోచింది ఇవ్వండి" .... మరొకప్పుడు .... "మా యిల్లు కాలిపోయింది .... తోచింది ఇవ్వండి .... " ఇంకొకప్పుడు.... "పసివాడికి జబ్బు చేసింది. మందులకు డబ్బు లేదు తోచింది ఇవ్వండి పుణ్యం వుంటుంది...."

రమణయ్య పిచ్చివాడిలా లేచాడు. "ఇహ దాన్నిగురించి ఆలోచించగూడదు" అనుకున్నాడు.

తర్వాత ఆ రంగుల టీవీ కళ్ళముందు ప్రత్యక్షమైంది. అది పంతొమ్మిది వేలట....రిమోట్ వంటి ఇతర వస్తువులన్నీ కలిపి ఇరవై వేలు....ఇరవై వేల రూపాయలు! తన ప్రావిడెంట్ ఫండ్, ఇన్నేళ్ళ బలవంతపు దాపరికం అంతా కలిపినా ఇరవై వేలు దాటదు.

ఒక మిత్రుడెవరో బలవంతంగా కట్టించిన భీమా పాలసీ మరో రెండేళ్ళకు-తన రిటైర్మెంట్ నాటికి - గాని రాదు. ఆ మొత్తం కూడా అన్నీ కలుపుకుని నిండా ఇరవై వేలు రాదు.

ఆ షాపు....అక్కడి వైభవం....ఆ లైట్లు....కళ్ళముందు మెదిలాయి

అక్కడ కొనుగోలు నిమిత్తం వచ్చే ఖరీదైన మనుషులు కళ్ళముందు మెదిలారు. "ఇంత డబ్బు వీళ్ళకు ఎక్కడి నుంచి వొస్తున్నది?" అని ఆశ్చర్యపోయాడు కొంతసేపు.

ఆ తరువాత "కొందరి దగ్గిర డబ్బు బాగా చేరుతున్నది. కొందరికి మనుగడ దుర్భరమవుతున్నది. మరికొందరు మనబోటివారు అతిజాగ్రత్తగా ఉండవలసి వస్తున్నది" అనుకున్నాడు.

పెద్దబ్బాయి పావని వచ్చాడు. ఇవాళ అతనికి 'ఆఫ్' కాబోలు. ఉదయం భోజనం చేసి వెళ్ళినవాడు ఇప్పుడే వచ్చాడు. లేకపోతే ఈ సమయానికి అతను ఇంట్లో ఉండడం అరుదు. రమణయ్య కొడుకును పిలిచాడు.

"ఏం నాన్నా?" అంటూ వచ్చాడు పావని.

"కూర్చో."

పావని కూర్చున్నాడు.

"చూడు. రాజమండ్రి నుంచి ఉత్తరం వొచ్చిందివ్వాళ కాలేజీకి" అంటూ రమణయ్య లీలను కేకవేసి "నా జేబులో ఉత్తరం ఉంటుంది. తీసుకురా" అని చెప్పాడు.

పావని దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

"మనం సరేనంటే పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తారట. సువ్వూ, అమ్మా వెళ్ళి రావచ్చు" అంటూ లీల తెచ్చి ఇచ్చిన కవరు అందించాడు.

పావని కవరు అందుకున్నాడే కానీ విప్పి చూడలేదు. అక్కడే ఉంచాడు. తర్వాత ఏమీ తోచనివాడిలా ఆపురించి చేతి వేళ్ళు విరుచుకున్నాడు. పావని మొదటి నుంచీ నెమ్మదస్థుడు. మితభాషి. కుటుంబ ఆర్థిక స్థితిగతులను చిన్నప్పుడే అర్థం చేసుకుని బుద్ధిగా పాలిటెక్నిక్‌లో చదువుకున్నాడు. అది అయితే త్వరగా చిన్నదో చితకదో ఏదో ఒక ఉద్యోగం వస్తుందనీ, గుమాస్తా అయిన తండ్రికి చేదోడు వాదోడుగా ఉండవచ్చుననీ భావించాడు.

అందరి కుర్రవాళ్ళ వలె ఏ ఇంజనీరింగో, మెడిసినో చదివి జీవితంలో వెలిగి పోవాలనీ, రెండు చేతులా సంపాదించాలనీ లేకపోలేదు. కానీ దానికి అవసరమైన పెట్టుబడి తండ్రి సమకూర్చలేడని తండ్రి చెప్పకుండానే గ్రహించాడు.

పాలిటెక్నిక్ చదువుపూర్తికాగానే అదృష్టవశాత్తూ చిన్నదీ అయినా రైల్వేలో ఉద్యోగం దొరికింది. ప్రతి ఫస్టు తారీఖున జీతంలో కేవలం తనకు తప్పనిసరిగా అవసరమైన డబ్బు మాత్రం ఉంచుకుని మిగిలిన మొత్తం అంతా తల్లికిస్తాడు పిచ్చి తిరుగుళ్ళు, సినిమాలు, షికార్లు వగైరాలేవీ లేవు. బహుశా అప్పుడప్పుడు తక్కువ ఖరీదు సిగరెట్లు కాలుస్తాడేమో తెలియదు.

ఇవాళ అనవసరంగా ఇరుకున పడ్డవాడిలా తండ్రి ముందు కూర్చున్నాడు. ఏమీ మాట్లాడటం లేదు.

"ఏమంటావు ? వాళ్ళకేదో ఒకటి రాయాలి మరి. లేకపోతే బాగుండదు" అన్నాడు రమణయ్య.

పావని నసిగాడు.

"నా పెళ్ళికిప్పుడేం తొందర నాన్నా! అవతల ఆడపిల్లలుండగా...."

"అదేనయ్యా! నేను చెప్పేదీనూ. వాళ్ళేమో మనమేమీ డిమాండ్ చేయకుండానే పదిహేను వేలో ఇరవై వేలో కట్నం ఇస్తారని శంకరయ్యగారు చెబుతున్నారు. నిన్ను కట్నం కోసం పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేసేంత తెలివితక్కువ వాణ్ని కాను నేను. కానీ, మనం అడగకుండానే వాళ్ళు ఆ మొత్తం ఇవ్వజూపుతున్నారు. అప్పుడు ఈశ్వరికి సంబంధాలు కొంచెం త్వరగా వెతకవచ్చు. ఏదో ఒకటి కుదరకపోదు. ఆ తర్వాత అంటావా ? పెద్ద బాధ ఏమీలేదు. చిన్నపిల్లకు తొందరలేదు కదా!"

పావని పంచ కింద వ్యాపించిన చీకటి వంక చూస్తున్నాడు.

తర్వాత ఏమనుకున్నాడో ఏమో కొంచెం నెమ్మదిగానే అయినా కచ్చితంగా చెప్పాడు.

"వాళ్ళకేదో రాసేయండి! ఆడపిల్ల పెళ్ళి ముఖ్యం. అది జరిగాకనే మగపిల్ల వాడి సంగతి ఆలోచిస్తామని రాయండి!"

రమణయ్య ఏమీ మాట్లాడలేదు. కొడుకు వంక చూస్తూ కూర్చున్నాడు. అతని మీద కోపం ఉవ్వెత్తున రావలసిందే, కానీ రాలేదు.

*　　　*　　　*

సాయంకాలం ఆరుగంటలు దాటింది. పావని డ్యూటీ ముగించుకుని చేతులు కడుక్కుని దుస్తులు మార్చుకుని ఇవతలికి వచ్చాడు.

షెడ్‌లో నుంచి బయటపడితే అయిదు నిమిషాలు నడక. అక్కడ ఇక బస్ ఎక్కితే దాదాపు ఇరవై నిమిషాలు పైగా ప్రయాణం. అతను బస్ కోసం నిరీక్షిస్తూ నిలబడ్డాడు.

చుట్టూ కోలాహలంగా ఉంది. ఎదురుగా ఉన్న సబర్బన్ సినిమా హాలు ముందు అలజడి.... వేరుసెనగ కాయలు, ఏదో సండ్లు, తేగలు, వడ, ఇడ్లీ పూరీలు అమ్మేవారి కేకలు....అరుపులు....నగరంలో మరిమూడు థియేటర్లతో పాటు ఇక్కడ కూడా కొత్త సినిమా విడుదల అయింది. ఇది మూడో రోజు.... వేరే థియేటర్ నుంచి ప్రింట్ రావాలి. టిక్కెట్టు కొన్నవారు లోపల కూర్చోలేక ఆవరణలో తిరుగుతున్నారు. క్రమంగా చీకటి వ్యాపించింది. బస్సులు వస్తూ పోతూ ఉన్నాయి. పావని ఎక్కవలసిన బస్సుమాత్రం రాలేదు.

అతడు అసహనంగా నిలబడి ఉన్నాడు. నుదురు తుడుచుకున్నాడు-చిరాగ్గా ఉంది.

పైగా మనసులో చింత....ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా రైల్వే హాస్పిటల్‌కు వెళ్ళాలి. అతడు త్వరపడుతున్నకొద్దీ ఆలస్యమవుతున్నది. దాదాపు పదిహేను రోజుల నుంచీ ఇదే వరస. ఇంట్లోనేమో లేట్ నైట్ డ్యూటీ అని చెప్పి నమ్మిస్తున్నాడు. ఇంటికి చేరేసరికి రోజూ పది గంటలు దాటుతున్నది. అయినా తప్పదు. పావని జేబులు తడుముకున్నాడు. కొన్ని నోట్లు తగిలాయి. ఉన్నట్టుండి ఒక సిగరెట్టు కాలుద్దామా అనిపించింది. కాని, మనసొప్పలేదు.

రోజూ, సంవత్సరాల తరబడి తాను రామకృష్ణ కలిసి డ్యూటీ నుంచి బయటపడి కబుర్లు చెప్పుకుంటూ బస్‌స్టాప్ దాకా వచ్చేవారు. బస్సెక్కి అతను క్వార్టర్స్ దగ్గర దిగేవాడు. తాను ఇంటికి వెళ్ళేవాడు.

రామకృష్ణ కబుర్ల పోగు. తెగ వాగుతూ, నవ్విస్తూ ఉండేవాడు.

ఎనిమిది గంటలు ఏకధాటిగా రైలింజనుల మధ్య డ్యూటీ చేసినా అలసట ఉండేది కాదు.

మాటిమాటికీ 'ఒక్క బీడీ కాల్చవయ్యా పావనీ, మజాగా ఉంటుంది' అనే వాడు. 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని తనను హేళన చేస్తూ ఉండే వాడు. బీడీ తప్ప మరే దురభ్యాసమూ లేదు. ఒక్కొక్క బీడికి అయిదారు అగ్గి పుల్లలు ఖర్చయ్యేవి. డ్యూటీ....ఆ తర్వాత నేరుగా క్వార్టర్స్‌లోని తన ఇల్లు తప్ప మరేమీ ఎరుగడు.

ఇప్పుడు?

గత నెలా పదిహేను రోజులుగా తాను ఒంటరివాడైనాడు రామకృష్ణ లేడు. అతని కబుర్లు నవ్వులు లేవు.

పావని అంతలో బస్సును చూసి చెయ్యి ఎత్తాడు. ఆ స్టాపులో దిగవలసిన వారు కేకలు పెట్టారు కాబట్టి బస్సు ఆగింది. కడుపు నిండా గడ్డున్న మహామృగం లాగా జనంతో కిటకిటలాడుతున్నది బస్సు.

పావని కసిగా జనాన్ని తోసుకుంటూ లోపలికి వెళ్ళి నిలబడ్డాడు. బస్సు మూలుగుతూ బాధగా కదిలింది.

సుదీర్ఘ ప్రయాణం తర్వాత పావని రైల్వేస్టేషను దగ్గర దిగాడు. కొద్ది గజాలు నడిస్తే రైల్వే ఆస్పత్రి....పెద్ద ఆవరణ....అటూ ఇటూ పూలచెట్లు....

అతడు లోపలికి నడిచాడు.

మనసంతా అలజడి....కాళ్ళు కొంచెంగా వణుకుతున్నాయి.

రోజూ అంతే....లోపలికి వెళ్ళి 'ఏమి వినవలసివస్తుందో' అని భయం భయంగా వెళ్ళడం, అక్కడ ఆపరేషన్ వార్డులో కాస్సేపు గోడవారగా బల్ల మీద కూర్చోవడం....

ఆపరేషన్ వార్డు....

అటూ ఇటూ వరుసగా మంచాలున్నాయి. వాటి మధ్యగా నడిచి వెళ్ళాడు. చివరగా ఒక మంచం....మంచం పక్కగా నేల మీద మూర్తీభవించిన శోక దేవ తలా రత్నమాల....ఆ పరిసరాలలో ఏమీ తెలియని పసిపాప అటూ ఇటూ దొగా డుతూ ఆడుకుంటూ ఉన్నది.

పావనిని చూసి రత్నమాల లేచి నిలబడబోయింది.

పావని 'వొద్దొద్దు. లేవవద్దు' అని లోగొంతుకతో అంటూ చేతితో సైగ కూడా చేశాడు. తర్వాత వేళ్ళు విరుచుకుంటూ కొద్ది క్షణాలు నిలబడ్డాడు.

"డాక్టరుగారు వొచ్చారా?"

ఆమెకా ప్రశ్న వినిపించిందో లేక అది మామూలు ప్రశ్న కాబట్టి సమాధానంగానో తల ఊపింది.

"ఏమన్నారు?"

"ఏమీ అనలేదు. అసలు మాట్లాడలేదు. చూసి వెళ్ళిపోయారు."

పావని మంచం వంక చూశాడు. మంచంలో నిలువుగా ఒక ఎముకల గూడు .... పైన తెల్లని దుప్పటి.... ముఖం మాత్రం కనిపిస్తున్నది. కళ్ళుమూతలు పడి ఉన్నాయి.

పావనికి అలసట అనిపించింది.

కాసిని నీళ్ళు తాగుదామనిపించింది. లేచి వెళ్ళి అవతల వైపున పంపు దగ్గర గుక్కెడు నీళ్ళు తాగి వచ్చాడు. బల్లమీద కూలబడ్డాడు. ఆ బల్ల ఎప్పటిదో ఇక్ష్వాకుల కాలం నాటిది. కటకటమని కదిలి దీనంగా మూలిగింది.

పావని కళ్ళు మూసుకున్నాడు.

కేవలం మూడు నెలల క్రిందట రామకృష్ణ ఎలా వుండేవాడు? చిరునవ్వులు చిందే ముఖం .... మాటిమాటికీ చిలిపిగా నుదుటపడే జుట్టు .... మధురమైన కంఠం .... ఎంత చక్కగా పాడేవాడు!

తన ఇంటికి మాటిమాటికీ బలవంతంగా తీసుకుపోయేవాడు. వాళ్ళిద్దరూ రాగానే రత్నమాల నవ్వుతూ ఎదురు వచ్చేది.

"పావని వచ్చాడు రత్నా! మంచి టీ ఇవ్వాలి సుమా" అనేవాడు. గలగల మాట్లాడుతూనే తనను కుర్చీలో కూలేసి దుస్తులు మార్చుకుని వచ్చేవాడు. ఇక హార్మోనియం ముందు వేసుకుని ఒకదానివెంట ఒకటి తత్వాలేమిటి, అష్టపదులేమిటి జానపద గీతాలేమిటి, పాత హిందీ సినిమా పాటలేమిటి - ఒకటే సంగీతహేల....

టీ తాగుతూ ఉంటే 'అబ్బా! మా ఆవిడ చేతిలో ఉందయ్యా తీపి.... ఇలాటి టీ ఎక్కడైనా దొరుకుతుందా?" అనేవాడు.

ఆమె నవ్వి "పోదురూ .... మీరు మరీనూ...." అనేది.

"నిజంగానే .... మా క్యాంటీనుకు వచ్చి టీ తాగు తెలుస్తుంది. జీవితాంతం విరక్తి పుట్టి "యాంటీ టీ పార్టీ" పెడతావు" అనేవాడు. పసిపిల్లను వళ్ళోకి తీసుకుని "నా బంగారు తల్లి ఇది. దీన్ని డాక్టర్ను చేస్తాను" అనేవాడు.

అతనికి 'నా' అనుకోదగినవారెవరూ లేరు. ఒక అన్నగారుండేవాడు. కానీ చచ్చిపోయాడు. రత్నమాలకూ ఎవరూ లేరు. వాళ్ళది ఒకే ఊరు. సవతి తల్లి పెట్టే బాధలు చూసి రామకృష్ణ ఆమెను కోరి పెళ్ళిచేసుకున్నాడు. ఇప్పుడా సవతి తల్లి కూడా లేదు.

పావని కళ్ళు తెరిచాడు.

మంచంలోని ఎముకల గూడు కదలింది. రత్నమాల లేచింది. మంచం దగ్గరికి వెళ్ళి దుప్పటి తొలగించింది. బొడ్డు దగ్గర మడిచివున్న ఒక ప్లాస్టిక్ గొట్టాన్ని ఇవతలికి తీసింది. పైన గరాటు పెట్టింది. ఫ్లాస్కులో కలిపి ఉంచిన హార్లిక్స్ గరాటులో నెమ్మదిగా పోసింది.

"ఇదెక్కడి వింత వ్యాధి! ఇలాంటి వ్యాధులుంటాయా అసలు" అనుకున్నాడు పావని.

క్యాన్సర్ అన్నారు. స్వరపేటిక దగ్గర నుంచి నాభి వరకు లోపల ఉండే నాళాన్ని అంతటిని తీసివేశారు. జీర్ణాశయంలోకి కాబోలు నేరుగా ఒక గొట్టం ఏర్పాటు చేశారు.

మరి కొద్ది నిమిషాలలో ఎముకల గూడు కళ్ళు మూతలు పడ్డాయి. ఆమె గరాటు తీసేసి ప్లాస్టిక్ గొట్టాన్ని మడిచి యథాస్థానంలో వుంచి దుప్పటి కప్పింది. తర్వాత కదిలివెళ్ళి గోడకానుకుని కూర్చుని చేతులతో ముఖం కప్పుకుంది.

ఆమె ఏడుస్తున్నదని పావనికి తెలుస్తూనే వుంది. కొద్ది క్షణాలాగి లేచివెళ్ళి దగ్గరగా నిలబడి "ఏడవవద్దు" అని మాత్రం అన్నాడు.

ఆ తర్వాత "నేను వెళ్ళొస్తాను" అన్నాడు.

ఆమె తల ఊపినట్టున్నది.

"ఏమన్నా తెచ్చిపెట్టేదా తినేందుకు?"

"తెప్పించుకుంటాను .... అయినా ఆకలి లేదు" అన్నదామె లోగొంతుకతో.

"అలాకాదు. ఏదో ఒకటి తినాలి. తప్పదు కదా? రత్తయ్యచేత పైకి పంపిస్తాను."

అతడు కదిలి మెట్లుదిగి కిందికి వచ్చాడు.

రత్తయ్య ఎదురైతే " నీ కోసమే చూస్తున్నాను. కొంచెం రోడ్డుమీదకి రా, ఏ అరటి పళ్ళో కొనిపెడతాను. పైకి తీసుకువెళ్ళి ఇవ్వు ...." అన్నాడు. రత్తయ్యకు అంతా తెలుసు. పావనిని అనుసరించాడు. అతనికి దాదాపు అరవై ఏళ్ళుంటాయి. జీవితమంతా - తన పద్దెనిమిదో ఏటి నుంచి - ఈ ఆస్పత్రిలోనే గడిపాడు. ఎన్ని జబ్బులు, ఎన్ని చావులు, ఎంత దుఃఖం, ఎన్ని కన్నీళ్ళు చూశాడో లెక్కలేదు.

రత్తయ్య చిత్రమైన గొంతుకతో అన్నాడు.

"ఇంత సర్వీసులో నేనిట్లాంటి కేసు చూడలేదయ్యా! పాపం, ఆ ఆడకూతురును చూస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది."

పావని మౌనంగా రోడ్డు పక్కనఉన్న బండివాడి దగ్గర అరడజను అరటి

పళ్లు కొని ఇచ్చి "కాస్త కనిపెట్టుకుని ఉండు రత్తయ్యా" అన్నాడు. రత్తయ్య తల ఊపాడు.

"ఎందుకు చెబుతున్నానో తెలుసుగా? ఆడపిల్ల .... ఘోరమైన దుఃఖంలో ఉంది. పిచ్చెక్కినదానిలా ఎప్పుడే అఘాయిత్యం చేస్తుందో అని నా భయం."

"నేనున్నానుగా" అన్నాడు రత్తయ్య.

"ఎప్పుడే అవసరం అయినా మా యింటికి వచ్చేసేయ్. ఏ వేళ అయినా సరే...."

"అట్లాగే అయ్యా"

రత్తయ్య ఆస్పత్రి గేటు దాటి లోపలికి వెళ్ళిపోయాడు.

పావని నడక సాగించాడు.

జనసమర్దం అంతగా లేని రోడ్డు పొడవునా అటూ ఇటూ లైట్లు వెలుగుతున్నాయి. జీవితంలో సుఖదుఃఖాల వలె కనుచూపుమేర అంతటా వెలుగు చీకట్లు-

పావని మనసులో రామకృష్ణ ముఖం మెదులుతున్నది. ఇప్పుడా ముఖం తప్ప, ఆ ముఖంలో కాంతులు చిమ్మే కళ్ళు తప్ప ఏమీ మిగిలి లేదు.

'ఎన్నాళ్ళో గడవదు' అనుకున్నాడతను.

"మన ప్రయత్నం మనం చేశాం. కానీ ఏమీ లాభం లేకపోయింది. ఏం చేయలేకనే ఈ ఆపరేషన్ చేశాము. నౌ హి ఈజ్ డైయింగ్...." అన్న డాక్టర్ మాటలు పావని చెవులలో రింగుమంటున్నాయి.

నడుస్తూనే రత్నమాల గురించి ఆలోచించాడు.

బహూశా ఇంకా అలాగే ఆ మంచం పక్కన గోడకానుకుని కూర్చుండి వుంటుంది శిలాప్రతిమలా.

ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది.

ఉన్నట్టుండి పైన అన్నీ మబ్బులు....

క్షణాలమీద గర్జించాయి .... చల్లని గాలి విసురుగా వీచింది.

దానితో చినుకులు మొదలైనాయి.

అలా అకాలవర్షం ప్రారంభమయింది.

పావని "ఎక్కడన్నా నిలబడి తడవకుండా తలదాచుకుందామ"ని అనుకున్నాడు. కానీ, అలా చేయలేదు. నిలువెల్లా తడుస్తూనే గడగడ వణుకుతూ నడిచి వంతెన దాటి, కట్ట దిగి ఎక్కడా ఆగకుండా ఇల్లు చేరుకున్నాడు.

ఈశ్వరి అంత వర్షంలోనూ వీధి గేటు చప్పుడు విని వరండాలో కూర్చుని ఉన్నదల్లా లేచి లైటు వేసింది.

నిలువెల్లా తడిసి నీళ్ళు కారుతున్న అన్నను చూసి నివ్వెరపోయింది. ఏదో అడిగింది.

అతడు వినిపించుకోలేదు.

'ఊఁ' అని మాత్రం అని లోపలికి నడిచాడు.

*　　　*　　　*

ఆనాడు సోమవారం. ఉదయం తొమ్మిది గంటలవేళ రమణయ్య హడావిడిగా తయారై కాలేజీకి వెళ్ళిపోయాడు.

ప్రసన్నలీల బండెడు బరువున్న కామర్సు పుస్తకాలతో తానూ కాలేజీకి బయలుదేరి వెళ్ళింది.

పావని రాత్రి పొద్దుపోయి వచ్చినవాడు కాస్సేపటి కిందటే ఆలస్యంగా నిద్ర లేచి పంచలో కూర్చుని వున్నాడు.

ఈశ్వరి కాఫీ గ్లాసుతో ముసలమ్మ గదిలోకి వెళ్ళింది. ఆమె కళ్ళుమూసుకుని కూర్చుని వుంది.

"నాయనమ్మా కాఫీ తీసుకో అన్నది ఈశ్వరి. ముసలామె కళ్ళు తెరచి చూసి సర్దుకుని కాఫీ గ్లాసు అందుకుంది.

"జాగ్రత్త" అన్నది ఈశ్వరి, ముసలామె చేతివేళ్ళు వణకుతుండడం గమనించి.

ముసలామె కాఫీ ఒక్క గుటక వేసి "అమ్మడూ! అమ్మను పిలుస్తావా ఒకసారి" అన్నది.

ఈశ్వరి తల ఊపి లోపలికి వచ్చి "అమ్మా! నాయనమ్మ రమ్మంటున్నదే నిన్ను" అని చెప్పింది.

మాణిక్యాంబ 'ఏమిటో విశేషం' అని గొణుక్కుంటూ తడి చేతులు కొంగుకు తుడుచుకుంటూ ముందు గదిలోకి వచ్చింది.

ముసలామె కోడల్ని చూసి "రా మాణిక్యం! ఇలా కూర్చో" అన్నది.

మాణిక్యాంబ చిత్రంగా చూస్తూ "లోపల పని అంతా మిగిలే ఉంది. ఏమిటి సంగతి?" అంటూనే మంచం చివర కూర్చున్నది.

ముసలామె కళ్ళార్పకుండా కోడలి ముఖం వంక చాలాసేపు చూసింది. ఆ తర్వాత కోడలి చేయి పట్టుకుని తన చేతిలోకి తీసుకుంది. ముడుతలుపడిన ఆ కుష్కించిన చేయి వెచ్చగా వుంది.

మాణిక్యాంబ మళ్ళీ "చెప్పండి. ఏమిటి సంగతి?" అని అడిగింది.

"ఏమీ లేదు" అని గొణిగింది ముసలామె.

తర్వాత కొన్ని క్షణాలాగి "ఇవాళ నేనేమీ తినను" అన్నది.

"ఏం? ఎందుకు తిండి మానేయడం? కార్తీకమాసం అంతా ఎక్కడలేని ఉపవాసాలు చేశారు కదా! ఇంకా ఎందుకు ఉపవాసం ?"

ముసలామె అకస్మాత్తుగా కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. నెమ్మదిగా "అబ్బాయి నన్ను ఎక్కడికీ వెళ్ళవద్దన్నాడు. ఇల్లు కదలవద్దన్నాడు. ఎందుకుట?" అని అడిగింది.

"ఏమో! నాకు తెలియదు. నాకూ చెప్పారు."

"ఏం చెప్పాడు?"

"మిమ్మల్ని ఎక్కడికీ పోనివ్వవద్దని."

"అదే ఎందుకుట? కారణం చెప్పాడా?"

"ఉహూఁ! ఏమీ చెప్పలేదు. నేను అడగనూ లేదు. బహుశా పెద్దవారు కదా, బయటికి రోడ్డు మీదికి వెళితే ఏ ప్రమాదమన్నా జరుగుతుందేమోనని ఆయన భయం కాబోలు."

ముసలామె నిట్టూర్చింది. తర్వాత దిండు కింద చేయిపెట్టి వెదికి తన తాళం చెవుల గుత్తి ఇవతలికి తీసింది. దాన్ని కోడలి చేతిలో పెట్టింది.

"ఇవి నాకెందుకు?" అన్నది కోడలు.

"నీ దగ్గరే ఉంచు. ఎవరికీ ఇవ్వకు....నా పెట్టె తాళం చెవి ఉంటుంది ఇందులో....నాకేదన్నా అయితే....అప్పుడు...."

ముసలామె గొంతు బొంగురు పోయింది. మాటలు ఆగిపోయాయి.

"అట్లా మాట్లాడకండి" అన్నది మాణిక్యాంబ ఆదుర్దాగా.

"పిచ్చిదానా" అని నవ్వింది ముసలామె.

"ఎల్లకాలం ఇలా ఉండిపోతానా ఏమిటి? ఎనభయ్యో వడిలో పడ్డాను. ఈ మాత్రం కాలూ చెయ్యీ ఆడుతూ ఉండగా దాటుకుంటే మంచిది. పరాయి అమ్మ కన్నబిడ్డవైనా తల్లిలాగా చూసుకున్నావు. నాకేదన్నా అయితే అప్పుడు మాత్రమే పెట్టె తియ్యి మా తాత చెబుతూ ఉండేవాడు. ఉన్నట్టుండి ఇంట్లో ఎవరైనా చస్తే అంతా గందరగోళం....ఒక్కొక్కప్పుడు శవాన్ని దాటించేందుకు కూడా డబ్బు ఉండకపోవచ్చు. ఆయన చెప్పేవాడు....అవసరమైనంత డబ్బు ఎవరికి వారు మూట గట్టుకుని ఉంచుకోవాలిట....అద్దద్ద అని శవాన్ని ఇంటిలో పెట్టుకుని డబ్బు కోసం, అప్పులకోసం బయలుదేరకూడదు.... అలాటప్పుడు ఎవరూ డబ్బు ఇవ్వరు కూడా. అది అశుభం...."

ఈ ధోరణి చాలాసేపు సాగేదేకానీ, అంతలో కోడలు లేచింది.

"సరే, నా దగ్గరే ఉంచుతాను తాళాలు" అన్నది.

ముసలామె గుండెల్లో బరువు దించుకున్నదానిలా నిట్టూర్చింది. ఏదో గొణుక్కుంటూ సర్దుకుని పడుకుంది. కళ్ళుమూసుకుంది.

మాణిక్యాంబ లేచి కొన్ని క్షణాలు అత్తగారి ముఖంలోకి చూస్తూ నిలబడి, తర్వాత ఇవతలికి వచ్చింది.

"ఏమంటున్నది నాయనమ్మ?" అని అడిగింది ఈశ్వరి.

"ఏమిటో! ఆమె ధోరణి ఆమెది" అన్నది మాణిక్యాంబ.

o o o o

కాలేజీ లంచ్ టైములో లీల దూరంగా చెట్టుకింద పచ్చికలో కూర్చుని తాను తెచ్చుకున్న టిఫిన్‌బాక్సు ముందు పెట్టుకుంది.

తెరిస్తే అందులో మూడు పూరీలున్నాయి. పక్కన మాగాయ ఉంది.

ఆమె ముక్క తుంచుకుని నోట్లో పెట్టుకోబోతూ ఉండగా బిలబిలమంటూ వచ్చి పడ్డారు ముగ్గురు పిల్లలు....

అంతా హోషు మీద ఉన్నారు. గలగలలాడుతున్నారు .... ఉత్సాహంతో పొంగి పొరలుతున్నారు.

ముగ్గురు పిల్లలూ సంపన్నుల పిల్లలే....

"ఇవాళ టిఫిన్‌బాక్సు తెచ్చుకున్నావే" అన్నదొక అమ్మాయి.

లీల నవ్వుతూ "బాట్లీబాయ్ బరువు లేదుగా ఇవాళ....అకౌంట్సు క్లాసున్న రోజు టిఫిన్ తెచ్చుకునే వీలుండదు" అన్నది.

లీల పక్కన వసంత చేరి "ఇదుగో! క్లాసుఫస్టు అమ్మడూ! మధ్యాహ్నం మనకు తెలుగు క్లాసొక్కటే ఉంది. తర్వాతి పీరియడ్ ఎకనమిక్స్ అమ్మగారు సెలవు మీదున్నారు ఇవాళ" అన్నది.

"ఆమెకేమయిందో!" అన్నది మరో అమ్మాయి.

"మళ్ళీ వేవిళ్ళేమోనే" అన్నది మూడో అమ్మాయి.

"మీరుండండే" అన్నది వసంత.

"కాబట్టి....మనం ఆ తెలుగు క్లాసొక్కటీ ఎగ్గొట్టి, హాయిగా రాజ్‌లో సినిమాకు పోదామని ప్లాన్ వేశాం. నువ్వు కూడా రావాలి."

"తెలుగు పాఠం పోదూ?" అన్నది లీల.

"పోతే పోనీ, ఆ శకుంతల కథ ఎవరిక్కావాలి?" అన్నది వసంత.

లీల సందేహిస్తుంటే. "ఏమిటి నీ బాధ? డబ్బు గురించి అయితే ఆలోచిం చకు. మా దగ్గర పుష్కలంగా ఉంది" అన్నది.

"అది కాదు" అని లీల నణుగుతుంటే వాళ్ళు ఇంకా మొండికెత్తారు మరి మాట్లాడనివ్వలేదు.

"ముందు ఆ బాక్సు మూత పెట్టెయ్....లే లే....ఒక హోటలుకు వెళదాం. అక్కడ టిఫిన్ చేద్దాం. ఆ తర్వాత సినిమా...." అని తొందరపెట్టారు.

లీలకు ఇహ తప్పలేదు. టిఫిన్‌బాక్సు మూత బిగించి లేచింది.

నలుగురూ ఆవరణలో చెట్టు కింద నిలిచి ఉన్న మారుతీ కారు దగ్గరికి వచ్చారు.

వసంత డ్రయివరుతో "రాముడూ! మాకు క్లాసులు లేవు ఇంక. మమ్మల్ని రాజ్ దగ్గరికి తీసుకుపో....అక్కడ మాకు టికెట్లు తెచ్చి ఇయ్యి. నువ్వు కూడా పది రూపాయలు తీసుకుని ఏదన్నా సినిమాకు పోయి కూర్చో. లేదా నీ చావు నువ్వు చావు. సరిగ్గా సినిమా వదిలే వేళకు తగలడు" అన్నది.

రాముడూ ముప్పై ఏళ్ళవాడు. నవ్వాడు. "అలాగే తల్లీ" అన్నాడు.

అందరూ ఎక్కికూర్చున్న తర్వాత అతడు కారు స్టార్టు చేయబోతుండగా-

వసంత "ఒరేయ్ చక్రధారీ! సాయంకాలం ఇంట్లో అమ్మగాని, నాన్నగాని ఎందుకు లేటయింది అని అడిగితే ఏం చెబుతావురా?" అని ప్రశ్నించింది.

అతడు నవ్వుతూ "అమ్మాయిగారు ఫ్రెండ్స్‌తో సినిమాకెళ్ళారని చెబుతాను" అన్నాడు.

"అలా చెబితే చచ్చావే నాచేతిలో.... పెద్ద.... సత్యహరిశ్చంద్రుడు బతికొ చ్చాడు! జాగ్రత్త... కాలేజీలో మీటింగు జరిగిందని చెప్పు.... ఇద్దరం ఒక్కటే మాటమీద ఉండాలి మరి...."

కారు పరుగెత్తి పరుగెత్తి హాలు ముందు ఆగింది. డ్రయివరు వంద రూపా యల నోటు తీసుకుని వెళ్ళి టిక్కెట్లు పట్టుకొచ్చి ఇచ్చారు. వసంత రెండు పది రూపాయల నోట్లు అతనికిచ్చి "ఇందాక పదే ఇస్తానన్నాను. ఇప్పుడు ఇరవై ఇస్తు న్నాను. మళ్ళీ ఆట వదిలేవేళకు వచ్చేయ్" అన్నది.

హాలు లోపల అంతా ఆడంబరంగా ఉంది. చల్లగా హాయిగా ఉంది. పాశ్చాత్య సంగీతం రంజుగా వినిపిస్తున్నది.

ముందు ఏదో న్యూస్ రీలు. తర్వాత సినిమా మొదలయింది. లీలకు ఇబ్బంది అనిపించింది. అదేదో దారుణమైన సెక్సు సినిమా. బట్టలు లేని దిగంబర నాయికలు.... మొరటు నాయకులు....ఆలింగన చుంబనాదులు.... భీభత్సమైన పోరాటాలు....

ఇంటర్వెల్‌లో డ్రింకులు తాగారు. తర్వాత ఆట ముగిసి కిందికి వస్తే డ్రయివరు సిద్దంగా ఉన్నాడు కారు దగ్గర.

అందులో ఒక అమ్మాయికి లీల వాలకం నచ్చలేదల్లే ఉంది. ఆమె నిశ్శబ్దంగా ఉండడం నచ్చలేదల్లే ఉంది. తమలాగా అల్లరి చేయకపోవడం నచ్చలేదల్లే ఉంది.

కారులో "ఏమిటలా ముంగిలా కూర్చున్నారు లీలగారు" అన్నది కొంచెం వ్యంగ్య ధోరణిలో.

"ఏమీ లేదు" అన్నది లీల నెమ్మదిగా.

వారి అలంకరణ, దుస్తులు, ఆర్భాటం, మాటల దర్పం - ఇవేవీ లీలకు మింగుడుపడడంలేదు.

వారంతా న్యూ రిచ్ తరగతి పిల్లలు. చేతినిండా డబ్బుంటుంది. ఎక్కడలేని గర్వం ఉంటుంది. వారికి చదువు ఒక భోగం. అంతే. చదువుకోకపోయినా, చదువు లేకపోయినా వారు ఇంత హాయిగానూ, ఆమాటకొస్తే ఇంతకన్నా హాయిగానూ నిశ్చింతగానూ బతకగలరు.

తనకు అలా సాగదు. తన అక్కలాగా ఊరికే డిగ్రీ సంపాదించుకుని కూర్చున్నా లాభం లేదు. చదువు పూర్తిచేసి ఏ బ్యాంకు పరీక్షలో, మరే పోటీ పరీక్షలో రాసి తప్పనిసరిగా మంచి ఉద్యోగం సంపాదించుకోవాలి. అప్పుడు మిగిలినవన్నీ ఒకవేళ తలిదండ్రులు కష్టపడి పెళ్ళిచేసినా, ఒక మగవాడి దయాదాక్షిణ్యాలమీద, వాడి మోచేతి కింద నీళ్ళు తాగుతూ పడి ఉండవలసిందే. అలా కాక మంచి ఉద్యోగం సంపాదించుకుని, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆర్థిక పుష్టి సాధించుకుంటే తప్ప తన లాటి మధ్యతరగతి ఆడపిల్లలకు సుఖం లేదు, శాంతి లేదు. 'తాను ఈనాడు చేసింది తప్పు. ఇలాంటి తప్పు మళ్ళీ చేయకూడదు' అనుకుంది మనసులో.

"ఇక్కడ దిగుతాను" అన్నది.

"అలాగే....రాముడూ! ఈ బుద్ధిమంతురాలు ఇక్కడ దిగుతుందట. కొంచెం ఆపు నాయనా" అన్నది వసంత.

డ్రయివర్ కారు ఆపి ఎందుకో ఒక విధంగా లీల వంక చూశాడు. అదోరకంగా నవ్వాడు కూడా.

లీల దిగి మర్యాదకోసం చేయి ఊపింది. కారు రివ్వున వెళ్ళిపోయింది.

లీల నడుస్తూ 'తర్వాత కూడా వాళ్ళు నన్ను గురించి, నా సామాన్యమైన బట్టల గురించి మాట్లాడుకుంటారు' అనుకున్నది. ఏదో బాధ అనిపించింది. ఇంటికి

చేరుకున్న తర్వాత ఎవరూ ఏమీ అడగకపోయినా, 'కాలేజీలో మీటింగు. అందుకని లేటయింది' అని చెప్పింది అనవసరంగా.

కాస్సేపటి తర్వాత ఈశ్వరి "లీలా! టిఫిన్‌బాక్సులో పూరీలు అలాగే ఉన్నాయి. తినలేదేందుకనే?" అని అడిగింది.

"ఆకలి కాలేదులే" అని చెప్పి ఊరుకుంది లీల.

o o o o

పార్కులో....

శివుడు చెంపకు చెయ్యి ఆనించుకుని కూర్చుని ఉన్నాడు.

కృష్ణమీనన్ బయటి నుంచి వచ్చి శివుడి కెదురుగా కూర్చుని పచ్చికలో పొట్లం విప్పి పరిచి, శివుడి భుజం మీద తట్టి....

"తిను....బజ్జీలు బ్రహ్మాండంగా ఉన్నాయి" అన్నాడు.

శివుడు కదలలేదు.

"చీరప్ మాన్! ఏదో ఒక మార్గం ఆలోచిద్దాంలే. ఊరికే దిగులుపడకు" అన్నాడు కృష్ణ మీనన్.

శివుడు నెమ్మదిగా "మంచి అవకాశంరా ఇది. కానీ, మా నాన్నగారిని గురించి నాకు నమ్మకం లేదు. అసలే నెలాఖరు రోజులు" అన్నాడు.

"చూద్దాంలే. వ్యవధి ఉందిగా. ఈలోపల నువ్వు ఊరికే దిగులుపడి కూర్చోక అదేపనిగా బాగా ప్రాక్టీసు చేస్తూ ఉండు. మా ఇంటికొచ్చెయ్. మా నాన్నగారితో కూర్చో. ఆయన కూడా ఆనందిస్తారు."

శివుడు ఆలోచనలో పడ్డాడు.

తాను చదరంగం ఆడతాడనీ, అందులో కొంత మంచి పేరు కూడా సంపాదించాడనీ తండ్రికి తెలుసు. అన్నకు కూడా తెలుసు.

ఇప్పుడు విశాఖలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు జరగబోతున్నాయి. అందులో పాల్గొనే అవకాశం వచ్చింది. దానికి మాధవ మీనన్‌గారు కారణం. కృష్ణ మీనన్ తనకా శుభవార్త చెప్పినప్పుడు ఎంత ఆనందం కలిగిందో తర్వాత అంత అనుమానమూ కలిగింది. ఇంట్లో పరిస్థితులు తనకు తెలుసు. తండ్రి ఇప్పటికే తనకు చాలా పర్యాయాలు ఎంతెంత దూర ప్రయాణాలకో, ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకో చాలా ఖర్చుపెట్టాడు. 'ఇప్పుడు చదరంగం పోటీలకు ఆయనచేత ఖర్చు పెట్టించడమా' అని శివుడి బాధ.

కృష్ణ మీనన్ చేతులు తుడుచుకుంటూ "శివా! నేను మీ నాన్నగారితో మాట్లాడతాను. నువ్వు నిశ్చింతగా ఉండు" అని ధైర్యం చెబుతున్నాడు. చీకటి పడబోతున్నది.

ఇద్దరూ లేచి పార్కు ఇవతలికి వచ్చి నడక సాగించారు.

కృష్ణ మీనన్ ఒకచోట ఆగి "నేనిక ఇంటికి వెళతాను. బస్సొస్తుంది" అన్నాడు.

శివుడు తల ఊపి "ఒకసారి మా ఇంటికి తప్పకుండా వస్తావుగా" అని అడిగాడు.

"నేను రావడమే కాదు. అవసరమైతే మా నాన్నగారిచేత చెప్పిస్తాను."

శివుడు ముందుకు నడిచాడు.

ఒకచోట రోడ్డుపక్కన కొందరు జనం గుమిగూడి ఉన్నారు. వచ్చేపోయే వారు 'ఏమిటేమిటి?' అంటూ ఆత్రుతతో అక్కడ ఉన్నవారిని ప్రశ్నిస్తున్నారు.

ఒకరిద్దరు విషయం విని, తోసుకుంటూ వెళ్ళి చూసివచ్చి చప్పరిస్తూ—

"ఎంత కాని కాలం వచ్చింది" అని స్పందిస్తున్నారు.

శివుడు ఆగి "ఏమిటి? ఏం జరిగింది?" అని ఒక వ్యక్తిని అడిగాడు.

ఆ మనిషి మౌనంగా చేత్తో పక్కకు చూపించి, విసవిస నడిచి వెళ్ళి పోయాడు.

అప్పటికి కొద్దిమంది మిగిలారు.

పక్కనే మునిసిపల్ కార్పొరేషన్ వారి చెత్తకుండీ. పైనుంచి ఒకమేర వెలుతురు పడుతున్నది కానీ, అక్కడేమున్నదో స్పష్టంగా దూరానికి తెలియడంలేదు.

శివుడు అమితాసక్తితో దగ్గరికి వెళ్ళాడు.

చెత్తకుండీ పక్కన ఘోరమైన దృశ్యం.

అప్పుడో కాస్సేపటికి కిందటనో భూమ్మీద పడి ఉండాలి నెత్తురుగుడ్డు.... నిర్జీవ పిండం....శివుడికి ఒళ్ళు జలదరించింది.

"చూస్తూనే ఉన్నానండీ" అంటున్నాడొకాయన.

"అదుగో, మా అరుగులమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాను. అంతలో కుక్క ఒకటి చెత్తకుండీలోకి దూకడం కూడా చూశాను. అది నోట కరచుకుచి మూటను ఇవతలికి తెచ్చి అటూ ఇటూ లాగడం కూడా చూశాను కుక్కను తరిమే శాను."

శివుడికి కళ్ళు తిరిగినట్టనిపించింది. కడుపులో చేతులతో దేవినట్టయింది. "దారుణం" అనుకున్నాడు.

"ఎవరిదో ఈ దుర్మార్గం.... పాపం బలిసిపోతున్నది! ఇదెక్కడి ఘోరకలి" అంటూ అతని పక్కగా ఎవరో నడిచిపోయారు.

ముందు ముందు లైట్లు మందంగా వెలుగుతున్నాయి. ఆ రోడ్డుమీద నడి చేందుకు భయపడ్డాడు. కళ్ళముందు ఆ పసిగుడ్డు శరీరమే కదలాడుతున్నది. అందు వల్ల పక్కకు తిరిగి జనసందోహంతో కిటకిటలాడుతున్న బీసెంట్ రోడ్డుకు వచ్చాడు.

పేవ్‌మెంట్లమీద కేకలు, గోల, రొద.... ఎన్నెన్నో రకాల వస్తువులు.... అటూ ఇటూ కళ్ళు మిరుమిట్లు గొలిపేలా బట్టల దుకాణాలు.... స్టీలు సామాన్ల దుకా ణాలు.... రేడియో, టీవీ దుకాణాలు.... అంతా గందరగోళంగా, కోలాహలంగా ఉంది.

శివుడు ఆగిపోయాడు.

ఒక టీవీ షోరూమ్‌లో.... లోపల.... ఒకచోట కూర్చుని ఉన్న తండ్రి కని పించాడు. అనుమానం తీర్చుకుందామని లోపలికి అడుగుపెట్టాడు కూడా.

నిజమే.

తని తండ్రి లోపల ఒక ఖరీదైన రంగుల టీవీ సెట్ ముందు ఇహలోకం మరచిన వాడిలా కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో ఆన్ చేసి ఉన్న అన్ని టీవీ లలో ఎప్పటిదో నలుపు తెలుపు సినిమా వస్తున్నది.

"ఏం కావాలి?" అన్న ప్రశ్న వినబడగానే శివుడు అనవసరంగా తడబడి....

"ఏమీ అక్కర్లేదు" అంటూ బయటికి వచ్చి ఇంటిదారి పట్టాడు.

* * *

రమణయ్య టీవీముందు కుర్చీలో కూర్చుని తన్మయుడై సినిమా చూస్తు న్నాడు. పక్కన మామూలు కూరల సంచి ఉంది.

ఆనాడు కాలేజీ నుంచి తిరిగి వస్తూ, ఆ షాపు ముందు అలవాటు ప్రకారం ఆగాడు.

మోహన్ "రండి, లోపలికి రండి" అన్నాడు.

"ఇవాళ మా సేఠ్‌గారు లేరు. ఊరెళ్ళారు. హాయిగా మీ ఇష్టం వచ్చినంత సేపు కూర్చోండి. మంచి సినిమా రాబోతున్నది.

రమణయ్య చేతిలో కూరల సంచితో లోపలికి వెళ్ళాడు. లోపల ఒక అను మానంలాటిది కలిగింది.

"ఈ కుర్రవాడు తనను ఎందుకింత ప్రత్యేకంగా, ఆదరంగా చూస్తున్నాడు?"

ఆ మాటే అడిగితే మోహన్ నవ్వాడు. షాపులోపల ఆ సమయంలో జనం ఎక్కువ లేరు. ఉన్నవారిని చూసేందుకు మరో బాధ్యతగల వ్యక్తి అక్కడ ఉండనే ఉన్నాడు.

మోహన్ చెప్పాడు. "సార్, మనం ఎవరికైనా చిన్న ఉపకారం, సాయం వంటిది చేస్తే అవతలివాళ్ళు దాన్ని ఎప్పటికీ మరచిపోరు. నేను ఒకప్పుడు మా అన్నయ్యకు అర్జంటుగా స్టడీ సర్టిఫికెట్ అవసరమై మధ్యాహ్నం మీ కాలేజీకి వచ్చాను. ఒకాయనను అడిగి "అర్జంటుగా కావాలి. సాయం చెయ్యమ"ని ప్రాధేయ పడితే ఆయన విసుక్కున్నాడు."ఇక్కడ నిమిషాలమీద పనులు జరగవు" అని కసురుకున్నాడు. "అప్లికేషన్ ఇచ్చి డబ్బుకట్టి, వారం రోజుల తర్వాత కనబడమ"న్నాడు. అప్పుడు మీరు చూశారు నన్ను. "ఏమిట"ని అడిగారు. మీకూ చెప్పాను. మీరు నా అవసరం గ్రహించి కూర్చోమని చెప్పి, గంటలో నా పని చేసి పెట్టారు. తర్వాత తెలిసింది ఆ మనిషి డబ్బు తీసుకునికానీ పని చెయ్యడని. మీరు ఏమీ ఆశించకుండా సాయం చేశారు. అది ఎప్పటికీ నాకు గుర్తుంటుంది."

రమణయ్య "బొరా" అనుకుంటూ ఆనందంగా వెళ్ళి కూర్చున్నాడు. ఉన్నట్టుండి సినిమా మొదలుకాగానే ఆ ఆనందం వేయిరెట్లయింది. ఎక్కడలేని హుషారు వచ్చింది. కాలచక్రం వెనక్కు తిరిగి తాను మళ్ళీ పాతికేళ్ళ యువకుడై పోయినట్టు అనిపించింది.

అది ముప్ఫైఏళ్ళనాటి సినిమా. మధుబాల కోసం రమణయ్య ఆ రోజుల్లో ఆ సినిమాను అయిదారుసార్లు చూశాడు. ఇప్పుడు బుల్లితెరమీద ఆ సినిమాను చూస్తుంటే అద్భుతమనిపిస్తున్నది.

మధుబాల పాట పాడుతూ నాట్యం చేస్తున్నది.

అప్పటికి రమణయ్యకు పెళ్ళి కాలేదు. నెలకు నూట అయిదు రూపాయలు జీతం వచ్చేది. తనతో చదువుకున్న వాళ్ళు కొందరు పై చదువులకు వెళ్ళిపోయారు మరి కొందరు అదృష్టవంతులు చిన్నవయినప్పటికీ, కాస్త చేయిజాపితే డబ్బు దొరికే ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఆ జీతం రాళ్ళు ఆనాడు ఎక్కువనిపించేవి. కొన్ని చిన్న చిన్న భోగాలు అనుభవించేవాడు కూడా.

ఆ చిరుభోగాలలో ముఖ్యమైనవి సినిమాలు.

రమణయ్య రోడ్డుమీద నడుస్తూ ఉంటాడా, గోడల మీద రకరకాల రంగుల హంగులతో ఎన్నో పోస్టర్లు కనిపిస్తుంటాయి కళ్ళు చెదరగొడుతూ. అవేవి ఆకర్షించవు. కానీ, తాను చిన్నతనంలో, యౌవనంలో చూసిన కొన్ని సినిమాలు అరుదుగా ఎక్కడైనా తిరిగి వస్తే మనసు పీకుతుంది.

ఇటీవల అంతే జరిగింది.

టీసెంటురోడ్డు దాటుతూ ఉండగా గోడపైన ఒక పోస్టర్ కనిపించింది. అలనాటి ఎప్పటిదో అనార్కలీ! దానితో మనసు మహా పీకింది. పైగా అది

ఆనాడు మాత్రమే. మరునాడు ఏదో పెద్ద సినిమా. ఇది బహుశా గ్యాప్‌లో వేసి ఉంటారు. దగ్గరలోనే హాలు. టికెట్టు తీసుకుని లోపలికి వెళ్ళి కూర్చున్నాడు తరువాత మూడు గంటలసేపు ఈ లోకంలో ఉన్నట్టే లేదు.

బీనారాయ్! అదేమి అందం! అదేమి అద్భుత సంగీతం! పరవశుడై చూసి విందు భోజనం అరగించినంత ఆనందంతో ఆ రాగాలే తీస్తూ ఇంటికి వచ్చాడు. ఇవ్వాళా అలాగే....

ఇదేమీ గొప్ప కళాఖండం కాదు. ఒక మోస్తరు హాస్య చిత్రం. అయినా అందులో మధుబాల .... మధుబాల .... మధుబాల....

చిత్రం పూర్తి అయ్యేవరకూ తొమ్మిది గంటల వరకూ కూర్చునే వున్నాడు.

ఆ తర్వాత స్వప్నభంగం అయినవాడిలా లేచి మోహన్‌కు చెప్పి ఇవతలికి వచ్చాడు.

రోడ్డు వెంట నడుస్తూ వుంటే ఎంతో ఉత్సాహం పొంగి వచ్చింది. జనాన్ని విడిచి, జనంతో నిండిన ఆ వీధి విడిచి పక్కరోడ్‌కు మళ్ళాడు. చేతిలో సంచిఊపుకుంటూ కూనిరాగం తీస్తూ నడిచాడు.

ఒకచోట....

నలుగురో అయిదుగురో....

వ్యాను ఒకటి నిలిచి ఉంది.

మునిసిపాలిటీ వారు అక్కడి చెత్తకుండీ పక్కనుంచి ఒకచిన్న మూటవంటి దాన్ని వేసుకుని వ్యానులో వేసుకుని తీసుకుపోతున్నారు.

రమణయ్య 'ఏం జరిగింది? ఏమిటది?' అని అడిగాడు.

"ఏం జరిగిందా?" అని అందుకున్నాడొకాయన. "గంట సేపటినుంచి చెప్పలేక చచ్చిపోతున్నాను. అదిగో మా అరుగు మీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాను" అని మొదలుపెట్టి క్షుణ్ణంగా వివరాలన్నీ చెప్పాడు. తర్వాత చివరి మాటగా-

"ఇప్పుడిక ఇంటికిపోయి స్నానం చేసి జపం చేసుకుంటాను" అన్నాడు.

రమణయ్య చలించిపోయాడు. చుట్టూ చూస్తే ఇప్పుడెవరూ లేరు. వ్యాను వెళ్ళిపోయింది. ఎటువారటు పోయారు.

రమణయ్య మౌనంగా నడక సాగించాడు.

* * *

రాత్రి....

రమణయ్య వరండాలో నిద్రకు ఉపక్రమించబోతుండగా-

"నాన్నా" అంటూ వచ్చాడు శివుడు, లైట్ స్విచ్ వేసి. వెనుకనే కృష్ణమీనన్ కూడా ఉన్నాడు.

"ఏమిట్రా" అంటూ లేచి కూర్చున్నాడు రమణయ్య.

"నమస్కారమండీ" అన్నాడు కృష్ణమీనన్.

"రండి ఏమిటి విశేషం ఇద్దరూ వచ్చారు"అన్నాడు రమణయ్య నవ్వుతూ.

ఇద్దరూ కూర్చున్నారు.

కృష్ణమీనన్ ఎర్రగా సన్నగా ఉంటాడు. నవ్వు ముఖం....

"ఏమి లేదు! మీతో ఒక విషయం మాట్లాడాలనీ...." అంటూ నసిగాడతడు.

రమణయ్య "అదేదో గొప్ప విషయమే అయి ఉండాలి. లేకపోతే ఈ సమయంలో...." అంటూ ఆగాడు రమణయ్య.

"ఏమీ లేదండి., గొప్ప విషయమేమీ కాదు. చిన్న విషయమే...."

"కానివ్వండి...."

"విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలున్నాయి. అందులో మీ వాడు సెలక్ట్ అయ్యాడు. మొన్ననే విషయం తెలిసింది అంతకుముందు ఇక్కడ జరిగిన సెలక్షన్‌లో మీ వాడు ముందున్నాడు. ఇప్పుడిది మంచి అవకాశం...."

"మా వాడు చదరగం ఆడతాడా? నాకు తెలియదే" అన్నాడు రమణయ్య ఆశ్చర్యం నటిస్తూ.

"మా నాన్నగారి దగ్గరే మేమిద్దరమూ కూర్చుని ఆడుతూ ఉంటాము. మా నాన్నగారే ఇతన్ని ఎంకరేజ్ చేశారు. నాదేమో మామూలు వానాకాలం ఆటలెండి. మీ వాడు బాగా ఆడతాడు. మా నాన్నగారు మీ వాణ్ని మంచి ప్లేయరని మెచ్చుకుంటూ ఉంటారు ఎప్పుడూ. ముందు ముందు మంచి ఫ్యూచర్ ఉందని అంటూ ఉంటారు''

"ఊఁ. అయితే, ఇప్పుడు నేనేం చేయాలి?" అన్నాడు రమణయ్య.

"మీరు ఒప్పుకోవాలి. అంతే" అన్నాడు కృష్ణమీనన్ తెలివిగా.

"దానికేం? ఒప్పుకోకుండా ఉండేందుకు ఇందులో ఏముంది? నిక్షేపంగా వెళ్ళండి"

"అదే.... కొంచెం ఖర్చు ఉంటుంది కదా అని."

రమణయ్య ఆలోచనలో పడ్డాడు. ఈ కుర్రవాడు మహా తెలివిగలవాడు. ముందు 'సరే' అనిపించుకుని ఇప్పుడు అసలు విషయం బయటపెడుతున్నాడు.

"ఎంత కావాలేమిటి?" అని అడిగాడు కొడుకుని.

అతడు ఏదో చెప్పబోతుండగా కృష్ణమీనన్ అడ్డు వచ్చి-

"ఎంతో ఎందుకండీ? మహా అయితే ఒక నాలుగు వందలు. అంతే" అన్నాడు.

రమణయ్య గతుక్కుమన్నాడు.

ఇంక మరేమీ మాట్లాడేందుకూ వీలులేదు.

"ఊఁ. చూద్దాంలే" అని మాత్రం ఒప్పుదలగా అని ఊరుకున్నాడు.

లోలోల మాత్రం "ఇవాళ పదిహేడో తారీఖు. దగ్గర అంతెంత మాత్రంగా ఉంది డబ్బు. నెలాఖరు రోజులొస్తున్నాయి" అనుకోకుండా ఉండలేకపోయాడు.

కళ్ళ ముందు ఎప్పటిదో తండ్రి తాతల నాటిది, ఎల్లప్పుడు పెట్టెలో పడి ఉండే వెండి కంచం - బరువైనదీ, మధ్యలో బంగారపు పువ్వు ఉన్నదీ - కదిలింది.

తనలో తాను నవ్వుకున్నాడు.

* * *

పావని షెడ్‌లో ఆనాటికి పని ముగించుకుని చేతులు కడుక్కున్నాడు.

షిఫ్ట్ అయింది. ఇక బయటకు వచ్చి ఆరు బయట గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

పైన ఆకాశంలో చంద్రబింబం ఇంకా సూర్యాస్తమయం కాకముందే వెలుగులు చిమ్ముతూ ఒకవైపు కనిపిస్తున్నది. సూర్యుడు ఆనాటికి డ్యూటీ అయిన వాడిలా అస్తమించబోతున్నాడు.

ఎదురుగా కొండ. కొండమీదనూ కొన్ని ఇళ్ళు. అంత పైకి మనుషులు ఎలా వెళ్తారో అనుకున్నాడు.

"నేను వస్తానుండవయ్యా మహానుభావా" అంటూ వచ్చాడు రాఘవులు. బస్ స్టాప్‌కు మరో ఫర్లాంగు దూరం నడవాలి.

"ఎక్కడయినా టీ తాగించు. తర్వాత నీ బస్సు నువెక్కు. నా బస్సు నేనెక్కుతాను. ఎటు వాళ్ళం అటు పోదాం."

పావని తల ఊపుతూనే నడిచాడు.

అక్కడ ఒక చిన్న టీ స్టాలు - చెట్టుకింద పాక.... ముందేమో రెండు చెక్క బల్లలు.... టీ కలిపి ఇస్తూ ఒక నడివయసు స్త్రీ.... ఆ పక్కనే ఎల్లప్పుడూ కూర్చునో, పడుకునో ఉండే ఒక రోగిష్టిమారి వ్యక్తి. విరంతరం ఏదో సణుగుతూ ఉంటాడు. ఆమె యేమీ వినకుండా, లెక్కచేయకుండా తన పని ఏదో తాను చేసుకుంటూ ఉంటుంది.

ఒక పదేళ్ళ పిల్లమాత్రం మాసిన పొట్టి పరికిణీతో, బిగుతు జాకెట్‌తో గ్లాసులు కడగడం వంటి పనులు చేస్తూ ఉంటుంది.

రాఘవులు బల్లమీద కూర్చుని నిట్టూర్చి "ఇక ఈ ఉద్యోగం ఎన్నాళ్లో చేయలేం బ్రదర్. ఈ పొగలో, ఈ రొదలో చచ్చిపోతున్నాం. ఎన్నాళ్ళు చేసినా గొర్రె తోక బెత్తెడే అన్నట్టు ప్రమోషన్లూ ఉండవు, జీతంరాళ్ళూ పెరగవు" అంటూ నస పెట్టడం ప్రారంభించాడు.

అతడొక విచిత్ర జీవి. కదిలిస్తే చాలు తన బాధలు తప్ప, అదీ ఆర్థిక బాధలు తప్ప మరేమీ మాట్లాడడు. ఉన్నది ఇద్దరు మగపిల్లలు. వాళ్ళ చదువులూ. పెళ్ళిళ్ళు కూడా పూర్తి అయినాయి. నిక్షేపంగా మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారు కూడా. కాకపోతే తండ్రి ధోరణి నచ్చక వేరే విడిగా ఉంటున్నారు. అదీ బాధ. తన దగ్గరే చాలీచాలని ఆ క్వార్టర్సులోనే ఉండి సంపాదన అంతా తన చేతుల్లో పోయడం లేదని వాళ్ళను సాధించేవాడు.

ఆ సాధింపు ఎంత దూరం పోయిందంటే 'మిమ్మల్ని కన్నప్పటి నుంచీ పెంచి, పెద్ద చేసి చదువు సంధ్యలకు పెట్టిన పెట్టుబడి ఎంతో తెలుసా?' అని లెక్కలు చెప్పడం ప్రారంభించాడు. వాళ్ళు తక్కువేమీ తినలేదు. 'మమ్మల్ని అడిగి కన్నారా?' అన్నారు.

'మేమిద్దరమూ కట్నాలు తీసుకోమని భీష్మించుకుని కూర్చుంటే మాకు తెలియకుండా చాటుగా ఇద్దరి మీదా పాతిక వేలు రాబట్టుకున్నావు. పైసా కూడా కట్నం తీసుకోలేదని మాతో అబద్ధం చెప్పావు. నువ్వు చెప్పే ఖర్చుకూ, దానికి చెల్లు' అన్నారు.

చివరికి ఎవరి తోవన వారు వేరే ఇళ్ళు అద్దెకు తీసుకుని వెళ్లిపోయారు.

రాకపోకలు కూడా క్రమంగా మందగించి పోయాయి. ఇంటి దగ్గర ఇల్లాలి సణుగుడు కూడా ఎక్కువయింది.

'వయసు మీరుతున్నది. ఇప్పుడు కన్నబిడ్డలను దూరం చేసుకున్నాం. దానికి నువ్వే కారణం' అని ఆవిడ సణాయింపు.

అతనికి డబ్బు అంటే విపరీతమైన యావ. జేబులో నుంచి పావలా అయినా ఎప్పుడూ ఇవతలికి తీయడు.

పాపని టీ చప్పరిస్తూ ఉండగా ఉన్నట్టుండి ఎడమకన్ను అదిరింది. ఎందుకో మనసంతా ఒక విధమైన గ్లాని....దిగులు వంటిది వ్యాపించింది.

"ఎడమ కన్ను అదురుతున్నది" అన్నాడు పైకి.

రాఘవులు "ఏమీ లేదు. ఒంట్లో వేడిచేస్తే కన్ను అదురుతుంది" అన్నాడు.

పావని గ్లాసు పక్కన ఉంచి జేబులోనుంచి సదిరూపాయల కాగితం తీశాడు.

"ఉండవయ్యా నేనిస్తాను" అంటాడు తప్ప రాఘవులు టీకప్పు క్రిందనైనా ఉంచడు.

ఆవిడ పావని వంక చూసి నవ్వుతూ "చిల్లర లేదు" అన్నది.

"నా దగ్గిరా పది నోటే ఉంది" అన్నాడు రాఘవులు.

"రేపివ్వండి" అన్నదామె పావనితో అనవసరంగా ఒళ్ళు విరుచుకుంటూ. పావనికి మహా చిరాకనిపించింది.

"నువ్వే....రేపు ఇద్దువుగానిలే. నోటు ఉంచుకో" అని కదిలిపోయాడు.

రాఘవులు పరుగులాటి నడకతో అతన్ని అనుసరించాడు.

"డబ్బు విషయంలో నిర్లక్ష్యం పనికి రాదయ్యా" అని మొదలుపెట్టాడు. మాట్లాడుతూనే ఉన్నాడు.

పావని ఉలుకూ పలుకూ లేకుండా వింటూ నడుస్తున్నాడు.

వీధి లైట్లు వెలిగాయి. బస్టాపు దగ్గర జనం పలుచగానే అయినా ఉన్నారు. ఉండి ఉండి ఆ కచ్చా రోడ్డు మీద లారీలు రొదచేస్తూ పోతున్నాయి.

అప్పుడు రాఘవులు చిన్న కొడుకు శ్రీనివాసు కొంచెం దూరంలో సైకిలు ఆపి స్టాండువేసి "నాన్నా" అంటూ వచ్చాడు. అతడు ఈమధ్య తండ్రితో కొంచెం మాట్లాడుతున్నాడన్లే ఉంది.

అతడు అదుర్దాగా "నాన్నా! నువ్వు సప్తగిరి దుకాణం వాడికి డబ్బుకట్టావా?" అని అడిగాడు.

రాఘవులు పెడసరంగా "కడితే కట్టానేమో! నీకెందుకు?" అన్నాడు.

"అదే చెబుతున్నాను" అన్నాడు శ్రీనివాసు.

"జనం గగ్గోలు పెడుతున్నారు. ఊరంతా గోలగా ఉంది. సప్తగిరి వాడు రాత్రికి రాత్రి దుకాణం మూసేసి బస్తాల కొద్దీ కరెన్సీ నోట్లు తీసుకుని పరారై పోయాట్ట. నాలుగైదు రోజుల నుంచి పత్తా లేడని జనం ఘోష పెడుతున్నారు. అక్కడ అంతా గొడవగా ఉంది. విషయం పోలీసుల దాకా వెళ్ళినట్టుంది."

రాఘవులు "ఆఁ" అన్నాడు పెద్దగా. మనిషి ముఖంలో కళ తప్పింది.

ఆ తర్వాత "నిజమా?" అని అరిచాడు.

"నిజం నాన్నా" అన్నాడు కొడుకు.

రాఘవులు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పావని కంగారు పడ్డాడు.

అక్కడి వారు నలుగురైదుగురు చుట్టూ చేరారు.

"ఏం జరిగిందేం జరిగింద"ని ప్రశ్నలు కురిపించారు.

"గుండెజబ్బేమో" అన్నాడొకడు.

పావని రాఘవులు చుట్టూ చెయ్యి వేసి పట్టుకుని లేవదీసి "కంగారు పడకండి" అంటున్నాడు.

ఒక ఆటోరిక్షాను పిలిచి, అందులో కూర్చోబెట్టి శ్రీనివాసుతో "నువ్వు నెమ్మదిగా వస్తూ ఉండు. నేను మీ నాన్నను ఇంటికి తీసుకుపోతాను" అన్నాడు.

"కాదు....సప్తగిరి షాపుకు పోదాం" అన్నాడు రాఘవులు.

"సరే, సరే" అన్నాడు పావని.

ఆటో కదిలింది. రాఘవులు ఒక పక్కకు ఒరిగిపోయి కూర్చున్నాడు.

కాస్సేపు ఉండి "ఇంకేముంది? అంతా అయిపోయింది. మునిగిపోయాను" అని బోరున ఏడవటం మొదలుపెట్టాడు.

ఆటో డ్రైవర్ వేగం తగ్గించి "ఏం జరిగింది సార్?" అని అడిగాడు.

"ఏమీ లేదులే" అన్నాడు పావని అతనితో.

"ఏమీ ఫరవాలేదు. మీ వాడు విన్నది వట్టి వదంతి కావచ్చు. ఇటువంటి వదంతులు కొందరు పనిలేనివాళ్ళు లేవదీస్తూ ఉంటారు. వాటినన్నిటినీ నమ్మితే ఎలా? కుదుటపడండి."

రాఘవులు తల ఊపాడేకానీ, కుదుటపడే సూచనలు మాత్రం ఏమీ కనిపించలేదు.

"అసలేం జరిగింది?"

"ఏం జరిగిందంటే...." అని నెమ్మదిగా మొదలుపెట్టాడు రాఘవులు.

"నాలుగైదు నెలల క్రిందట....ఎవరో చెప్పారు నాకు. ఒక దుకాణం.... ఇనుప బీరువాలు, టీవీలు, రేడియోలు, మిక్సీలు, ఇవికాక ఇంకా అనేక రకాల స్టీలు సామగ్రి.... పెద్ద దుకాణామే. వాడు ఒక స్కీము పెట్టాడు."

ఇక్కడ ఆగాడు రాఘవులు. ఒక్క క్షణం ఆగాడు.

మళ్ళీ గట్టిగా ఊపిరి పీల్చుకుని కొనసాగించాడు.

"ఇవాళ కొంత డబ్బు వాడి దగ్గర డిపాజిట్ చేశామనుకో. నలభై రోజుల తర్వాత ఇంతకు రెట్టింపు డబ్బుకాని, అంత విలువైన సామగ్రి - మనం కోరుకున్నది - కాని ఇస్తాడు. అట్లా చాలామందికి ఇచ్చాడు కూడా జనంలో నమ్మకం

పెరిగింది. ఎక్కడెక్కడి వాళ్ళూ, పక్క ఊళ్ళ నుంచి కూడా వచ్చి పెద్ద మొత్తాల్లో డబ్బు కట్టడం మొదలుపెట్టారు. పెద్ద పెద్ద ఉద్యోగులు, టీచర్లు, లెక్చరర్లు కూడా కట్టారు. వాడు వస్తువులు ఇస్తూనూ ఉన్నాడు. మన విశ్వేశ్వరం ఒకనాడు చెబితే వెళ్ళి పరిచయం చేశాను. వాడితో మాట్లాడాను కూడా. "ఎట్లా ఇవ్వగలుగుతున్నావ"ని అడిగితే, "మా వ్యాపార రహస్యాలు మాకుంటాయి సార్. అవన్నీ చెప్పగూడదు" అన్నాడు. విశ్వేశ్వరం రెండు వేల రూపాయలు కట్టాడు. సరిగ్గా నలభై రోజుల తర్వాత నాలుగు వేల రూపాయల స్టీలు బీరువా తెచ్చుకున్నాడు. తర్వాత మళ్ళీ అయిదువేల రూపాయలు అప్పుచేసి తీసుకువెళ్ళి కట్టాడు. నేను నిక్షేపంగా బ్యాంకులో ఉన్న పదిహేను వేల రూపాయలు పట్టుకువెళ్ళి కట్టాను. మరో వారం రోజుల్లో నలభై రోజుల గడువు పూర్తవుతుందని రోజులు లెక్కపెట్టుకుంటున్నాను."

మళ్ళీ రాఘవులు ఆగాడు. ఆటో డ్రైవర్ వింటున్నాడని కాబోలు గొంతు మరింత తగ్గించి చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆ రోజు....నేను వెళ్ళేసరికి సాయంకాలం అయిదు గంటల వేళ. ఆ దుకాణం ముందు పెద్ద క్యూ ఉంది కూడా. ఆడవాళ్ళకొక క్యూ. మగవాళ్ళకొక క్యూ. సామాన్లు తీసుకువెళ్ళేవారు తీసుకువెళుతున్నారు కూడా. అంతా కోలాహలంగా ఉంది. జనం హ్యాండ్‌బ్యాగుల్లో నోట్లకట్టలుంచుకుని నిలబడి ఉన్నారు. పక్కా అరగంట సేపు నిలబడ్డాను. తర్వాత డబ్బు కట్టి వచ్చాను."

ఆటో మార్కెట్ దాటిపోతున్నది. రోడ్డు అంతా లైట్ల తోరణాలతో వెలిగి పోతున్నది. లోబ్రిడ్జి క్రింద వాహనాల రద్దీ వల్ల వేగం మందగించింది. రాఘవులు ఉండి ఉండి నిట్టూరుస్తున్నాడు.

పావని అతని భుజం చుట్టూ వేసిన చేతిని తీయనేలేదు. లోలోపల ఎందుకో దిగులుగా, చింతగా ఉంది.

"అంతే కావాలి. అత్యాశకు పోతే తగిన శాస్తి జరిగింది" అని మొదట్లో అనిపించింది. కానీ, ఇప్పుడు మాత్రం జాలి మిగిలింది.

ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళు ఉద్యోగం చేశాడు. ఆ వచ్చిన జీతంరాళ్ళు, ఎప్పుడో ఒకప్పుడు కాసిని బోనస్‌రాళ్ళు తప్ప ఏం వచ్చింది? తమ ఉద్యోగాలు ప్రజలతో సంబంధాలున్నవి కావు. కానీ, అతి ముఖ్యమైనవి. దేశంలో ఎన్ని ఉద్యోగాలలో ఎంతమంది దక్కమాలిన సంపాదనతో బలిసి సుఖించడం లేదు? తాము పని చేసే చోట వేలాది మానవ హస్తాలు గడియారంతో పనిలేకుండా విరామ మెరుగక పని చేస్తాయి. ఎక్కడ ఎవడు ఏమాత్రం పొలుమాలినా పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగిపో తాయి. అయితే, తమను గురించి ఎవడు పట్టించుకుంటున్నారు? ఎవరు క్షణమాత్ర

మైనా ఆలోచిస్తున్నారు? జనం టిక్కెట్టు కొనుక్కుని, రిజర్వేషన్లు చేయించుకుని ప్లాట్‌ఫారం మీదికి వస్తారు. నిమిషాలు లెక్కపెట్టుకుంటూ మహా చిరాకు పడుతూ నిలబడతారు. ఒక్కసారి రైలెక్కి సర్దుకోగానే హాయిగా సెటిలయి నిద్రకు ఉపక్రమిస్తారు. అంతకు ముందు షెడ్డులలో ఆ ఇంజన్లను, బోగీలను ఎంతమంది తదేక దీక్షతో సర్వీసింగ్ చేశారో, చెక్ చేశారో వారికి పట్టదు. బస్సులయినా అంతే. ఎక్కడ ఎన్ని మానవ హస్తాలు శ్రమిస్తే బస్సులు స్టాండులోకి వస్తాయో ఆలోచించరు. మసి బట్టలతో, మసిబారిన ముఖాలతో, మసి చేతులతో శ్రమ చేస్తున్నవారు వారికి కనబడరు. వారికి సుఖజీవితం అనేది గగనకుసుమమే. వారి ఇళ్ళలో కలర్ టీవీలు, డబుల్ కాట్లు, మిక్సర్, గ్రైండర్లు, ఎయిర్‌కూలర్ల వంటివి అరుదు. అందువల్ల సగటు మనిషిలో సాధారణంగా ఉండే సుఖాభిలాష దురాశగా మారడంలో ఆశ్చర్యం లేదు. అప్పుడిక అడ్డదారులు తొక్కడమూ సహజమే. ఉద్యోగాల్లో ఉండి వీలున్న వారయితే లంచాలు మరుగుతారు. ఆ వీలులేని వాళ్ళు లాటరీలకు, జూదాలకు - ఇదుగో ఇలాంటి స్కీములకు ప్రలోభపడి కష్టాలు కొన్ని తెచ్చుకుంటారు.

ఆటో ఆగింది.

రాఘవులు ఒక్క ఉదుటున క్రిందికి దిగాడు.

ఎదురుగా ఒక గుంపు .... అందరూ నిశ్శబ్దంగా వున్నారు. కొందరు నెమ్మదిగా గొణుక్కుంటున్నట్టు మాట్లాడుకుంటున్నారు. వాతావరణం అంతా పరమ గంభీరంగా ఉంది. గాలికూడా బరువుగా, మందంగా వీస్తున్నట్టున్నది. పావని ఆటో డ్రయివర్‌కు డబ్బిచ్చి దూరంగా నిలబడ్డాడు.

ఉన్నట్టుండి విపరీతమైన గందరగోళం చెలరేగింది. ఎవరో ముందున్న వాళ్ళు దుకాణం తాళాలు పగలగొట్టారు. విపరీతమైన శబ్దం చేస్తూ షట్టర్లు పైకి లేచాయి. జనం ఉవ్వెత్తున లోపలికి చొరబడ్డారు. లోపల కొంత సామాను ఉంది. కుర్చీలు, టీ పాయ్‌లు, స్టీలు మంచాలు, కొన్ని మిక్సర్లు, గ్రైండర్లు, కొన్ని టీవీలు ఉన్నాయి. జనం ఎవరి చేతికందినవి వారు పట్టుకుని దడదడమని వెళ్ళిపోతున్నారు.

రాఘవులు వెర్రివాడిలా లోపలి జనాన్ని నెట్టుకుంటూ దూసుకుపోయాడు. చూస్తే అప్పటికే దుకాణం అంతా దాదాపు ఖాళీ అయిపోయింది. ఒక పోర్టబుల్ కలర్ టీవీని కౌగలించుకున్నవాడిలా క్షణం నిలబడ్డాడు. ఆ తర్వాత దాన్ని భుజాని కెత్తుకుని ఇవతలికి వచ్చాడు.

సరిగ్గా అదే సమయంలో పోలీసులువచ్చి జనం మీద విరుచుకుపడ్డారు. అందినవారిని అందినట్టు లాఠీలతో బాదడం ప్రారంభించారు. రాఘవులు టీవీని క్రింద

పెట్టి వెర్రివాడిలా "పదిహేనువేలు కట్టాను. అంతా పోయింది. దీన్ని తీసుకుపో నివ్వండి" అని అరుస్తున్నాడు. పోలీసువాడు ఏమనుకున్నాడో ఏమో, ఎత్తిన లాఠీ దించి "వెళ్లు వెళ్లు" అని మాత్రం అన్నాడు. నిమిషంలో వీధి అంతా నిర్మానుష్యమై పోయింది, దూరంగా నిలబడిన పావని నుదురు రుద్దుకుంటూ రాఘవులు కోసం ఎదురు చూస్తున్నాడు.

రాఘవులు వచ్చాడు. వెర్రివాడిలా ఉన్నాడు. జుట్టు చెదిరిపోయి ఉంది. సర్వ స్వం కోల్పోయినవాడిలా ఆక్రోశిస్తున్నాడు.

"అంతా పోయింది. అంతా అయిపోయింది" అంటున్నాడు.

పావని రిక్షా మాట్లాడి, అతన్ని ఎక్కించి తాను కూడా పక్కన కూర్చుని "ఊరుకోండి .... అయిందేదో అయిపోయింది" అన్నాడు.

రాఘవులు మాట్లాడ లేదు.

అతన్ని క్వార్టర్సు దగ్గర దింపి, శ్రీనివాసుతో జాగ్రత్తలు చెప్పి పావని నడక సాగించాడు.

ఫర్లాంగు దూరం నడిస్తే రైల్వే ఆసుపత్రి. జనసంచారం పలుచగా ఉంది. రోడ్డు వెడల్పయినది కావడాన లైట్ల వెలుతురు మందంగా ఉందనిపిస్తున్నది. పావని మనసులో ఏదో తెలియని చిత్రమైన భీతి. జరగరానిదేదో జరగబోతున్న దన్న ఊహ. ఎదురుగా రోడ్డుమీద అకస్మాత్తుగా ఎడమ నుంచి కుడివైపుకు ఏదో ప్రాకిపోయినట్టు అనిపించి అదిరి పడి ఒక్క క్షణం నిలబడ్డాడు. తర్వాత నడిచాడు. ఆసుపత్రి సమీపిస్తున్నకొద్దీ అతని మనసంతా అలజడి వ్యాపించింది.

అతను ఊహించినట్టే గేటు పక్కన రత్తయ్య నిలబడి వున్నాడు. దూరం నుంచే పావనిని గుర్తుపట్టి పరుగువంటి నడకతో ఎదురు వచ్చాడు.

"ఏం ఇంత ఆలస్యం?" అని అడుగుతూనే "ప్చ్.... అయిపోయింది" అన్నాడు చేయి ఊపుతూ పావని గతుక్కుమని "ఎప్పుడు" అని అడిగాడు.

రత్తయ్య "ఇంతకు ముందే .... ఆ అమ్మాయి కూర్చుని కూర్చుని విసుగు పుట్టిందేమో లేచి, ఎంతకూ కదలదేమిటా అని చూసింది. చూసి కంగారు పడింది. డాక్టరు వచ్చి "అయిపోయింద"ని చెప్పాడు. ఒక అరగంట అయిందేమో .... అంతే".... అన్నాడు. పావని చేతివేళ్ళు వణుకుతున్నాయి.

లోగొంతుకతో "ఏం చేద్దాం ఇప్పుడు?" అని అడిగాడు.

"రా.... ముందు కాసిని టీ నీళ్ళు గొంతులో పోసుకుని తర్వాత చూద్దాం."

ఇద్దరూ ఎదురుగా ఉన్న హోటలులోకి ప్రవేశించారు.

పావని కళ్ళముందు రామకృష్ణ ముఖం, కళ్ళు మెదలుతున్నాయి

"అయ్యో" అన్నాడు ఉన్నట్టుండి బాధగా.

"అనుకోనిదేం కాదుగా? ఇప్పుడు జరగవలసింది ఆలోచించాలి" అన్నాడు రత్తయ్య.

టీలో చక్కెర తక్కువ అయింది కాబోలు నోరంతా అరుచిగా, కనరుగా ఉంది. అక్కడ రత్నమాల ఒళ్ళో పసిపాపతో అలాగే కూర్చుని ఉంటుంది నిశ్శబ్దంగా. ఏడుస్తూ ఉంటుందా? ఇంకా ఆమె దగ్గిర కన్నీళ్ళు మిగిలిఉన్నాయా?

ఆస్పత్రి వరండాలు బాగా పొద్దుపోవడం వల్ల ఖాళీగా వున్నాయి. ఇద్దరూ మెట్లెక్కి వార్డులోకి వెళ్ళారు. అక్కడ చివరగా మంచం మీద కదలిక లేకుండా ప్రాణం లేని కట్టె. నిండుగా దుప్పటి కప్పి ఉంది. పక్కనే మూర్తీభవించిన దుఃఖంలా, రాతి బొమ్మలా కూలబడి ఉంది రత్నమాల. ఏడుస్తున్నదా? ఏమో, తెలియడం లేదు. పక్కనే పసిపాప, నేలమీద దోగాడుతూ....

పావని అక్కడే నిలబడి చేతివ్రేళ్ళు విరుచుకున్నాడు. రత్తయ్య మౌనంగా నిలబడి ఉన్నాడు.

ఆమె ఉన్నట్టుండి తల ఎత్తి చూసింది. కళ్ళలో ఏ భావమూ లేదు. అంతకు ముందు కాస్సేపు ఏడ్చినట్టున్నది. ఇప్పుడు మాత్రం ఏమీ లేదు.

రత్తయ్య పావనితో "క్రిందికి వెళ్ళి వద్దాం. సూపర్నెంటు గారు వచ్చి ఉంటారు" అన్నాడు.

పావని కదిలాడు. ఇద్దరూ మెట్లు దిగుతూ ఉండగా ఒక చోట ఆగాడు.

"ఏం చేద్దాం ఇప్పుడు?" అని అడిగాడు.

"చేసేందుకేముంది? బాడీని తీసుకెళ్ళడమే"

"ఎక్కడికి? క్వార్టర్సుకా? బాగుంటుందా?"

"మరేం చేద్దాం? ఇక్కడి నుంచి ఇటే...." అంటూ ఆగాడు రత్తయ్య.

పావని "సూపర్నెంటుగారితో మాట్లాడి....తర్వాత ఆలోచిద్దాం...."అన్నాడు మెట్లు దిగుతూ....

సూపర్నెంటు గారు మధ్య వయసు వ్యక్తి. వీళ్ళను చూసి "కూర్చోమ"ని సైగచేసి "విన్నాను. ముకుందం గారు చెప్పారు" అన్నాడు.

పావని "మీతో కొంచెం మాట్లాడాలి సార్" అన్నాడు.

"ఊం!" అన్నాడు సూపర్నెంటుగారు.

"అతను నాకు బాగా సన్నిహితుడు. దురదృష్టపు రోగం ముగించుకొచ్చి పోయాడు. ఆ అమ్మాయికి గాని, అతనికిగాని 'నా' అన్నవారెవరూ లేరు. ఇల్లూ వాకిలీ ఏమీలేవు. ఇప్పుడు క్వార్టర్సుకు శవాన్ని తీసుకుపోతే బాగుండదు .... అందు కని...."

"అందుకని?" రెట్టించా డాయన.

రత్తయ్య కల్పించుకుని "అందుకని ఇటు నుంచి ఇటే...." అంటున్నాడు.

ఆయన "దాన్దేముంది? కార్పొరేషన్ వాళ్ళకు కబురు చేస్తే వచ్చి తీసుకు పోతారు....కానీ అంతకంటె మంచిపని చెయ్యొచ్చు" అన్నాడు.

ఒక్కక్షణం ఆగి మళ్ళీ "అతనికి ముప్పయి ఏళ్ళు కూడా లేవు. ఆ రోగం తప్ప శరీరంలో ఏ రుగ్మతా లేదు. ముఖ్యంగా కళ్ళు....అవి చక్కగా పనికొస్తాయి. అందువల్ల శవాన్ని యూనివర్సిటీ హాస్పిటల్‌కు ఇవ్వవచ్చు. బాడీ అంతా పని కొస్తుంది. అయితే, ఆ అమ్మాయి ఒప్పుకోవాలి. ఒప్పుదుని కాగితాల మీద సంత కాలు పెట్టాలి. అలా చేస్తే పుణ్యమూ ఉంటుంది. మీకు ఇబ్బందీ తప్పుతుంది" అన్నాడు.

పావని అదిరిపడ్డాడు.

ఒకప్పుడెప్పుడో రామకృష్ణతో అలాటి సంభాషణే జరిగింది. రామకృష్ణ సరిగ్గా ఇదే అన్నాడు.

"ఊరికే వృథాగా శవాన్ని దహనం చేసిగాని, పూడ్చిపెట్టిగాని డిస్పోజ్ చెయ్యడం కంటె కళ్ళు, మూత్రపిండాలు పనికొస్తాయి కాబట్టి సద్వినియోగం చెయ్య వచ్చు. మన కళ్ళతో మనం పోయిన తర్వాత ఎవరో ఒక చూపులేని దురదృష్టవం తుడు లోకాన్ని చూసి ఆనందించడం అద్భుతంగా ఉండదూ?"

ఆ మాటలు గుర్తువచ్చి పావని చలించిపోయాడు.

"సరే, మాట్లాడి చెబుతాను" అంటూ లేచాడు.

రత్తయ్య అతన్ని అనుసరించాడు.

ఇద్దరూ వెళ్ళి ఆమెకు దాపులో నేలమీద కూలబడ్డారు.

పావనిని చూసి అప్పుడామె కొంగు నోటిలో కుక్కుకుని, వెక్కి వెక్కి ఏడ్చింది.

పావనికి ఏం మాట్లాడాలో, ఎలా ప్రారంభించాలో తెలియలేదు.

అనలతనికి ఇలాంటి అనుభవం ఎప్పుడూ ఎదురుకాలేదు. అతను చూసిన చావులు మాత్రం ఎన్నని? చిన్నప్పుడు తాతగారి చావు చూశాడు.

చావు కూడా కాదు - శవాన్ని చూశాడు.

"ఊరుకో. ఊరుకో అమ్మా" అన్నాడు రత్తయ్య.

రత్తయ్యే మళ్ళీ కలగజేసుకుని "ఇదుగో అమ్మాయీ! చెప్పేది జాగ్రత్తగా విను. సూపర్నెంటుగారు మంచి సలహా చెప్పారు. ఇప్పుడీ శవాన్ని తీసుకుని క్వార్టర్సుకు వెళ్ళలేము కదా! అక్కడ అందరికీ ఇబ్బంది" అని చెప్పుకుపోతున్నాడు.

ఆమె అప్పుడు తల ఎత్తి చూసింది.

"అందువల్ల, సూపర్నెంటుగారు ఏం చెప్పారంటే....నువ్వు ఒప్పుకుంటేనే అమ్మా....యూనివర్సిటీ జనరల్ హాస్పిటల్‌కు ఇస్తే...."

పావని కలగజేసుకున్నాడు.

"వాళ్ళు....కళ్ళు తీస్తారు. చూపులేని ఇద్దరు దురదృష్టవంతులకు చూపునిస్తారు. ఇదంతా మనం ఒప్పుకుంటేనే."

ఆమె విచిత్రంగా చూస్తూ వింటున్నది.

"ఒకప్పుడు రామకృష్ణ నాతో అన్నాడు. చనిపోయాక ఈ కట్టెను కట్టెలపాలు చేయడం కంటె ఇట్లా అవయవాలు సద్వినియోగమైతే మంచిదని అన్నాడు."

ఆమె అర్థం చేసుకుని మెల్లగా రోదించింది.

"దిక్కులేని పక్షులమైపోయాం....చివరకు...."

"ఊరుకో అమ్మా! గత్యంతరం లేక కాదు. మంచిపని చేస్తున్నామని కూడా ఆలోచించు" అన్నాడు రత్తయ్య.

ఆమె చివరకు తల ఊపింది.

పావని నిట్టూర్చి లేచాడు. రత్తయ్య వెంటరాగా వెళ్ళి సూపర్నెంటుగారితో చెప్పగానే ఆయన "మంచిది. మంచి పని చేస్తున్నారు" అంటూ టెలిఫోన్ ఎత్తి డయల్ చేశాడు.

"మీరు కాస్సేపు ఉండండి. అంతాసజావుగాజరిగిపోతుంది" అన్నాడు.

ఇద్దరూ పైకి వచ్చి అంతకు ముందులాగానే గోడకానుకుని కూలబడ్డారు. ఆమె అలాగే శిలాప్రతిమలాగా కదలిక లేకుండా కూర్చుంది. ఏమీ తెలియని పసిపాప అక్కడే బోసిగా ఆడుతున్నది. దూరంగా మంచాల మీద ఉన్న రోగులు, వారి సన్నిహితులు కొందరు జోగుతున్నారు. అంతటా ఒక విచిత్రమైన నిశ్శబ్దం. ఎక్కడో దూరంగా రైలుకూతలు.... చాలాసేపు గడిచినట్టనిపించి పావని గడియారం చూసుకున్నాడు. పదకొండు గంటలయింది.

ఇంతలో బూట్ల సవ్వడి.

సూపర్నెంటుగారు వచ్చారు. వెంట నలుగురో, అయిదుగురో మనుషులు....

ఆయన వస్తూనే పావనికి కొన్ని కాగితాలు అందించి "ఇక్కడ....ఇక్కడ....ఆమె చేత సంతకాలు చేయించండి" అన్నాడు.

పావని వాటిని అందుకుని ఆమె దగ్గరకు వెళ్ళి కూర్చుని కాగితాలు కలం ఆమె ముందు ఉంచాడు. రత్తయ్య చేరువలో నిలబడ్డాడు.

ఆమె కదిలింది. చేయి జాపి కలం అందుకున్నది.

రత్తయ్య "అమ్మా! గుండె చిక్కబట్టుకో తల్లీ. మంచి పని చేస్తున్నావు." అన్నాడు. ఆమె ఉన్నట్టుండి గోడకు చేరగిలబడి కొన్ని క్షణాలు రోదించింది. తర్వాత తనను తాను సంబాళించుకున్నది. సంతకాలు చేసింది. పసిపిల్లను ఒళ్ళోకి తీసుకుంటూ లేచింది. గోడకానుకుని నిలబడింది.

పావని కూడా లేచాడు.

సూపర్నెంటుగారు కాగితాలు అందుకుని చూసుకుని గంభీరంగా-

"మంచి పని చేశావమ్మా! ఇలా ఎక్కువమంది చెయ్యలేరు" అన్నాడు. ఆ తర్వాత చేయి ఊపి సైగ చేశాడు.

స్ట్రెచర్‌తో ఆ మనుషులు ముందుకు వచ్చారు.

శవాన్ని ఎత్తి స్ట్రెచర్ పైకి చేరుస్తుండగా బలమైన గాలితెర ఒకటి వీచింది. శవం ఊర్ధ్వ భాగాన ఉన్న దుప్పటి తొలగింది.

రామకృష్ణ ముఖం అతి మామూలుగా ఉంది. నిద్రపోతున్నవాడిలా ఉన్నాడు. శవాన్ని క్రిందికి తీసుకుపోయారు.

రత్తయ్య "నేను వెళ్ళి రిక్షాలు తీసుకొస్తాను" అంటూ తాను ముందు కిందికి వెళ్ళాడు.

పావని కదిలాడు. ఆమె తన సరంజామా – ఒక సంచి మాత్రం - అందుకొంది. నెమ్మదిగా, కదులుతున్న ప్రతిమలా – ఆతని వెంట నడిచింది.

క్రింద రోడ్ల మీద కొద్దిగా జనసంచారం .... రైళ్ళు వచ్చే వేళ కాబట్టి కొంచెం సందడి....

చిన్న హోటలు ముందు, అక్కడి కిళ్ళీబడ్డీల ముందు కొందరు రాత్రించరులు– కొన్ని మాటలు....కొన్ని నవ్వులు....

ఒక రిక్షాలో ఆమె పసిదాన్ని ఒళ్ళో పెట్టుకుని కూర్చుంది. మరో రిక్షాలో మగవాళ్ళిద్దరూ ఎక్కారు. రిక్షాలు కదిలాయి. ఆయిదారు నిమిషాలు... ఇక్కడ చుట్టూ పలుచని చీకటి....క్వార్టర్సులో కొన్ని కిటికీలలో ఇంకా లైట్లు వెలుగుతున్నాయి. దూరం నుంచి చీకటి ప్రవాహంలో తేలుతున్న దీపాల ఓడల్లాగున్నాయి క్వార్టర్సు....రిక్షాలు ఆగగానే క్రింద అంతస్తులలోని వారు కొందరు - సంగతి తెలిసినవారు – లేచి వచ్చారు.

కొన్ని పలకరింపులు .... కొన్ని ఓదార్పు మాటలు ....

"ఎంత మంచివాడో అబ్బాయి! దేవుడన్యాయం చేశాడు."

"ఎంత కలుపుగోలుగా, ముచ్చటగా ఉండేవాళ్ళో .... దైవం చూడలేక పోయింది."

ఆమె నెమ్మదిగా నిశ్శబ్దంగా మెట్లెక్కి వెళుతున్నది. కొందరు ఆడవాళ్ళు ఆమెను అనుసరించి నడిచారు.

దత్తయ్య అక్కడి వారితో "కాస్త కనిపెట్టుకుని ఉండండమ్మా!" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"దానికేం నాయనా! ఇంత దెబ్బతిన్న పిల్లను జాగ్రత్తగా చూసుకోమూ. నేను కనిపెట్టుకునే ఉంటాన్లే" అన్నదొక వృద్ధురాలు.

"పదండి పోదాం" అన్నాడు దత్తయ్య.

పావని గుమ్మంలో నుంచి చూసి "అప్పుడప్పుడు వస్తూ ఉంటాము. ధైర్యంగా ఉండు. పసిపిల్లను జాగ్రత్తగా చూసుకో. ఆ పిల్లకోసమైనా గుండె రాయి చేసుకో" అన్నాడు.

ఇద్దరూ క్రిందికి వచ్చి నిశ్శబ్దంగా నడిచారు. స్టేషను దగ్గర పావని ఆగి "నేనిక ఇంటికి వెళతాను. బాగా పొద్దుపోయింది" అన్నాడు.

దత్తయ్య తలఊపి హాస్పిటల్ వైపు నడిచాడు.

పావని రిక్షా మాట్లాడుకుని ఎక్కాడు. రాత్రివేళ కావడం వల్ల ఇప్పుడు వీధు లన్నీ నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉన్నాయి.

పావని నిశ్చేతనుడై కూర్చున్నాడు.

ఇప్పుడు ఆ శవాన్ని ఏం చేస్తారు? అందమైన, విశాలమైన కళ్ళను పీకి ఏ గాజు జాడీలలోనో భద్రపరుస్తారా? రేపో ఎప్పుడో ఆ శవాన్ని విద్యార్థుల ముందు బల్లపైన పడుకోబెట్టి ఏ భాగానికా భాగంగా కోసి ముక్కలు చేస్తారా? ఒక్కొక్క ముక్కను ఒక్కొక్క గ్రూపు విద్యార్థులు విడివిడిగా తీసుకుపోయి పరీక్ష చేస్తారా? శవాన్ని ముక్కలు ముక్కలుగా కోసుకుంటూ పోతే చివరకు ఏం మిగులుతుంది? అసలు ప్రాణం అనేది ఎక్కడుంటుంది?

ఈ రిక్షా ఇంతసేపు నడుస్తున్న దేమిటి? ఎంతకూ ఇల్లు రాదేమిటి? ఇంత చలిగాలిలో చెమట పోస్తున్నదెందుకని?

అప్పుడు స్పృహలోకి వచ్చిన వాడిలా "ఇదే .... ఇదే .... తిప్పు" అన్నాడు. ఇంటి ముందు రిక్షా ఆగగానే ఒక్క ఉదుటున క్రిందికి దిగి రిక్షావాడికి అయిదు రూపాయల నోటు అందించి, తిరిగి రావలసిన రూపాయి అందుకోకుండానే గేటు తీసుకుని లోపలికి నడిచాడు.

లోపలిగదిలో కూర్చుని కునుకు తీస్తున్న ఈశ్వరి "ఏమిటన్నయ్యా, ఇంత ఆలస్యమైందేం? నీ కోసం నాన్నా, అమ్మా దిగులుపడుతూ కూర్చున్నారు" అన్నది పావని చొక్కా విప్పుతుండగా రమణయ్య పంచలో నుంచి వచ్చాడు.

"ఏరా సినిమాకు వెళ్ళావా?"

"లేదు.... లేదు" అని గొణిగాడు పావని.

"మరి.... ఇంత ఆలస్యమైందేం? ఇందాకటి నుంచి ఒకటే కంగారు పడుతున్నాం" అన్నది మాణిక్యాంబ.

"రామకృష్ణ పోయాడు...." అన్నాడు పావని.

రమణయ్యకు రామకృష్ణ బాగా తెలుసు. అందువల్ల అదిరిపడి "అయ్యో! పోయాడా? ఎప్పుడు? అని మాత్రం అడిగాడు.

"ఆంతకుముందే...."

తండ్రి ఇంకా ప్రశ్నలు వెయ్యబోతున్నాడని గ్రహించి పావని అంతా చెప్పాడు.

"వాళ్ళకెవరూ లేరుగా, క్వార్టర్సుకు శవాన్ని తీసుకుపోవడం ఇబ్బంది.... సూపరెంటెంటుగారు జనరల్ హాస్పిటల్‌కు ఫోను చేసి అంబులెన్సు తెప్పించారు. శవాన్ని వాళ్ళు తీసుకుపోయారు."

"వాళ్ళేం చేస్తారు?" అన్నది ఈశ్వరి.

"కళ్ళు తీసి ఉంచుతారు. చూపుపోయిన అంధులకు అమరుస్తారు. మూత్రపిండాలు కూడా తీసి చావుబ్రతుకుల్లో ఉన్నవాళ్ళకు ప్రాణం పోస్తారనుకొంటా."

పావని గొంతు వణికింది.

"పాపం, పోయాడా?" అన్నాడు రమణయ్య మళ్ళీ.

తర్వాత నెమ్మదిగా "పోన్లే .... అదీ మంచిదే .... బతికినా ఎన్నాళ్ళు? ఆదేం బతుకు? ఇక లేచి తిరిగేది లేదు. మంచానపడి కృశించడంకన్నా ఇదే నయం, అన్నాడు. పావని స్నానం చేసి, ఈశ్వరి వడ్డించగా నాలుగు మెతుకులు కొరికి భోజనం చేశాననిపించుకుని లేచి వెళ్ళి పడుకున్నాడు. చుట్టూ నిశ్శబ్దం .... గోడ పక్క నుంచి కీచురాళ్ళ శబ్దం....

అంతలో అతనికి నిద్ర పట్టింది. ఆ నిద్రలోనే కల....

రామకృష్ణ పడుకుని ఉన్న మంచం చుట్టూ, అతని ఒంటి నిండానూ అసంఖ్యాకంగా ప్లాస్టిక్ గొట్టాలున్నాయి అంతలో రామకృష్ణ వెర్రికేకపెట్టి లేచాడు. పెద్దగా అరుస్తూ అన్ని గొట్టాలను పీకి విసిరేస్తున్నాడు. చివరకు తలను రెండు చేతులతో పట్టుకుని విరుచుకుని విసిరిపారేశాడు. తర్వాత దీపంలాగా, ఆపైన కిరణం లాగా మారి మాయమైపోయాడు.

పావని ఉలిక్కిపడి లేచాడు.

*     *     *

రమణయ్య పేపరు చూస్తూ వరండాలో కూర్చుని వుండగా ఎదుటి ఇంటిలో నుంచి పెద్దగా అరుపులు, కేకలు వినిపించాయి.

కృపాకరరావు పెద్దగా అరుస్తూ పెళ్ళాన్ని ఘోరంగా తిట్టిపోస్తున్నాడు.

"కొడతాడేమో.... చంపుతాడేమో" అని నలుగురూ పరుగెత్తుకుని వచ్చారు.

అతడు వచ్చినవారిమీద కూడా అరుపులు సాగించాడు. కొన్ని నిమిషాల తర్వాత కసి తీరిందో ఏమో చల్లబడ్డాడు.

కొందరు పెద్దలు నెమ్మదిగా కూపీలాగి అసలు విషయం రాబట్టారు. వారిలో ఒకాయన వచ్చి రమణయ్యతో విషయం చెప్పాడు.

అంతకు ముందురోజు ....

ఉదయం పదకొండు గంటల వేళ .... మగవారు ఇంట్లో లేనప్పుడు, వారి యింటికి ఒక మొగుడూ, పెళ్ళామూ, ఒక వృద్ధురాలు, వారితోపాటుగా పదహారేళ్ళ ఆడపిల్లా వచ్చారు. చూపులకు గౌరవనీయ కుటుంబం లాగుంది .... ముందు మంచి నీళ్ళు అడిగి పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఆ ఇల్లాలితో తమ బాధ చెప్పుకున్నారు.

వారు వార్ధా నుంచి వస్తున్నారు. అక్కడ వుంటున్న కూతుర్నీ, అల్లుణ్నీ చూసి ఎర్నాకుళం బయలుదేరారు. ఎర్నాకుళంలో వారికి పెద్ద వ్యాపారం ఉంది. లక్షలాది రూపాయల వ్యాపారం .... ఇక్కడ రైలాగిన తర్వాత చూసుకుంటే తమ సూట్‌కేసులు రెండూ పోయాయి. టికెట్లతో సహా సర్వస్వం పోయి కట్టుబట్ట లతో మిగిలారు. ఆయన జేబులో కేవలం పది రూపాయలు మాత్రం మిగిలాయి. తిండీ తిప్పలూ అసలేలేవు. ఈ వివరాలు విని కృపాకరరావు భార్య ఎంతో బాధ పడింది. "ఎప్పుడు తిన్నారో ఏమో! ఏమైనా తిందురు గాని" అని జాలితో ఫల హారం కూడా పెట్టింది. వారు మొగమాట పడుతూనే తిన్నారు. ఆ తర్వాత "ఇప్పుడేం చేయాలో తోచడం లేదు. మా దగ్గర ఈ గొలుసు, గాజులు తప్ప ఏమీ మిగిలి లేవు. ఈ గొలుసు తీసుకుని తోచినంత ఇచ్చి తమను ఇంటికి పంపి పుణ్యం కట్టుకోమ"ని బతిమాలారు.

ఆమె నమ్మింది.

"ఎంత కావాలి?" అని అడిగింది.

"ఎంతో కొంత ఇవ్వు తల్లీ. చార్జీలకు సరిపడి యింటికి చేరుకుంటే చాలు. ఇప్పుడు కానికాలం దాపురించి కష్టంలో చిక్కుకున్నాము. గౌరవంగాబతికేవాళ్ళం.... ఇవాళ్టికి ఈ స్థితి వచ్చింది...." ఈ మాటలన్నీ ఆడమనిషే మాట్లాడింది. మాట్లా

డుతూ మాటిమాటికి కన్నీళ్ళు పెట్టుకుంది. "కావలిస్తే గొలుసు ఎవరికైనా చూపించుకోండి. నాలుగు సవరల గొలుసు...." అన్నది. చార్జీలకే వెయ్యి రూపాయలు కావాలి" అని కూడా అన్నది.

కృపాకరరావు అర్థాంగి కరిగిపోయి "ఇంట్లో పదిహేను వందల కంటే ఎక్కువ లేవు. మా వారు కాలేజీకి వెళ్ళారు. సాయంకాలం గానీ రారు. పోనీ ఆయన వొచ్చేదాకా ఉండండి" అన్నది.

"కాదమ్మా. తొందరగా పోతే మంచిది. ముందు గూటికి చేరుకుంటే ఇలాటి గొలుసులు కావల్సినన్ని చేయించుకోగలం" అన్నది ఆమె.

ఈ ఇల్లాలు లోపలికి వెళ్ళి బీరువాలో ఉన్న పదిహేను వందల రూపాయలు తెచ్చి యిచ్చి గొలుసు తీసుకుని వారిని సాగనంపింది. లోలోపల నాలుగు సవరల గొలుసు కేవలం పదిహేను వందలకే వచ్చిందని సంతోషించింది కూడా. వాళ్ళ రిక్షాలు మాట్లాడుకుని అనేక పర్యాయాలు తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ "ఈ కాలంలో ఇట్లా కష్టంలో ఉన్నవారికి యెవరు సాయం చేస్తారు తల్లీ? నువ్వు పుణ్యమూర్తివి. పది కాలాల పాటు పచ్చగా వుండు తల్లీ" అని దీవించి మరీ వెళ్ళారు.

కృపాకరరావు సాయంకాలం ఇంటికి రాగానే ఇల్లాలు విషయం అంతా చెప్పి గొలుసు చూపించింది. ముందు అతను కూడా సంతోషించాడు. అయినా, దాన్ని తీసుకువెళ్ళి పరీక్ష చేయించాడు. అసలు రంగు బయట పడింది "అది ఘోరమైన ఇత్తడి గొలుసు" అని తేలింది.

ఇప్పుడాయన రెచ్చిపోయి భార్య మీద కేకలు వేసి, చెయ్యి కూడా చేసుకున్నాడు.

రమణయ్య గడ్డం చేసుకుంటూ తనలో తాను నవ్వుకున్నాడు....ఎప్పుడో చదివిన టాల్‌స్టాయ్ కథ గుర్తుకొచ్చింది. "ఆశాపాశము తా కడున్నిడువు లేదంతంబు రాజేంద్ర" అన్న పోతన పద్యం కూడా గుర్తుకువచ్చింది.

ఆ ఇల్లాలు కేవలం కష్టంలో ఉన్నవారికి సాయపడాలనే సదాశయంతో ఆ పని చేసిందా? లోపల ఆశ లేదూ?

గడ్డం చేసుకోవడం ముగించి "అమ్మాయీ! నీళ్ళు పెట్టుస్నానానికి" అన్నాడు పెద్దగా.

ఈశ్వరికి ఆనాడు పెళ్ళిచూపులు. "పెందరాళే రండి ఇంటికి...." అన్నది మాణిక్యాంబ.

"అలాగే" అన్నాడు రమణయ్య.

స్నానం ముగించి, భోజనం చేసి, సంచి పుచ్చుకుని బయలుదేరుతూ ఉండగా మళ్ళీ గుర్తు చేసింది. శివుడు అక్కడే ఉండి నవ్వుతున్నాడు.

"అలాగేలేవే....ఎన్నిసార్లు చెబుతావు? ఒకటే సొద" అని విసుక్కుంటూ నడిచాడు రమణయ్య.

కాలేజీకి వెళ్ళగానే నెలరోజుల్లో జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ డ్యూటీ తగిలింది అది ఎన్ని తంటాలుపడ్డా తప్పేట్టు లేదు. రమణయ్యకు విసుగు పుట్టుకొచ్చింది.

* * *

మధ్యాహ్నం ఒంటి గంట వేళకు మాణిక్యాంబ చీరకొంగు చాటున ఏదో వస్తువును దాచుకుని ఇవతలికి వచ్చి"అమ్మాయీ! నేను ఇప్పుడే వస్తాను"అని ఈశ్వరిని ఉద్దేశించి కేకవేసి, శివుడితో "నువ్వు ఇంట్లోనే ఉండరా అబ్బాయి, చాలా పనులున్నాయి" అన్నది.

తల్లి అటు వెళ్ళగానే శివుడు లేచి కాస్సేపు అటూ ఇటూ పచార్లు చేశాడు. తర్వాత తనలో తాను ఏదో గొణుక్కున్నాడు. అమ్మ చీరకొంగు చాటున ఏమి దాచుకుని వెళుతున్నదీ అతనికి తెలుసు. అదొక వెండి కంచం....ఎప్పటిదో తాతలనాటిది. అమిత బరువు....దాని మధ్యలో ఒక బంగారు పువ్వు ఉంటుంది. దాన్ని ఎవ్వరూ వాడరు. ఎప్పుడూ పెట్లో పడి ఉంటుంది. ఇంట్లో డబ్బు అవసరమైనప్పుడల్లా దానికి కొన్ని రోజులపాటు స్థానభ్రంశం సంభవిస్తుంది. ఆవతలి వీధిలో అన్నపూర్ణమ్మగారి ఇంటికి వెళ్ళిపోతుంది. తర్వాత మళ్ళీ ఎప్పుడో డబ్బు వెసులుబాటు అయినప్పుడు నెలకో, రెణ్ణెలకో ఇంటికి చేరి మళ్ళీ ఆ పెట్లోనే పడుకుంటుంది.

శివుడు చెస్ పోటీలకు తయారవుతున్నాడు. మాధవ మీనన్‌గారితో రోజుకు అయిదారు గంటలు నిర్విరామంగా సాధన చేస్తున్నాడు. మెలకువలు నేర్చుకుంటున్నాడు. ఇంట్లో ఈశ్వరి అతనితో ఆడుతుంది. మాణిక్యాంబ అరగంటలోనే తిరిగి వచ్చింది. వస్తూనే నోట్లు లెక్కపెట్టి శివుడికి అందించి "నాన్నగారివ్వమన్నారు" అన్నది.

శివుడికి కళ్ళు చెమర్చాయి. లోపల అలాటి తలిదండ్రుల బిడ్డడైనందుకు గర్వించాడు కూడా. రాత్రికే ప్రయాణం. కృష్ణ మీనన్ కూడా తనతో సొంత ఖర్చుతో వస్తున్నాడు. "ఏమయినాసరే, ఇలా డబ్బు ఖర్చు చేస్తున్నందుకైనా తాను విజయుడై తిరిగి రావాలి" అనుకున్నాడు గట్టిగా.

* * *

రమణయ్య రెండు గంటలకే కాలేజీ నుంచి ప్రిన్సిపాల్ అనుమతి తీసుకుని బయలుదేరాడు. త్రోవలో కాసిని స్వీట్లు, కారపు వస్తువులు వంటివి కొన్నాడు.

ఇంటికి చేరేసరికి ఏర్పాట్లన్నీ ఘనంగానే ఉన్నాయి.

ప్రసన్నలీల మధ్యాహ్నం కాలేజీ ఎగగొట్టి హడావుడిగా తిరుగుతున్నది. ముందు గదిలో ఖరీదైన కుర్చీలు అయిదారు వున్నాయి. ఖరీదైనదే ఒక చాప - ప్లాస్టిక్‌ది - పరిచి ఉంది. పెద్ద టీపాయ్ తళతళలాడుతున్నది.

ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయో తనకు తెలుసు. కృపాకరరావు యింటి నుంచి కుర్చీలు, మరో పొరుగింటి నుంచి ఆ ఖరీదైన చాప వచ్చి వుంటాయి. లోపల కప్పులు, సాసర్ల వంటివి కూడా వచ్చి వుంటాయి.

రమణయ్యకు ఇదేమీ కొత్తకాదు. ఇంతకుముందు కచ్చితంగా అయిదుసార్లు ఈ హడావిడి జరిగింది. ప్రతిసారీ ఇదే తంతు. రమణయ్యకు ఈ ఆర్భాటం ఇష్టం ఉండదు. అయినా తప్పదు.

ఇవాళ ఈశ్వరిని చూసేందుకు వస్తున్నారు గొప్ప ఇంటివారు. పిల్లవాడు కల్పవృక్షంలాటి ఉద్యోగంలో ఉన్నాడు. పెద్ద జీతం సంపాదిస్తున్నాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. వాళ్ళు పెట్టిన షరతులు రెండు.

ఒకటి - పిల్ల మామూలు అందగత్తె అయి ఉండి, ఏ బ్యాంకులోనో పెద్ద ఉద్యోగం చేస్తూ ఉండాలి.

రెండు - పిల్ల అమిత అందగత్తె అయినా అయి ఉండాలి. కట్నం సంగతి ఏమీ మధ్యవర్తి ద్వారా ప్రస్తావనకు రాలేదు.

రమణయ్యకు ఎటుగూడీ ఆశ లేదు. అయితే, మాణిక్యాంబ పట్టుపట్టింది. ఆమెకు కూతురి అందం మీద అంత నమ్మకం.

నాలుగు గంటల వేళకు ఇంటి ముందు రెండు ఆటోలు ఆగాయి. తల్లి, తండ్రీ, పిల్లవాడూ, అతని మేనమామా, మేనత్తా దిగారు. ఖరీదైన మనుషులు.... ఆడంబరంగా ఉన్నారు.

రమణయ్య ఎదురువెళ్ళి "రండి....రండి" అని ఆహ్వానించాడు. ముందు గదిలో కూర్చోబెట్టాడు.

వారు స్థిమితంగా కూర్చుని అదీ ఇదీ మాట్లాడుకుంటూ ఉండగా టిఫిన్లు, డ్రింకులు వచ్చాయి.

ఎవరూ ఏమీ ముట్టుకోలేదు. రమణయ్య "తీసుకోండి" అని చెబితే మని

వేళ్ళతో ఒక్కొక్క ముక్క మాత్రం తిని ఊరుకున్నారు. "కతికితే అతకదు" వంటి డైలాగులు దొర్లించి కుర్రవాడి మేనమామ తన మాటలకు తానే నవ్వాడు.

ఈశ్వరిని అలంకరించి తీసుకువచ్చి చాపమీద కూర్చోబెట్టారు. ఇకమామూలు సాదాసీదా ప్రశ్నలు....సంభాషణలు....

"నీ పేరేమిటమ్మాయీ?"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"సంగీతం వచ్చునా?"

వంటి ప్రశ్నలు మాత్రం కొన్ని. తర్వాత అందరూ లేచారు....

ఇక మిగిలినదంతా మామూలే....

"వెళ్ళి తెలియజేస్తాం" అని భరతవాక్యం.

ముసలమ్మ గదిలోనే కూర్చుని ఉండి పదిసార్లు పిల్లలను పిలిచి "ఏం జరిగిందే" అని వాకబు చేసింది.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత శివుడు, లీల ఇద్దరూ ఎక్కడికి చేర్చవలసిన సామాను అక్కడికి భద్రంగా చేర్చి వచ్చారు.

మాణిక్యాంబ మాత్రం లోలోపల ఆశతోనే ఉంది. "సుముఖంగానే ఉన్నట్టున్నారు" అని పైకి అనేసింది కూడా.

'సదేలే' అని లేచాడు రమణయ్య. "నేనలా బజారుకు వెళ్ళి వస్తాను" అన్నాడు.

"శివుడూ! రాత్రికేగా ప్రయాణం? జాగ్రత్తగా వెళ్ళి రండి. రైలు దిగి ప్లాట్ ఫారాల మీద పచార్లు చేయకండి. రైలాగకుండా దిగకండి. అక్కడ బుద్ధిగా మసలుకుని ఆడి పేరు తెచ్చుకో" అన్నాడు.

శివుడు వినయంగా "అలాగే నాన్నా!" అన్నాడు.

రమణయ్య సెంటరుకు వచ్చాడు. మళ్ళీ అదే బీసెంటు రోడ్డు....అదే టీవీ షాపు....లోపల అట్టే హడావిడి లేదు. మోహన్ వచ్చాడు.

"కూర్చోండి....మంచి కచేరీ వస్తున్నది" అని కూడా చెప్పాడు.

రమణయ్య కూర్చుని "అన్నట్టు....ఈ టీవీ ఇక్కడే ఇలాగే ఇన్నాళ్ళనుంచీ ఉంటున్నదే - దీన్నెవరూ కొనరా ?" అని అడిగాడు.

మోహన్ నవ్వి "మీరు చూస్తున్నది రోజూ ఒకే సెట్ అనుకుంటున్నారా? ఈ సెట్లు రోజుకు ఒకటి రెండు చొప్పున వెళ్ళిపోతాయి. ఇది కావాలనుకున్న వారికి లోపల గోడవున్‌లో నుంచి తెచ్చి ఇస్తాం" అని చెప్పాడు.

పర్వీన్ సుల్తానా పాడుతున్నది.

ఎంత చక్కని రూపు! సంగీత సరస్వతి మానవి రూపు ధరించినట్టు ఆ కళ్ళలో ఎంత కాంతి! ఆ కదలికలలో ఎంత ఆకర్షణ!

'నిజంగా ఆమె గంధర్వకాంత' అనుకున్నాడు.

ం ం ం ం

సాయంకాలం అయిదు గంటలు దాటింది.

రమణయ్య ఆలోచనలో పడి నడుస్తూ ఉండగా ఎదురుగా పశ్చిమాకాశం.... ఎర్రగా రక్తసిక్తమైన వస్త్రంలాగా. ఉన్నట్టుండి ఏదో హడావిడి .... రోడ్డు కటూ ఇటూ ఉన్న దుకాణాల షట్టర్లు దారుణమైన ధ్వనిచేస్తూ కిందికి దిగుతున్నాయి.

జనం పరుగులు తీస్తున్నారు - ఆదుర్దాగానూ, భయం భయంగానూ, తోపుడు బళ్ళవాళ్ళు త్వరత్వరగా బళ్ళు నెట్టుకుంటూ పోతున్నారు. పేవ్‌మెంట్ల మీద చిన్న చిన్న హాకర్లు కంగారు కంగారుగా సామాన్లు సర్దుకుంటున్నారు. ఏదో జరగరానిది జరిగినట్టు అనిపిస్తున్నది. రమణయ్య ఒక దుకాణం షట్టర్ కిందికి లాగుతున్న వ్యక్తిని "ఏమిటి గొడవ?" అని అడిగాడు.

ఆ వ్యక్తి కంగారు పడుతూ తాళాలు వేస్తూ "ఏం జరిగిందా? ఈ ఊళ్ళో ఎప్పుడేమీ జరుగుతుందో ఎవరికి తెలుసు? ఒక పార్టీకి చెందిన ఒక ఛోటా నాయకుణ్ణి మరో పార్టీకి చెందిన వాళ్ళు బాంబులు విసిరి దాడిచేసి, గొడ్డళ్ళతో నరికి చంపారట. ఇక్కడికి సమాచారం అందింది. ఇక బాంబులతో, గొడ్డళ్ళతో, సైకిల్ చైనులతో, గడ్డ పలుగులతో ఈ పార్టీ వాళ్లు బయల్దేరారు. వచ్చేస్తున్నారు. మోటారు సైకిళ్ళు, జీపులూ బయల్దేరాయి. కనిపించినదంతా ధ్వంసం చేసుకుంటూ వస్తున్నారు. కాస్సేపటిలో ఘోరాలు జరిగిపోతాయి. మీ దారిన మీరు త్వరగా గూటికి చేరుకోండి .... ఈ దుకాణాలు మసి మసి అయిపోతాయి." అని చెబుతూనే పరుగుతీశాడు.

వెనుక దూరంగా నిజంగానే భయంకరమైన అలజడి .... వరుసగా పెద్ద పెద్ద మోటారు సైకిళ్ళు.... ఒక్కో వాహనం మీద ముగ్గురు ముగ్గురు చొప్పున బీభత్సం సృష్టిస్తూ రోడ్ల మీద కనపడిన వారినందరినీ తన్నుకుంటూ, పొడుచుకుంటూ వస్తున్నారు. అప్పటికే సిటీ బస్సులు కొన్ని దెబ్బ తిన్నాయి. కొన్ని అగ్నికి ఆహుతి అయ్యాయి. మిగిలిన బస్సులు ఆగి పోయాయి. దుకాణాలు ధ్వంసం అవుతున్నాయి. ఒక పార్టీ స్థూపాలు ఒరిగిపోతున్నాయి. జెండాలు నేల వాలుతున్నాయి. ఇక కాస్సేపటిలో పెద్ద యెత్తున విధ్వంసకాండ, దోపిడీలు మొదలవుతాయి. సంఘ వ్యతిరేక శక్తులు ఈ మంచి అవకాశాన్ని దొరకబుచ్చుకుంటాయి. వైన్ షాపులు ముందు ధ్వంసం అవుతున్నాయి.

రమణయ్య ప్రాణాలు చిక్కబట్టుకుని సందులు గొందుల వెంట పరుగులు తీసి, బందరు రోడ్డుదాటి, కట్ట ఎక్కి దిగి తన వీధి మొదట్లోకి వచ్చిపడ్డాడు. పైనుంచి చూస్తే అక్కడక్కడ దూరంగా మంటలు కనిపిస్తున్నాయప్పుడే. కొందరు వీధి పక్కల చిన్న చిన్న గుంపులుగా చేరి నెమ్మదిగా మాట్లాడుకుంటు న్నారు. వీధి మధ్యలో ఒకచోట నేలమీద దిష్టి తీసి పోశారెవరో. మందమైన వెలు తురులో అది భయంకరంగా కనిపిస్తున్నది. నల్లని బొగ్గులు .... ఎర్రని మిరప కాయలు .... తల వెంట్రుకల తుట్టెలు ....

రమణయ్యకు ఒళ్ళు జలదరించింది. నెమ్మదిగా ఇంటికి చేరుకుని 'అమ్మయ్య' అనుకున్నాడు. గుండె దడ ఇంకా తగ్గలేదు. మాణిక్యాంబ, పిల్లలు వచ్చి రమణ య్యను చూసి తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

"అమ్మయ్య! అంతటా గగ్గోలు .... గందరగోళం .... ఊరంతా భయంక రంగా ఉంది. మీరు ఇంటికెలా చేరుకుంటారో అని దిగులు పడిపోతున్నాం" అన్నది మాణిక్యాంబ.

ఆ తర్వాత వరుసగా రెండు రోజులపాటు ఊరంతా గోల .... దోపిడీలు, దహనకాండలు, లాఠీచార్జీలు. చివరకు కర్ఫ్యూ .... సగటు మానవుడి బతుకు దుర్భరం అయింది.

* * *

మాణిక్యాంబ లోపలి నుంచి ముందు గదిలోకి వచ్చేసరికి ముసలమ్మ ముక్కుతూ, మూలుగుతూ మెట్లు దిగి వెళ్ళడం చూసి నివ్వెరపోయి - కూతురితో "అమ్మడూ! నాయనమ్మ ఎక్కడికో వెళుతున్నట్టుంది. చూడు" అన్నది. ఈశ్వరి చేతిలో పుస్తకం పక్కన పెట్టి లేచి "వెళ్ళి వెనక్కు తీసుకురానా?" అని అడిగింది.

మాణిక్యాంబ ఒక్క క్షణం ఊరుకొని, అంతలోనే ఏమనుకున్నదో ఏమో "పోన్లే వెళ్ళనీయ్" అన్నది.

ముసలమ్మ గేటు దాటి వెళ్ళిన తర్వాత రెండు మూడు నిమిషాలు ఊరుకుని తర్వాత లేచింది. లోపలికి వెళ్ళి అల్మారులో దాచి ఉంచిన తాళం చెవుల గుత్తి తీసు కున్నది. ముసలామె గదిలోకి వెళ్ళి తలుపు లోపల గడియ వేసుకుంది.

మంచం క్రింద నుంచి పాతకాలపు ట్రంకు పెట్టెను ఇవతలికి లాగింది. నాలు గైదు తాళం చెవులూ ప్రయోగించాకగాని తాళం రాలేదు. తర్వాత తాళం తీసి పక్కన ఉంచి పెట్టె తెరిచింది. మూత కటకటమంటూ ధ్వనిచేస్తూ తెరుచుకున్నది.

పైన ఏవేవో పాతకాలపు పుస్తకాలు, రెండు, మూడు చిరిగిన చీరెలు, ఒక పెద్దమూట.

మాణిక్యాంబ ఆ మూట విప్పి చూసి, ఆశ్చర్యంతో తలమున్కలైపోయింది. ఆ మూటలో కొద్దిగా రూపాయలు .... రెండు రూపాయల నోట్లు....ఒకటో రెండో అయిదు రూపాయల నోట్లు .... మిగిలినవన్నీ కేవలం నాణాలు .... అయిదు పైసలు, పది పైసలు .... పావలాలు.... అర్థరూపాయలు....

మాణిక్యాంబ తేరుకుని మళ్ళీ అంతా మూటకట్టి పెట్టె ఎక్కడివక్కడ సర్దేసింది. పెట్టె తాళం వేసి, మళ్ళీ మంచం కిందికే యథాస్థానంలోకి తోసి ఇవతలికి వచ్చి నిర్విణ్ణురాలై కూర్చుండిపోయింది.

రమణయ్య తొమ్మిది గంటలవేళ ఇల్లు చేరుకుని చొక్కా విప్పుతూ కూతురితో "అమ్మడూ! మన శివుడు చెస్ బాగా ఆడతాడట కదే. మాధవ మీనన్‌గారు చెప్పారు నిజమేనా?" అని అడిగాడు.

"అవునాన్నా! బ్రిలియంట్ మనవాడు" అన్నది లీల.

ఈశ్వరి కల్పించుకుని "అవును. మంచి ప్లేయరవుతాడు" అన్నది.

"అక్కా వాడూ ఆడుతూ ఉంటారు. అప్పుడప్పుడు....నాకెలాగూ దాన్లో ఇంటరెస్ట్ లేదు. అసలు పజిల్సు....చదరంగం వంటి వ్యసనాల్లో పడితే కెరియర్ దెబ్బతింటుందని నా భయం" అన్నది లీల.

"ఏడిశావ్! చెస్ మాత్రం కెరియర్ కాగూడదా" అన్నది ఈశ్వరి.

"అది వేరు. అందరూ కార్పోవ్‌లూ, బాబీ ఫిషర్లూ అవుతారా? వాళ్ళు అదృష్టవంతులు. ఆ పిచ్చిలో పడి ఎందరు వెనకబడిపోయి ఉంటారో...."

ఆ ఇద్దరి సంభాషణ రమణయ్యకు ఆనందం కలిగించింది. తన పిల్లలూ తెలివిగలవాళ్ళు అని సంతోషించాడు.

"మాధవ మీనన్‌గారు చెప్పారు. ఎల్లుండి జరగబోయేది డిసైడింగ్ గేమ్ ఆట. మనవాడు అంతదూరం వెళ్ళాడు" అంటూ ఉత్సాహంగా స్నానానికి వెళ్ళాడు.

"పావని రోజూ అర్ధరాత్రికిగాని ఇంటికి రావడం లేదు. వాడితో ఒక్కసారి మాట్లాడండి....వాడి వైఖరి వింతగా ఉంది. మనకు కాకుండాపోతున్నాడేమో అని భయంగా ఉంది" అన్నది మాణిక్యాంబ

"ఇప్పుడేం కొంప మునిగిందని? వాడు కష్టసుఖాలు తెలిసినవాడు. బాధ్యతలూ తెలిసినవాడు. వాణ్ణి గురించి నాకు ఏ దిగులూ లేదు. బహుశా నైట్ డ్యూటీలు తరుచుగా పడుతున్నాయేమో?"

"నాకేమో అనుమానంగా ఉంది. అయినా, మీరొకసారి వాడితో మాట్లాడండి."

ఆ తర్వాత మళ్ళీ భర్తకు దగ్గరగా జరిగి "మీరప్పుడెప్పుడో అత్తయ్యగారిని బయటికి పోనివ్వద్దన్నారు. ఎందుకని?" అని అడిగింది.

రమణయ్య తల ఎత్తి చూసి ఆశ్చర్యంగా "ఆ విషయం ఇప్పుడెందుకు?" అన్నాడు.

"చెప్పండి....ఎందుకయితేనేం?"

"ఏమీ లేదులే ఊరుకో."

"మీరు నా దగ్గర దాచిపెట్టి ప్రయోజనం లేదు. శివుడు నాకు చాలారోజుల క్రిందటే చెప్పాడు. వాణ్ణి నోరు మూసుకోమని దబాయించాను. ఇటీవల ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే ఉంటున్నది. ఏమీ తోచడంలేదంటే నేనో పెద్దమ్మాయో కూర్చుని కబుర్లు చెబుతున్నాం. ఇవాళ సాయంకాలం వీధిలోకి వెళ్ళింది. నేను ఆపలేదు. అప్పుడు గదిలో పెట్టతీసి చూద్దునుకదా! ఇంత మూట....దాన్నిండా చిల్లర...."

రమణయ్య ఉలికిపడ్డాడు.

మాణిక్యాంబ మళ్ళీ "ఆమెదంతా అదొక వెర్రి....తాను ఒకవేళ ఆకస్మాత్తుగా పోతే, శరీరం దాటించడానికి ఇంట్లో డబ్బులేకపోతే ఇబ్బంది పడతామట. అని అలా కొందరు నమ్ముతారట...." అని వివరించింది.

రమణయ్య మౌనంగా భోజనం ముగించి లేచాడు. పక్క వరండాలోకి వెళ్ళి మంచంలో కాస్సేపు కూర్చున్నాడు.... ఆ తర్వాత ఎందుకో అనవసరంగా తల్లి గదిలోకి వెళ్ళాడు హడావిడిగా. చూస్తే ఆమె బోసినోరు కదలిస్తూ ఏవో ప్రార్థనలు చేసుకుంటున్నది. అది చూసి ప్రశాంతచిత్తంతోనే ఇవతలికి వచ్చాడు.

*   *   *

ఆనాడు సాయంకాలం ఫైనల్ డిసైడింగ్ గేమ్. చదరంగప్రియులందరూ ఆసక్తితో ఉన్నారు.

లాడ్జిలో శివుడు కృష్ణ మీనన్‌తో ఆడుతూ కూర్చున్నాడింతసేపూ. మధ్యాహ్నం భోజనం తర్వాత చక్కగా కాస్సేపు నిద్రపోయాడు. ఇప్పుడు ప్రశాంతంగా, హాయిగా ఉన్నాడు.

కృష్ణ మీనన్ లేచి "కాస్సేపు కళ్ళు మూసుకుని పడుకో. తెలుసుగా. ఇది ముఖ్యమైన గేమ్. ఇందులో నువ్వు గెలిచి తీరాలి. నాకా నమ్మకమూ ఉంది. నేనలా ఊళ్ళో ఒక ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళొస్తాను" అని చెప్పి వెళ్ళాడు.

శివుడు పక్క మీద వాలి కళ్ళు మూసుకున్నాడు.

తానింత దూరం వచ్చాడు. ఈనాడు గెలిస్తే విజయం తనదే. ఇక ఈ స్థాయిలో తనకు తిరుగులేదు.

ఇంతలో ఎవరో రూములోకి వచ్చారు.

ముగ్గురు యువకులు. వాళ్ళను తాను రోజూ చూస్తూనే ఉన్నాడు. ముగ్గురూ ఆటనికి విష్ చేస్తూ వచ్చి శివుడి పక్కనే కూర్చున్నారు. మామూలు సంభాషణ సాగింది. ముగ్గురూ ఏకగ్రీవంగా శివుడి ఆటను మెచ్చుకున్నారు.

"మీ ఫోటో తీసుకుంటాము" అన్నారు.

శివుడు ఇష్టపడకపోయినా ఫోటోలు తీశారు.

ఆ తర్వాత డ్రింకులు వచ్చాయి. శివుడు దాహం వేసినట్టనిపించి డ్రింక్ తిరస్కరించకుండా తాగాడు. వారు కాస్సేపు కూర్చుని అదీ ఇదీ మాట్లాడి వెళ్ళిపోయారు.

అయిదు నిమిషాలలో శివుడికి వింతగా అనిపించింది. కొద్దిగా తల తిరుగుతున్నట్టు అనిపించింది. అదీ కొద్ది క్షణాలే.... ఆ తర్వాత అంతా మామూలుగానే అనిపించింది.

కృష్ణ మీనన్ వచ్చాడు. కాఫీలు తాగారిద్దరూ. తర్వాత స్నానం చేసి ఫ్రెష్‌గా తయారైనాడు.

నిర్దిష్ట సమయానికి ఆట ప్రారంభమయింది. అందరూ ఈ ముఖ్యమైన గేమ్‌ను ఉత్కంఠతో చూస్తున్నారు.

శివుడి ప్రత్యర్థి.... శివుడి కన్నా వయసులో రెండు మూడేళ్ళు పెద్దవాడు. మంచి సంపన్న కుటుంబానికి చెందినవాడు.... ఆటలో నైపుణ్యం ఉంది కాని, శివుణ్ణి గెలవడం అనుమానమే. కాకపోతే ఈ ఆటనూడా డ్రా చెయ్యగలదేమో అనుకుంటున్నారందరూ.

ఉన్నట్టుండి ఆటలో దశ మారింది. శివుడెందుకో ఒకసారి కణతలు నొక్కుకున్నాడు. నుదురు రుద్దుకున్నాడు. శివుడి బలానికి గడ్డు సమయం ఆసన్నమైంది.

"ఇలాటి తప్పు చేశాడేమిటి?" అని కృష్ణ మీనన్ దిగ్భ్రాంతితో చూస్తూ ఉండగా ఆట ముగిసింది. శివుడు ఘోరంగా ఓడిపోయాడు.

ప్రతిష్ఠాకరమైన విజయం, నగదు బహుమతి. అంతకు మించి గొప్ప భవిష్యత్తు చేజారిపోయాయి.

రూముకు చేరుకున్న వెంటనే శివుడు పక్క మీద వాలిపోయాడు. కృష్ణ మీనన్ పక్కన కూర్చుని గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు.

"ఇంత ఆటగాడివి ఆ తప్పు ఎత్తు ఎట్లా వేశావు?" అని సాధించాడు.

"ఏమో? నాకు తెలియదు. అప్పుడేమిటోగా అనిపించింది. తల నాదుగా ఉంది. ఒక టాబ్లెట్ ఏదైనా తెప్పించు."

కృష్ణమీనన్ అనుమానిస్తూ "నేను బయటికి వెళ్ళినప్పుడు ఎవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"ఆఁ! ముగ్గురు వచ్చారు. ఫోటోలు తీసుకు వెళ్ళారు. నేను తప్పక గెలుస్తానని నన్ను మెచ్చుకున్నారు. డ్రింకులు కూడా తెప్పించారు."

"తాగావా?"

"ఆఁ."

"మామూలు డ్రింకులేనా?"

"మామూలు డ్రింకులే....కూల్ డ్రింకులే."

కృష్ణ మీనన్‌కు ఏదో అర్థమయినట్టనిపించింది. ఇక మాట్లాడటం అనవసరం అనిపించింది. ఒక్క నిమిషం ఆగి "సరే....కాస్సేపు పడుకో. రాత్రికి భోజనం చేసి రైలందుకుందాం" అని లేచాడు.

* * *

శివుడు లోపలికి వస్తున్నాడు.

రమణయ్య పంచలో నుంచి చూశాడు. మాధవ మీనన్‌గారు రోజూ ఎప్పటి విషయం అప్పుడు తెలియజేస్తున్నారు.

రమణయ్యకు అనుమానం కలిఁంది. మామూలు హ్యాండ్ బ్యాగుతో వస్తున్న శివుణ్ణి "అక్కడ అంతా బాగా జరిగిందికదా? డబ్బుకు ఇబ్బంది పడలేదు కదా?"అని పలుకరించాడు.

శివుడు తల అడ్డంగా ఊపి లోపలికి పోయాడు. అతని కళ్ళ వెంట నీళ్ళు ఉబికి వచ్చాయి. అతనికీ తన తప్పు తెలిసివచ్చింది.

ధనవంతుడు ఏమైనా చేయగలడు. వాడు తనకు నైపుణ్యంలేని విద్యలలో కూడా విజయాలు సాధించగలడు. లేకపోతే విజయాన్ని కొనుగోలు చేయగలడు కూడా. వాడికి అనేక ఉపాయాలుంటాయి. ఉపాయాలు చెప్పేవారుంటారు. అన్నిటికీ మూలమైన ధనం ఉన్నంతకాలం వాడికి ఢోకా లేదు. వాడు పరీక్షలలో, ఎన్నికలలో, వ్యాపారంలో, వాణిజ్యంలో, కళలలో - అన్నింటిలోనూ ప్రథముడిగా రాగలడు. రాణించనూ గలడు. వాడికి హంగుదారులుంటారు. మనమో? మామూలు మనుషులం, మనకు ధనబలం లేదు. అందువల్ల ఏదీ లేదు. ఏదీ రాదు. ఎందులోనూ రాణించ లేము. రాణించనివ్వరు. పైమెట్టుదాకా వచ్చినా అక్కడే ఆగిపోతాం శాశ్వతంగా.

"ఇంతవరకూ రావడం మాత్రం గొప్పకాదూ? ముందు ముందు ఇంకా బాగా ప్రాక్టీసు చేసి మనవాడు పైకొస్తాడు" అంటున్నాడు రమణయ్య మాణిక్యాంబతో.

శివుడు తనలో తాను నవ్వుకున్నాడు.

ఆనాడు రమణయ్య ఇంటికి వచ్చేసరికి ఇంట్లో వాతావరణం అంతా చిత్రంగా ఉంది.

మాణిక్యాంబ లోపలి గది గుమ్మంలో కూలబడి ఉంది. కళ్ళు — అప్పటి వరకూ ఏడ్చిందేమో - ఎర్రగా ఉన్నాయి.

ఈశ్వరి బొమ్మలాగా బల్లకానుకుని నిలబడి ఉంది.

ప్రసన్నలీల కిటికీలో కూర్చుని ఉంది.

శివుడు జేవురించిన ముఖంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు. పావని అసహనంగా అటూ ఇటూ కదులుతూ కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

రమణయ్య లోపలికి అడుగు పెడుతూనే "ఏమిటి సంగతి? ఎందుకలా ఉన్నారందరూ?" అని అడిగాడు.

మాణిక్యాంబ మూలుగుతూ లేచింది.

లోపలికి వెళుతూ కళ్ళు తుడుచుకుంది. "ఏమిటో మీ అబ్బాయినే అడగండి. .... సుపుత్రుణ్ణి మెచ్చుకుంటూ ఉంటారుగా...." అన్నదామె రుసరుసలాడుతూ.

రమణయ్య నవ్వుతూ "ఏమిట్రా అబ్బాయీ సంగతి?" అని అడిగాడు. పావని నెమ్మదిగానూ, స్పష్టంగానూ చెప్పాడు.

"నాన్నా! మీరైనా నన్ను అర్థం చేసుకోండి. నేనొక సాహసం చేశాను. అది చెయ్యవచ్చునో, లేదో కూడా తెలియదు .... అదే .... రామకృష్ణ పోయాడుగా. ఆ అమ్మాయి దిక్కులేనిదై పోయింది. ఆనాటి నుంచి ఊరికే ఏడుస్తూ పడి ఉండేది. పసిపిల్లను కూడా చూసేది కాదు. పక్క భాగంలో ఉన్న వాళ్ళు దయతలచి పిల్లను చూస్తూ ఉండేవారు. నేనప్పుడప్పుడు వెళ్తూనే ఉన్నాను. ఆమెను చూస్తూ వుంటే భయం వేసేది. ఇటీవల ఒకనాడు ఫ్యానుకు చీరె బిగించి ఆత్మహత్య చేసుకోబోయిందట."

ఈ లోపల మాణిక్యాంబ లోపలి నుంచి భర్తకు కాఫీ తెచ్చి ఇస్తూ అందుకుంది.

"అందుకని ఈయన గారు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాట్ట. అందుకా అమ్మాయి ఒప్పుకున్నదిట. మూడు రోజుల కిందట ఘనకార్యం చేసి, ఇప్పుడు చెప్పడానికి వచ్చాడు. ఒక అనాథను ఉద్ధరించాడట. సంఘ సంస్కర్త బయల్దేరాడు...."

రమణయ్య అదిరిపడ్డాడు.

కళ్ళు పెద్దవైనాయి.

గుండు దెబ్బతిన్న వాడిలా విలవిలలాడాడు.

తర్వాత లేచి లోపలికి వెళ్ళాడు.

మంచం మీద కూలబడ్డాడు.

ముందు గదిలో నుంచి మాణిక్యాంబ సణుగుడు వినబడుతూనే ఉంది. మిగిలినవారెవ్వరూ నోరెత్తడం లేదు.

పది నిమిషాలో, పావుగంటో గడిచి వుంటుంది.

కొడుకు తండ్రి దగ్గరకు వచ్చాడు. వంగి పాదాలకు నమస్కరించాడు.

వణికే గొంతుకతో "నాన్నా! నేను చేసింది మంచో, చెడో నాకు ఇప్పటికీ తెలియడం లేదు. అక్కడివారు నన్ను సమర్థించారు. కానీ, నాకు వాళ్ళమీద నమ్మకం లేదు. అమ్మ కోప్పడుతున్నది. బాధపడుతున్నది. మీరు చెప్పండి .... మీరేం చెబితే అది నమ్ముతాను. మీ ఆశలు వమ్ము చేశాను. అంతవరకూ అర్థమయింది. మీకు ఆశా భంగం కలిగించాను. అదీ తెలిసింది .... మాట్లాడండి...." అన్నాడు.

రమణయ్య ఉన్నట్టుండి నవ్వాడు. ఆ తర్వాత కొడుకు భుజం పట్టుకుని లేపదీసి, తానూ లేచి "నేనేమీ బాధపడడం లేదు. అనుకోనిదీ, ఊహించనిదీ జరిగినందుకు ఆశ్చర్యపోతున్నానంతే .... నువ్వు నీ పరిస్థితులలో మంచి అనుకున్నది చేశావు. ఫరవాలేదు. నాకే బాధా లేదు. కొంచెం సంతోషంగా కూడా ఉంది. ఒక దీనురాలిని, అనాథను, దిక్కులేనిదాన్ని ఆదుకున్నావు. జీవితాంతం కాపాడతానని అన్నావు. అంతేగా? దానికి బాధపడేంత కుసంస్కారిని కాను నేను. కాకపోతే అన్నీ తెంపుకుని వెళ్ళిపోకు. మేము - తల్లీ, తండ్రీ, చెల్లెళ్ళూ, తమ్ముడూ ఉన్నారని మాత్రం మరిచిపోకు. వస్తూ పోతూ ఉండు. ఆ అమ్మాయిని కూడా తీసుకురా. ఇప్పుడు కాదులే.... ఎప్పుడైనా. మీ అమ్మకేం పిచ్చిది - అలాగే సణుగుతుంది. పట్టించుకుని బాధ పడకు" అన్నాడు.

పావని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తండ్రి పాదాలకు మళ్ళీ నమస్కరించాడు. ఆ తర్వాత కన్నీళ్ళతోనే 'వస్తాను' అని విసవిస నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. రమణయ్య కన్నీళ్ళు తుడుచుకుంటున్న భార్యతో "పిచ్చిదానా! బాధపడకు. మన కడుపున పుట్టినవాడు, మన కిష్టం లేనిదయితేనేం, ఒక మంచి పని, చాలా మంది చెయ్యలేని పని ధైర్యంగా చేశాడని సంతోషించు. కాలం మారుతున్నది. అది గ్రహించకపోతే శాంతి ఉండదు. లే లే .... ఆకలవుతున్నది వొడ్డించు" అన్నాడు.

ఈశ్వరి తేలికగా నవ్వింది.

ప్రసన్నలీల నవ్వింది.

శివుడు పైకి నవ్వలేకపోయినా లోలోపల గాలివాన తేలిపోయినందుకు సంతోషించాడు.

ఏమనుకున్నదో ఏమో మాణిక్యాంబ కూడా కళ్లు తుడుచుకుని—
"లేవండి .... అందరూ రండి .... వడ్డిస్తాను" అంటూ లోపలికి నడిచింది.

* ♦ *

ఎలక్షన్లొస్తున్నాయంటేనే, అందునా ఈ నగరంలో గొప్ప హడావిడి, ఆర్భాటమూ, వీధులన్నీ మారుమోగిపోతూ ఉంటాయి.

మీటింగులు పెద్ద మైదానంలోనే కాక, వీధి చివరల కూడా జరుగుతాయి. మైకుల రొదతో, కేకలు, నినాదాలతో, తిట్లు శాపనార్థాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో, జండా స్తూపాల ఆవిష్కరణలతో, బాంబుల మోతలతో నగరం అంతా దద్దరిల్లి పోతున్నది.

రమణయ్య చాలా ఎన్నికలు చూశాడు. ఎన్నికలలో పోలింగ్ ఆఫీసరుగా డ్యూటీలు చేశాడు.

ఎన్నికలంటే ఏమిటో తెలుసుకున్నాడు.

పూర్వం, అంటే ఎనభై కి ముందు సంగతి వేరు. పార్టీలు కానీ, జనం కానీ మరీ ఇంత బరితెగించి అన్యాయాలకు, అక్రమాలకు ఒడిగట్టేవారు కాదు.

అప్పుడు ఎన్నికలకు రెండు రోజుల ముందు పార్టీల గుడారాలలో, ఆఫీసులలో కొన్ని పేర్లు - ఊళ్ళో లేని వారివి, ఇళ్ళు మారి, ఊళ్ళు మారి వెళ్ళిపోయిన వారివి, చనిపోయిన వారివి - గుర్తించబడేవి. వయసు వగైరాలు సరిపోయిన వారిని నియమించుకోవడం, ఎన్నికల రోజున వారు బినామీ పేర్లతో వోట్లు వేయడం జరుగుతూనే ఉండేవి. కానీ అది చాలా తక్కువ శాతం. గెలుపు ఓటములు నిర్ణయించేంత గొప్ప శాతం కాదు.

బూత్‌లు ఆక్రమించుకోవడం. బ్యాలట్లు పేపర్లన్నీ ముద్ర గుద్ది వేసుకోవడం చాలా అరుదు.

ఇప్పుడో? ఇప్పుడలా కాదు. ఎన్నికలు అవహేళన పాలవుతున్నాయి. వైరి పక్షాలు మితిమీరిన ఉత్సాహంతో జనం వోట్లు వేయకపోయినా గెలిచి తీరాలనే ఘోరమైన పట్టుదలతో అనేక అకృత్యాలకు ఒడిగడుతున్నాయి. కులాలు, మతాలు శాఖలే కాదు, ఇప్పుడు రుబాబు, దౌర్జన్యం పెరిగాయి.

కుట్రలు కుటిలోపాయాలు, బెదరింపులు, బాంబు ప్రయోగాలు, బూత్ క్యాప్చరింగులు బలిశాయి. ఇక దొంగ వోట్లకు అంతేలేదు.

రమణయ్య ఈ డ్యూటీ తప్పించుకుందామని "మా అమ్మగారు మంచంలో వుండి ఇప్పుడో, మరి కాస్సేపటికో అనేట్టుంది. నన్ను మినహాయించండి" అని పెట్టుకున్న కాగితాన్ని నిర్దాక్షిణ్యంగా విసిరి కొట్టారు అధికారులు. 'దాంతో పోన్లే ఉన్న ఊళ్ళోనే వేశారు. అందుకు సంతోషిద్దాం' అనిసరిపెట్టుకున్నాడు.

రెండు ఎలక్షన్ క్లాసులకు వెళ్ళాడు.

తన ప్రిసైడింగ్ ఆఫీసర్ చిన్నవాడు. పేరు రామేశం. కాలేజీ లెక్చరర్. హుషారుగానే ఉన్నాడు. కానీ, అనుభవం లేమి తెలుస్తూనే ఉంది.

మరునాడు పోలింగ్ అనగా ఉదయం ఎనిమిది గంటలకే పని మొదలయింది. పదకొండు గంటలకు ఎన్నికల సామగ్రి ఇచ్చారు. అన్నీ సరిగా లెక్క చూసుకుని రూటు లారీ బయలుదేరే సరికి మూడు గంటలయింది. అప్పటి వరకు కాఫీలు, టీలే ఆధారమైనాయి. తమ బూతు ఉన్న స్కూలు దగ్గరికి చేరి, సామాను దించు కునేసరికి అయిదు గంటలు దాటింది.

చూస్తే ఆ ప్రాంతం అంతా ఒక్కటే వర్గం. ఒకటే రంగు. రోడ్ల పక్కన ఇళ్ళ ముందు, స్తంభాలకు, చెట్లకు ఒక్కటే రంగు. అంతకు ముందు ఆ ప్రాంత మంతా ఖాళీ స్థలాలే. ఇటీవల కాలేజీలు, అపార్టుమెంటులు పెరిగి ఆ ప్రాంతమంతా బంగారం అయింది.

ఆ స్కూలు ఒక పెద్ద రేకుల షెడ్డు .... చివరగా తమ బూత్.... రామే శం, రమణయ్య మిగిలిన ఇద్దరు రైల్వే ఉద్యోగులూ అన్నీ సర్దుకుని అమర్చు కునే సరికి బాగా పొద్దుపోయింది. వీధి లైట్ల వెలుతురు ఆవరణలోకి కొంతమేరకు పడుతున్నది. కాని లోపల తమకు కొవ్వొత్తులే శరణ్యం అయినాయి.

తొమ్మిది దాటిన తర్వాత రమణయ్య రామేశంతో "మీరు కొన్ని బ్యాలట్ పేపర్ల మీద సంతకాలు చేసుకొని ఉంచుకోండి. నేను ఇంటికి పోయి కాస్త ఎంగిలి పడి వస్తాను" అని చెప్పి బయలుదేరాడు.

ఇంటికి వెళ్ళి స్నానంచేసి, త్వరత్వరగా భోజనం ముగించి మళ్ళీ తిరిగి వచ్చాడు. ఇక చాలాసేపు బ్యాలట్ పెట్టె సీలు చేయడం, మూయడం వంటివి రామే శానికి వివరించాడు. తర్వాత పేపర్లు పరుచుకుని నిద్రకు ఉపక్రమించారు. కానీ, భయంకరమైన రాక్షసజాతి దోమలు రాత్రల్లా నిద్ర పోనీయకుండా రక్తం పీల్చి పీల్చి వదిలిపెట్టాయి.

నిద్ర కరవైంది.

అంతలోనే భళ్ళున తెల్లవారింది. చుట్టుపక్కలవారిని బతిమాలుకుని కాలకృ త్యాలు తీర్చుకుని కాఫీలు తాగి సిద్ధమైనారు.

"ఏజంట్ల"మని వచ్చినవారు ఒక పార్టీవారే. "ప్రత్యర్థి పార్టీ ఏజంటున"ని ఒకడు వచ్చాడు కానీ, నమ్మకం లేదు. అప్పటికే జనం బారులు తీరారు.

బెదురుతూనే రామేశం, రమణయ్య సలహా సంప్రదింపులతో బ్యాలట్ బాక్సు జయప్రదంగా సీలు వేసి నిట్టూర్చాడు.

ఇక పోలింగ్ ప్రారంభం అయింది.

ముందు మహా ఝుమ్మరం.... రెండు మూడు గంటలసేపు భయంకరమైన ఒత్తిడి.... ప్రశ్నలకు, జవాబులకు సంజాయిషీలకు వీలేలేదు.

క్యూలో ఉన్నవారు కావాలని "ఆలస్యం జరుగుతున్నదని"ని కేకలు వేశారు. ఎవరు ఎవరి వోటు వేస్తున్నారో, ఎవరెన్ని వోట్లు వేస్తున్నారో కనుగొనేందుకు వీలేలేదు.

అంతగా ఒత్తిడి సృష్టించారు.

మధ్య మధ్య ఒక్కొక్కడు వచ్చినప్పుడు ఏజంట్లే "నీ వోటు పోలయిపోయింది. వెళ్ళిపో" అని దబాయించి పంపించడం జరుగుతున్నది. ఎవడైనా వోటరు గట్టిగా మాట్లాడితే ఏజంటు లేచి వెళ్ళి "సజావుగా ఇంటికెళ్ళాలని లేదా ఏం?" అని బెదరించడం కూడా జరిగింది.

పోలీసు ఒకడు ఉన్నాడు కానీ, కళ్ళు మూసుకుని ఏదో ధ్యానంలో ఉన్నట్టే ఉన్నాడు తప్ప ఉపయోగపడేవాడిలా లేడు.

ఒక పార్టీవారిదే ఇష్టారాజ్యం అయింది.

మధ్యాహ్నం దాటాక క్యూల నిడివి తగ్గింది కానీ, జోరు తగ్గలేదు. మధ్యలో ఎందరో పది పన్నెండేళ్ళ పిల్లలు కూడా వచ్చి వోట్లు వేశారు.

నాలుగు గంటల వేళ చాలాసేపు క్యూలో నిలబడిన ఇద్దరు మధ్య వయసు స్త్రీలు-కష్టజీవుల్లా కనిపిస్తున్న వారు - వచ్చారు.

ఏజంటు " మీ వోట్లు పడిపోయాయి, వెళ్ళిపొండి" అన్నాడు. వారిలో ఒకామె "వోటు పడిపోయిందా? ఎట్లా పడిపొద్ది?" అని రెట్టించింది.

"పడిపోయిందంటున్నాంగా - వెళ్ళు వెళ్ళు." ఏజంటు స్వరం కటువుగానూ, క్రూరంగానూ మారేసరికి రెండో ఆమె "ఎల్దాం పదవే" అన్నది బిక్కు బిక్కుమంటూ

"సరే.... ఎల్తాం.... ఇట్లా మా వోట్లు మీరే ఏసుకునేకాడికి ఎన్నికలెందుకు? ఈ గొడవంతా ఎందుకు? అన్నీ మీరే ఏసుకుంటే పోలా" అని సణుగుతూనే ఆమె వెళ్ళిపోయింది.

రామేశం మనసు చెడిపోయినవాడిలా కూర్చున్నాడు.

రాత్రి రమణయ్య చెప్పిన మాటలు గుర్తు వచ్చి నుదురు రుద్దుకున్నాడు.

"మనం ఏమీ చేయలేము. నిస్సహాయులం. వాళ్ళు బలంకలవారు. ఎవరి బలం ఎక్కడ మస్తుగా ఉంటే వారక్కడ ఇదే చేస్తున్నారు. అడిగే ధైర్యమూ ఎవడికీ లేదు. తెగించి అడ్డుకుంటే ఎదుటివారి ధోరణి మారిపోతుంది. "ఏం ప్రాణాల మీద ఆశ లేదా? రేపటి నుంచీ బైటికి రావా? అప్పుడు తెలుస్తుంది" అంటారు. దాంతో మామూలు మనిషి గుండెలు దడదడలాడుతాయి, ఎందుకొచ్చిన బాధ అని వెళ్ళిపోతాడు. మనం మాత్రం తెగించి మాటాడి నెగ్గగలమా? ఎవడు మనల్ని సమర్థించేవాడు?"

ఇంకో అయిదు, పది నిమిషాలు వ్యవధి ఉందనగా మళ్ళీ అకస్మాత్తుగా పెద్ద గుంపు చేరింది.

అందరూ లోపలికి తోసుకువచ్చారు.

పోలీసువాడు జనాన్ని అదుపులో పెడుతున్నట్టు నటిస్తున్నాడంతే.

ఇద్దరు ముగ్గురు రామేశం ముందుకు వచ్చారు. బ్యాలట్ పేపర్ల మీద త్వరగా సంతకాలు చెయ్యమన్నారు. అతడు బిత్తరపోయి లేచాడు. ఎదురుగా బల్లమీద కత్తి దిగబడి ఉంది. ఏజంటు నవ్వుతూ చూస్తున్నాడు. మరుక్షణంలో ఒకడు 'ఈడితో మనకేందిరా' అంటూ బ్యాలట్ పేపర్లు లాక్కున్నాడు. కూర్చుని ఏవో సంతకాలు చేశాడు. వాటిని చించుకున్నారు. తలా కాసిని పంచుకున్నారు. తీసుకుపోయి బ్యాలట్ బాక్సులో కుక్కారు. ఇదంతా మూడు నాలుగు నిమిషాలు కూడా పట్టలేదు. అంతే....మళ్ళీ అంత హడావిడిగానూ వెళ్ళిపోయారు.

అప్పుడు ఏజంట్ లేచి వచ్చి "సార్! టైమ్ అయిపోయింది" అన్నాడు.

తమ పని పూర్తి అయింది కదా! ఇంక ఆలస్యం ఇష్టం లేదతనికి.

అందరూ లేచి ఆ అన్యాయాల పెట్టెను భద్రంగా సీల్ చేయించారు. సంతృప్తిగా వెళ్ళిపోయారు.

మధ్యాహ్నం ఎవరో పంపిన పులిహోర పొట్లాలు అలాగే పడి ఉన్నాయి. ఇప్పుడు పని అంతా ముగించుకుని ఆకలికి తాళలేక వాటిని విప్పితే అవి ఘోరమైన వాసన కొట్టాయి.

తర్వాత ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు వెళ్ళిపోయారు. రమణయ్య మాత్రం రామేశానికి తోడుగా ఉండిపోయాడు.

తొమ్మిది గంటలకుగానీ లారీ రాలేదు. అందులో పడి కార్పొరేషన్ బిల్డింగులో బ్యాలట్ బాక్సులను, ఇతర కాగితాలను అప్పగించి బయటపడేసరికి పదకొండు గంటలయింది.

రామేశం ఒక్కసారి గాలి పీల్చి వదలి, నుదురు తుడుచుకుంటూ రమణయ్య వంక చూసి విషాదంగా నవ్వాడు.

"నేను పాలిటెక్స్ చెబుతానండీ కాలేజీలో. ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, సాంఘిక న్యాయం వంటి పెద్ద విషయాలను గురించి పిల్లల ముందు వాగుతాను. ఇవాళ తెలిసింది. అంతా రబ్బిష్. మీరు పెద్దవారు. చాలా సాయంచేశారు. థ్యాంక్స్. వస్తాను" అంటూ చీకటిలో నడిచిపోయాడు.

రమణయ్య అక్కడి కుండలోని నీళ్ళు కాసిని గొంతులో పోసుకుని తానూ ఇంటిదారి పట్టాడు.

పంతెన దాటి రోడ్డెక్కి కట్ట దిగి మళ్ళీ కింది రోడ్డు పట్టుకుని నడిచాడు. ఇది పురుగుల సీజను. అందువల్ల లోపల అసంఖ్యాకంగా పురుగులు పడి లైట్లు మందంగా వెలుగుతున్నాయి.

రమణయ్య కాళ్ళీడ్చుకుంటూ నడిచాడు.

ఈ వీధి మొదట్లో ఒక పెద్ద ఆవరణ.

ఒక వడ్డీ వ్యాపారి కమ్ రిక్షా యజమాని కమ్ గేదెల ఆసామీది. అన్నీ బ్యాంకు రుణాల మీద ఏర్పడ్డవే. అతని చేతి కింద దాదాపు పాతిక, ముప్ఫయ్ రిక్షాలున్నాయి. అవి రాత్రింబగళ్ళు నిరంతరాయంగా తిరుగుతూ ఉంటాయి. బక్క ప్రాణులు వాటిని తీసుకుపోయి గుండెలు పగిలేట్టు కష్టపడి తొక్కి, పాతికో పరకో సంపాయించి తెచ్చి ఇతనికి అద్దెలు కడుతూ ఉంటారు. ఆ తర్వాత మిగిలిన దానిలో రెండు మూడు సారా పొట్లాలకు పోను మిగిలేది పెళ్ళాం పిల్లలకు చేరుతుంది.

వెనక ఆవరణలో పెద్ద పెద్ద విదేశీ జాతి ఆవులు, గేదెలు. వాటి మీద ఆదాయం సరేసరి. ఆ వ్యక్తి మాత్రం ఎప్పుడూ మోకాళ్ళు దిగని ఎర్రని పంచెతో పరమ సాదాసీదాగా ఉంటాడు. నోరు పెద్దది. అతని భార్య నోరు మరింత పెద్దదీ చెడ్డదీనూ....వారికి సంతానం లేదు.

వీధి చివర మరో పెద్ద ఆవరణ.

అందులో ఒక రమ్య హర్మ్యం.

చుట్టూ అందాల పూలచెట్లు....ఎప్పుడూ కొత్తగా తళతళలాడుతూ ఉండే కార్లు....రెండో-మూడో-నాలుగో.

గాలి కొట్టిన బంతుల్లాగా ఆరోగ్యం తొణికిసలాడే ఇద్దరు మగపిల్లలు .... సినిమా హీరోయిన్లను తలదన్నే ఇద్దరు ఆడపిల్లలూ....ఆ ఇంటి యజమానికి అట్టే చదువులేదు. కానీ అద్భుతమైన తెలివితేటలున్నాయి.

అతనికి తండ్రి ఇచ్చిపోయిందల్లా మంచి సెంటరులో వెయ్యి గజాల ఖాళీ స్థలం. అదీ అతను కష్టపడి సంపాదించింది కాదు.

ఒకప్పుడు ఆ స్థలంలో అతడొక గ్యారేజి పెట్టాడు.

స్థలం యజమానులు ఎక్కడో ఉండేవారు. అతడు అద్దె చెల్లించేవాడు.

సంవత్సరాలు గడిచేకొద్దీ అతడు పాతుకుపోయాడు.

ఖాళీ చెయ్యమంటే ఎదురు తిరిగాడు.

చివరకు ఆ స్థలం యజమానులు ఆ స్థలాన్నీ అందులోని పాత బిల్డింగునూ పరమ చౌకగా అతనికే అమ్మేయక తప్పింది కాదు. దాన్నిమాత్రం అతడు తన కొడుక్కు ఇచ్చిపోయాడు.

ఇప్పుడు కొడుకు దాన్ని అడ్డం పెట్టుకుని వేయిరెట్లు ఆర్జించాడు. లారీలు కొన్నాడు. బస్సులు తిప్పాడు. స్థలాలు కొన్నాడు. కాంట్రాక్టులు చేశాడు. బూతు సినిమాలు తీశాడు. బూతు పుస్తకాలు ప్రచురించాడు. పెద్దవారితో, తఖ్తు మీద ఉన్న వారితో పరిచయాలు, స్నేహాలు సంపాదించాడు. రాబోయే ఎన్నికలనాటికి ఎన్నికై మంత్రి పదవిని ఆధిష్ఠించబోతున్నాడు.

రమణయ్య ఇంటికి చేరుకునేసరికి అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఇంటి ముందున్న వసారా కొంచెం కొంచెంగా కుంగిపోతున్నది. పైన కప్పు నేయించి పెంకు సర్దించకపోతే వచ్చే వర్షాకాలం కష్టమే.

మాణిక్యాంబ, ఈశ్వరి - ఇద్దరూ లేచారు.

లీల, శివుడు పక్కగదిలో నిద్రపోతున్నారు.

'భోజనం' అని భార్య అంటుండగా.... 'ఏమీ వొద్దు, కాసిని మజ్జిగ ఇవ్వు చాలు' అన్నాడు.

మజ్జిగ తాగి వాళ్ళను పడుకోమని చెప్పి ముందు గదిలోకి వెళ్ళి తల్లివంక చూశాడు. ఆమె నెమ్మదిగా గాలి పీలుస్తూ నిద్రిస్తున్నది.

రమణయ్య ఇవతలికి వచ్చి ముందు తలుపు సరిగా వేశారో లేదో చూసి పక్క వరండాలోకి వచ్చి మంచం మీద నడుం వాల్చాడు.

పలుచని గాలి....కళ్ళు మూసుకున్నాడు.

ఎడతెగని ఆలోచనలు మెదడును ఉసుళ్ళలా ముసురుకుంటున్నాయి. మరో రెండు సంవత్సరాలు, కొన్ని నెలలు సర్వీసు. అందులో తాను సాధించేవి మరో రెండు ఇంక్రిమెంట్లు....తర్వాత రిటైరయి తీరాలి.

పావని ఎలాగూ తన దోవన తాను పోయాడు. మంచే చేశాడు. అతని మీద తనకు వీసమైనా కోపం లేదు. పైగా హర్షిస్తున్నాడు కూడా.

ఇక ఈశ్వరి....బ్యాంకు పరీక్షలకు తయారవుతున్నదట.... బహుశా అలా ఎప్పుడూ సంవత్సరాల తరబడి పరీక్షలు రాస్తూనే ఉంటుంది. ప్రసన్నలీల బరువైన కామర్స్ పుస్తకాలతో ప్రయాసపడి చదివి, చదివి,చదివి, చదివి....ఒక డిగ్రీ సంపాదించుకుంటుంది. ఈశ్వరికి తోడుగా ఇంట్లో కూర్చుంటుంది.

శివుడు మళ్ళీ మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ ఇంటర్వ్యూలకు పోతాడు. అక్కడ ఎంత

తెలివితేటలు చూపించినా ఉద్యోగ దేవత అతన్ని కటాక్షించదు. లేదా తనలాగానో లేక తనకన్నా హీనంగానో ఒక మరుగుజ్జు ఉద్యోగి అయి సెటిలయిపోతాడు. చదరంగం మంటగలుస్తుంది. మాణిక్యాంబ ఇంటి సర్వీసులో ఎప్పటికీ రిటైర్ కావడం అంటూ ఉండదు. అలా ఇంటెడు చాకిరీ చేస్తూనే వుంటుంది. మరణం ఒక్కటే ఆమెకు రిటైర్‌మెంట్.

ఇక ముసలామె....

వీలయినంత త్వరగా ఎవరినీ బాధ పెట్టకుండా పోవాలనీ, పోయాక కూడా ఇబ్బంది పెట్టకూడదనీ అప్రతిష్ఠ పనిచేసి ఇంత తాపత్రయపడిందా - ఆమె అంత త్వరగా పోదు. అలాగే మంచాన పడి ఉంటుంది ఎల్లకాలమూ....

చాలాసేపటికి గాని రమణయ్యకు నిద్ర పట్టలేదు.

నిద్రలో కల....తాను తారురోడ్డు మీద నడుస్తున్నాడు.

తానొక్కడే....మరెవ్వరూ లేరు.

ఎదురుగా ఒక రెండు రూపాయల నాణెం.

దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు.

తర్వాత కొంచెం దూరంలో మళ్ళా మరో మూడు రూపాయల నాణెం.

దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు.

అంతలో అన్ని పక్కలా నేలమీద అసంఖ్యాకంగా రెండు రూపాయల, మూడు రూపాయల నాణాలు కనిపించాయి. తాను ఆయాసపడుతూ వాటిని ఏరుకుంటున్నాడు. అలుపుతో వగర్చుతున్నాడు. చెమటలు కక్కుతున్నాడు.

అప్పుడు ఉలిక్కిపడి లేచాడు.

కళ్ళు నలుపుకుని తలకింద ఉన్న మంచినీళ్ళు అందుకుని కాసిని తాగి పడుకున్నాడు.

నెమ్మదిగా మళ్ళీ నిద్ర పట్టింది.

సమాప్తం.